ఆంధ్రప్రదేశ్



సా చర్మపాంచాలికయా విభాతి

మార్చి, 1965



సంపుటి : 9
సంచిక : 5

ఆంధ్రప్రదేశ్

ఫాల్గుణం - చైత్రం
1886 - 87 శకం
మార్చి, 1965

ప్రధాన సంపాదకుడు : టి. రామచంద్రరావు

సంపాదకుడు : కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

విషయసూచిక

మొదటి అట్టి ఫొటో : శ్రీ ఎస్. ఆర్. కె. రావు

సా ధర్మపాంచాలికయా విభాతి
పుత్రీయతీవ స్మితవక్త్రశోభా

—ఆంధ్రబిల్హణ

ఆ కాంత బంగారు బొమ్మను ధరించి ముద్దాడుచుండుట చూడగా, ఇటువంటిబిడ్డ తనకు కావలెనని ఆశించి మనస్సులో తలచుచున్నదా అనునట్లు ప్రకాశించుచున్నది.

రెండవ అట్టి ఫొటో : శ్రీ ఎస్. ఆర్. కె. రావు

"అకృత్రిమాలింగన చుంబనాదిభిః
నేత్రోత్సవం సంవిదధాతి శైశవం."

—ఆంధ్రబిల్హణ

అకృత్రిమమైన ఆలింగనముచేతను, ముద్దాడుటచేతను శైశవము కన్నులపండువుగా నున్నది.

మూడవ అట్టి ఫొటో : శ్రీ టి. రామచంద్రరావు

"సుధాసౌందర్యం తే సలిలమశివం నః శమయతు"

—పండితరాజ జగన్నాథ

"(ఓ గంగాభవానీ!) అమృతమువలె సుందరమైన నీ సలిలము మాయొక్క అశుభములను శమింపజేయునుగాక"

నాల్గవ అట్టి ఫొటో : శ్రీ భగవాన్‌దాస్ ఐ. ఎ. ఎస్.

"ఉపవనాంతలతాః పవనాహతైః
కిసలయైః సలయైరివ రేజిరే"

—కాళిదాస

"ఉద్యానములోని వృక్షములు, గాలి తాకిడిచేత లయ వేయుచున్నవా యనునట్లు కదలుచున్న చిగురుటాకులచేత ప్రకాశించినవి."



ముఖ్యమంత్రి లేఖ

ప్రియమైన చదువరీ,

దక్షిణాది ధాన్యాగారంగా ఆంధ్రప్రదేశ్ భారతదేశమంతటా ప్రసిద్ధికెక్కింది. ఏటా కొన్ని లక్షల టన్నుల ఆహారధాన్యాలు మిగిలే నిత్యసమృద్ధితో విలసిల్లే ధాన్యాగారం. మనకు కావలసినంత మాత్రమే మనం ఉత్పత్తి చేసుకోక యింకా అదనంగా, పంట తక్కువ రాష్ట్రాలవారి నిమిత్తం కూడా యితోధికంగా పండిస్తున్నాం. ఇందుకు ముఖ్యకారణం ప్రకృతిమాత మనపై ప్రసరింపజేసే చల్లని చూపే. గోదావరి, కృష్ణ, పెన్న, తుంగభద్ర వంటి పెద్ద పెద్ద జీవనదులతోనూ, ఆ నదుల పుణ్య జలాలలో తడిసి సారవంతమై విశాలంగా పరచుకున్న పంట పొలాలతోనూ ఆంధ్రప్రదేశ్‌ను ప్రకృతిమాత ఆశీర్వదించింది. దీనికితోడు మనరైతులు తెలివైనవారు. కష్టించి పనిచేస్తారు. సాధనసంపత్తులున్న వారు. అభ్యుదయాన్ని కాంక్షిస్తూ తీవ్రంగా కృషి చేసే శ్రామికులు.

రాష్ట్రప్రభుత్వం కూడా తనవంతు ప్రయత్నం తాను చేస్తున్నది. వ్యవసాయాభివృద్ధికే గాక మరింతగా భూమిని సాగులోకి తీసుకురావడానికై, రాష్ట్రంలో విద్యుదుత్పాదక శక్తిని అభివృద్ధి పరచడానికై వీలయినన్ని ప్రాంతాలకు జలాలను కదిలించడానికి కూడా యితోధికంగా రాష్ట్రప్రభుత్వం నిధులను కేటాయిస్తున్నది. తొలి పంచవర్ష ప్రణాళికలో మొత్తం కేటాయింపు రూ 94.97 కోట్లలో 36 శాతం వ్యవసాయ, నీటిపారుదల పథకాల క్రింద ఖర్చుచేయబడింది. ద్వితీయ ప్రణాళిక మొత్తం రూ 188.6 కోట్లలో 50.3 శాతం – అంటే 94.80 కోట్లు పై విషయమై ఖర్చు చేయబడ్డాయి. తృతీయ ప్రణాళికలోకూడా యీధోరణినే అనుసరించడం జరిగింది. వర్తమాన ప్రణాళికలో వ్యవసాయ, నీటిపారుదల పథకాల నిమిత్తం ఉద్దేశించినది రూ 142.84 కోట్లు మొత్తం ప్రణాళిక కేటాయింపు రూ 345.26 కోట్లలో యిది 41.4 శాతం అన్నమాట. ఈ నిరంతర కృషివల్ల తృతీయ ప్రణాళికాంతానికి ఆహారధాన్యాల ఉత్పత్తిలో నూటికి నూరుపాళ్ళు పెరుగుదల వుంటుంది,

పై అంశాలు చాలా ఆశాజనకంగానే వున్నాయి. కాని వాస్తవ పరిస్థితుల్ని పరిశీలించినప్పుడు మన రాష్ట్ర ఆర్థిక ప్రగతి యితర రాష్ట్రాలతో పోల్చిచూస్తే ఆశ్చర్యం కలుగక మానదు. ఒక ప్రాంతంయొక్క ఆర్థికాభివృద్ధిఅనేది ఆప్రాంతపు సంవత్సరాదాయం మీదా, ఆ ప్రాంతంలోని ప్రజల తలసరి ఆదాయంమీదా ఆధారపడి వుంటుంది. 1950–51 ఆఖరు నాటికి జాతీయ తలసరి ఆదాయం రూ 284 కాగా, మన రాష్ట్రంలో తలసరి ఆదాయం 256గా వుంది. ఈ మధ్యగల అంతరాన్ని పూరించడానికి మూడు ప్రణాళికల్లోనూ విశేషంగా ప్రయత్నాలు జరిగాయి. ఈ అంతరం చతుర్థ ప్రణాళికాంతానికి కూడా పూడక పోవచ్చు. పెరుగుదల శాతంతో పోల్చినప్పుడు మనరాష్ట్రంలో యీఅంకెలు చాలానిరాశాజనకంగావున్నాయి.

కాలం	అఖిల భారతదేశం		ఆంధ్రప్రదేశ్	
	ప్రణాళికా కాలంలో ఆదాయంలో పెరుగుదల శాతం	ప్రణాళికా కాలంలో తలసరి ఆదాయంలో పెరుగుదల శాతం	ప్రణాళికా కాలంలో ఆదాయంలో పెరుగుదలశాతం	ప్రణాళికా కాలంలో తలసరి ఆదాయంలో పెరుగుదల శాతం
	రూ.	రూ.	రూ.	రూ.
ప్రథమ పంచవర్ష ప్రణాళికాంతానికి	18.5	7.4	18.4	9.8
ద్వితీయ పంచవర్ష ప్రణాళికాంతానికి	19.5	7.8	11.8	4.6
తృతీయ పంచవర్ష ప్రణాళికాంతానికి	20.0	6.7	18.0	8.5

భారతదేశంలోని పెద్ద రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ అయిదవది. అయినప్పటికీ తలసరి ఆదాయంలో యిది 14వ స్థానాన్ని పొంది ఉన్నది. అస్సాం. త్రిపుర, హిమాచల ప్రదేశ్, కేరళవంటి చిన్న చిన్న రాష్ట్రాల్లో సైతం తలసరి ఆదాయం మనరాష్ట్రం కన్నా ఎక్కువే.

మన ప్రాంతంకన్నా ఆ రాష్ట్రాలు అభివృద్ధిదశలో వున్నాయంటే అందుకు కారణం ఆయారాష్ట్రాలలో పరిశ్రమలు అభివృద్ధి చెంది వుండడమే. ప్రపంచంలోకూడా పారిశ్రామికంగా అభివృద్ధిచెందిన దేశాలే బాగా అభివృద్ధిచెందాయి. ఇటీవలి కాలంవరకూ ఇగ్లండు బ్రహ్మాండమైన పారిశ్రామికదేశం.

ఇప్పుడు ఆమెరికా అన్నిదేశాలకన్నా ఈ విషయంలో అగ్రగామిగా ఉండి సౌభాగ్యవంతమైన దేశాలకన్నా శిఖరాగ్రాన్ని అందుకుంది. రెండవ ప్రపంచసంగ్రామంలో ఓటమిచెందిన పశ్చిమజర్మనీ, జపాను మొదలైన దేశాలుకూడా సత్వర పారిశ్రామికాభివృద్ధిద్వారా తమ దేశప్రజలకు ఉన్నత ఆర్థిక సౌభాగ్యాన్ని చేకూర్చాయి. అందువల్ల మన పొరుగువారితో సమానంగా నిల్వడానికి వీలుగా మన దేశాన్ని సత్వర పారిశ్రామికీకరణ చేయాల్సిన అవసరాన్ని ప్రాముఖ్యతను గూర్చి చెప్పడం అవసరమే అవుతుంది. అంతమాత్రాన మన రాష్ట్రానికి వెన్నెముకగా ఉన్న వ్యవసాయం, నీటిపారుదల రంగాలలో మనకృషిని సడలించాలని భావించుకోరాదు. ఇప్పటినుండి మన రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి దృష్టిని మరింత కేంద్రీకరించాల్సిన అవసరం ఉన్నదనిమాత్రమే చెప్పాల్సిఉంది.

పారిశ్రామికాభివృద్ధికి కావలసిన అన్నిహంగులు మన రాష్ట్రంలో ఉన్నాయి. నీరు పుష్కలంగా లభిస్తుంది. మన రాష్ట్రంనుండి ప్రవహించే పెద్దనదులలో అన్నికాలాలలో నీరులభిస్తుంది. ఖనిజ సంపద, బొగ్గు అపారంగా లభిస్తున్నది. విద్యుచ్ఛక్తికిగానీ, సాంకేతికసిబ్బందీ, నేర్పుగల కార్మికులకుగానీ మన రాష్ట్రంలో కొరత లేదు. వివిధరకాల పరిశ్రమలు నెలకొల్పడానికి అనువైన సహజ శీతోష్ణస్థితికూడా ఉంది. పారిశ్రామికీకరణకు తీవ్రకృషి జరిపినచో ప్రస్తుతం ఉన్న అసమానతను సాధ్యమైనంత త్వరలో తొలగించవచ్చు.

రాష్ట్ర అదాయాన్ని సాధ్యమైనంతవరకు జాతీయ అధాయంతో సమంగా పెంచడానికి నాలుగవ ప్రణాళికలో రూ. 1500 కోట్ల నికరపెట్టుబడి అవసరమవుతుందనే విషయం మీకు తెలిసి ఉండవచ్చు. రాష్ట్ర, కేంద్ర, ప్రైవేటురంగాల పరంగా జరిగే పెట్టుబడులకు యిది ప్రాతినిధ్యం వహిస్తుంది. కేంద్రరంగంలో జరిగే పెట్టుబడి, రాష్ట్ర ఆర్థికస్థితిని ప్రత్యక్షంగా ప్రభావితం చేసేవిధంగా ఉండాలి. పెట్టుబడుల విభాగం దిగువవిధంగా ఉంటుంది :

1. రాష్ట్రరంగం ... రూ. 550 కోట్లు
2. కేంద్రరంగం ... రూ. 700 కోట్లు
3. ప్రైవేటురంగం ... రూ. 250 కోట్లు

రాష్ట్ర రంగంలో అవసరమైన ఎక్కువ మొత్తాలను వినియోగించడానికి ప్రభుత్వం శాయశక్తుల కృషిచేస్తుంది. కేంద్రరంగానికి సంబంధించినంతవరకు మొదటి రెండుప్రణాళికల కాలంలో వినియోగించిన పెట్టుబడి నామమాత్రంగానే ఉంది. మూడవ ప్రణాళికా కాలంలో మాత్రమే కేంద్రప్రభుత్వం మనరాష్ట్రంలో కొన్ని పరిశ్రమలను నెలకొల్పడం ప్రారంభించింది. నాలుగవ ప్రణాళికా కాలంలో మనరాష్ట్రంలో కేంద్రప్రభుత్వం పరంగా రూ. 700 కోట్లకు తక్కువగాకుండా ఎక్కువ పరిశ్రమలను నెలకొల్పాలని కేంద్రప్రభుత్వాన్ని పదేపదే కోరడం జరుగుతున్నది. ఈ సందర్భంలోనే యితర సౌకర్యాలతోపాటుగా పారిశ్రామిక అసమానతను కొంతవరకైనా తగ్గించడానికి వీలుగా మనరాష్ట్రంలో ఉక్కుఫ్యాక్టరీని నెలకొల్పాలని మనం వత్తిడి చేస్తున్నాము.

రాష్ట్రం, కేంద్రాలపరంగా ఎంతపెట్టుబడి వినియోగించబడినప్పటికీ, నాలుగవ ప్రణాళికాకాలంలో మనరాష్ట్రంలో ప్రైవేటు రంగం ప్రముఖమైనపాత్ర వహించాల్సిన అవసరం చాలాఉంది. విస్తృత ప్రాతిపదికపై విరివిగా పరిశ్రమలను నెలకొల్పడానికి స్వేచ్ఛగా ముందుకు రావాలని రాష్ట్ర. రాష్ట్రేతర పారిశ్రామిక వేత్తలకు నేను విజ్ఞప్తి చేస్తున్నాను. అవసరమైనస్థలాలు, నీరు, విద్యుచ్ఛక్తి మొదలైన సౌకర్యాలు లభింపజేయడం, యుక్తమైన రాయితీలు ఇవ్వడంవంటి చర్యలను ప్రభుత్వం తీసుకుంటుంది.

ప్రభుత్వం, పారశ్రామిక వేత్తలమధ్య పరస్పర సహాయ సహకారాలు ఏర్పడి తద్వారా రాష్ట్రం ఆర్థిక సౌభాగ్యాన్ని సాధించుతుందనే నా దృఢవిశ్వాసం.

జై హింద్

"వసంతవర్ణనమ్"

డా॥ చింతామణి దేశముఖ్

శ్లో॥ "తుహినతిమిరశాంతం శీతశైథిల్యకాంతమ్
జగదఖిలమదృశ్యైః ప్రాణితైః ప్రాణయంతమ్
స్తిమితనియతిగర్భాత్ మోచయంతం వనాంతమ్
ప్రణయముకులబంధుం భూరి వందే వసంతమ్."

(మంచుచీకట్లను అణచునది, చలి సడలుట చేత మనోహరమైనది, అదృశ్యము లగు ప్రాణశక్తులచేత సమస్తజగత్తునకు ప్రోత్సాహము కలిగించునది, కదలికలేని కాలగర్భమునుండి వన్యాంతమును విడిపించునది, ప్రణయ మనెడు మొగ్గలను వికసింపజేయునదియు నైన వసంతమును విశేషముగా నమస్కరించుచున్నాము.)

శ్లో॥ "చరణచరణచారుప్రస్ఫుగత్కోరకస్య
వివిధసుమవికాసోద్భాసితాశాముఖస్య
నవకిసలయరాగాఽధ్మాతవిశ్వాఽత్మనశ్చ
మధురుచిరవిజేతుః స్వాగతం యత్ర తత్ర."

(అడుగడుగునను అందముగా వికసించుచున్న మొగ్గలు గలిగి, వివిధపుష్పములచే ప్రకాశింపజేయు దిఙ్ముఖములు గలదై, క్రొత్తచిగురుటాకుల రాగముచేత విశ్వాత్మస్వరూపుని మనస్సును గూడ ఉవ్విళ్ళూర్చుచు, మధువుచేత రుచిరముగా విజయమును సాధించుచున్న వసంతునకు, అన్నిచోట్లను స్వాగత మగుగాక.)

శ్లో॥ "కతిపయజనితానాం జంగమాజంగమానాం
స్ఫురతి హృది నవీనస్యాయురోఘస్య రంహః
తదనుసరణశీలః తత్తదుత్సర్గయోగ్యః
ముఖరయతి దిగంతాన్ భృంగనాదః పృథివ్యామ్"

(కొన్ని స్థావరజంగముల హృదయములలో నవీన జీవన ప్రవాహముయొక్క వేగము స్ఫురించుచున్నది. దానిని అనుసరించు స్వభావము గలిగి, ఆయావస్తువులకు అనుగుణముగా నుండిన తుమ్మెదల నాదము భూమండలమునందు దిగంతములను శబ్దింపజేయుచున్నది.)

శ్లో॥ "ప్రత్యగసంస్కృతిమహత్కరణీయమగ్నాః
పారావతాః చటకబుల్బులశారికాశ్చ
ఆరామసద్మ పరితో వ్రతతీషు గుల్మే–
ష్వారావమాదధత ఇష్టిగతం ను మంత్రమ్."

(నూతనసంసారములో చేయవలసిన మహాకార్యములలో నిమగ్నములైన పావురములు, ఊరబిచ్చుకలు, బుల్బులుపిట్టలు, గోరవంకలున్ను తోటలోని గృహమునలువైపుల లతలపైనను, పొదలపైనను యజ్ఞములలో మంత్రమును ఉచ్చరించువిధముగా రొద చేసినవి.)

శ్లో॥ "తేషాం పురోహిత ఇవ స్థలమున్నతం చ
పుంస్కోకిలోఽత్వరితగీః సమలంకరోతి
స్వాండాని యావదితరద్విజనీడమధ్యే
స్వస్థాత్మనా నిభృతవాక్ గృహిణీవ ధత్తే."

(గండుకోయిల, ఆ లతలు, పొదలయొక్క ఉన్నతస్థలమును, మంద్రముగా ధ్వనించు పురోహితుడువలె అలంకరించియున్నది. మరియు తన గ్రుడ్డులను ఇతరపక్షుల గూండ్లలో, శాంతముగు మనస్సుతో, నిశ్చల వాక్కు గల యిల్లాలువలె పోషించుకొను చున్నది.

శ్లో॥ "సంపన్నకార్యపికదంపతిసంఘ ఏతి
స్వాఽయాతమాధవమరుత్తరలాన్ రసాలాన్
సౌరభ్యశాస్త్రవిబుధాః ప్రథమం మిలిందాః
గుంజంతి తత్ర పరితః స్ఫుటమంజరీణామ్."

(నెరవేరిన కార్యములు గల యీ కోకిలదంపతుల సంఘము, స్వేచ్ఛగా వీచిన వసంతమారుతములచేత చలించు చున్న తియ్య మామిడిచెట్లను చేరుచున్నది. ఆ వృక్షములపైన మొదట, వికసించిన పువుగుత్తలకు నలువైపులను పరిమళమును గ్రహించు విద్యలో విద్వాంసులైన తుమ్మెదలు ధ్వనించు (తిరుగు)చున్నవి.)

శ్లో॥ "తామ్రాభమామ్రాంకురమంజరీచయం
స్వసౌరభేణ ప్రథితాఢ్యతోదయమ్
సమ్రశియం నింబతరోః సుగంధిం
విలోక్య చాఘ్రాయ మనః ప్రసీదతి."

(ఎఱ్ఱని కాంతి గలిగి, తన సువాసనచేత సంపదావిర్భావమును ప్రకటించిన మామిడిపువుగుత్తుల సమూహమును ఆఘ్రాణించియు, సువాసన గల వేపపూవుల శోభను గాంచియు మనస్సు ప్రసన్న మగుచున్నది.)

శ్లో॥ "అమ్రానమానోన్మేషపరాః సుమద్రుమాః
అశోకమందార – విహార – చంపకాః
అయుక్ఛదాః లోహితనీలపాటలాః ।
వనస్థలీషూజ్జ్వలితాసు కింశుకాః."

(ఉజ్జ్వలముగ నున్న వనస్థలులయందలి "అశోకములు, పారిజాతములు, పొగడలు, సంపెంగలు, ఏడాకుల అరటులు, రక్తచందనములు, నీలిచెట్లు, కలిగొట్టులు, మోదుగులు" మొదలైన పుష్పవృక్షములుకూడ మామిళ్ళను అనుసరించి వికసించుటయందు ఆసక్తి కలవయ్యెను.)

శ్లో॥ "వసంతసామ్రాజ్యజయధ్వజైరితః
యథా న వాయుః ప్రమదః ప్రకీర్త్యతే।
తథా తతో గుల్మలతాదిషూత్సవః
సుమోద్భవో లోకవిలోకనప్రియః॥

(వసంతఋతుసామ్రాజ్యములో విజయధ్వజములు కానున్నవారి (విరహులు) చేత ఇటు (మలయ) వాయువు ప్రమోదకరము అని కీర్తింపబడకున్నట్లే అటు లోకలోచనములకు ప్రియమై పొదలయందు, లతలయందును కన్నులపండువుగా కనబడుచున్న పుష్పోద్భవముగూడ ప్రమోదకరముగా వారిచేత కీర్తింపబడకున్నది).

శ్లో॥ "దిగంతరాసంభృతపుష్పవీరుధః
ప్రసూనగుల్మాః గణనాతిశాయనః।
ఆకారపత్రచ్ఛవిపుష్పరంజనైః
సంతర్పయత్యక్షియుగం సుగంధయః."

(దిగంతరములయందు తమ సువాసనను నింపిన పుష్పలతలు, అసంఖ్యాకములైన పువుపొదలున్ను. తమ "ఆకారములు, ఆకుల కాంతి, సుగంధపుష్పములు" వన సౌందర్యములచేత నేత్రద్వయమును సంతృప్తిపరచుచున్నవి—కన్నులపండువుగనున్నవి.)

శ్లో॥ "అద్రిప్రదేశేనవశాద్వలాంతరాం
కుందప్రసూనశ్రియమైంద్రకార్ముకీమ్। .
కశ్మీరజస్యాఽస్తరణీతతిప్రభాం
సమీక్ష్య దృక్ నిర్నిమిషా విముహ్యతి."

(పర్వతప్రదేశమునందు నూతనములైన పచ్చికబయళ్ళ నడుమ శోభిల్లుచు, కుంకుమపువ్వుల శోభ గలిగి, యింద్రధనస్సుల కాంతిని ఈనుచున్న మల్లెపూవుల కాంతిని చూచి కన్నులు ఱెప్పపాటులు లేకుండ మోహమును చెందియున్నవి.)

శ్లో॥ "కింశుకాంశుకపిశంగమధ్యమా
నాతిచండమిహిరాంశుకంచుకా
అశ్మరాశిపరివేషదంతురా
రాజతే నవవధూరివావనీ."

(మోదుగుపువ్వు అనెడి చీరను నడుముకు ధరించి, అత్యుష్ణముగా లేని సూర్యకిరణజాల మనెడు అవికె దొడిగి, రాళ్ళపరపు అనెడి ముసుగుచేత వ్యాప్తమైయున్న భూతలము, నవవధువువలె విరాజిల్లుచున్నది.)

శ్లో॥ "వాటికాసు ధనిశాఖినాముదే-
త్యల్పజేంద్రధనుషోఽప్యసంతులా।
పుష్పరాజిరనువిద్ధశాద్వలా
యాచకాళిసహితాఽహితాంజలిః॥"

(తోటలలో, పరిపూర్ణశోభ గల యింద్రధనస్సుకంటెగూడ మించిన కాంతిగలిగి, పచ్చికబయళ్ళపైన పరువబడి. యాచకసమూహము లనెడి తుమ్మెదల అంజలులను ఆదరించుచున్న పుష్పపంక్తి ధనవంతు లనెడు వృక్షములకు పుట్టుచున్నది.)

శ్లో॥ భారతస్య నగరేషు సంకులా,
వ్యాపృతా జనపదే చ సస్యదే।
తత్ప్రజా విరమతి క్షణమాత్రం
నింబచూతతరుమూలనిషణ్ణా॥"

(భారతదేశ నగరములయందు విశ్రాంతిలేక సందడి గొనియుండి. పంటచేలుగల గ్రామసీమలలో, కార్యనిమగ్నులై అలసియున్న భారతప్రజలు పూచిన వేపచెట్లు,మామిడిచెట్ల మూలములయందు కూర్చొని క్షణకాలము విశ్రాంతిని గొనుచున్నారు).

శ్లో॥ "మంథరే హి సరతో దినరాత్రీ;
ద్రాగపేతి తరణేః కర మాంద్యమ్; ।
చైత్ర ఏతి చ కదుష్ణసమీరః
మాధవీం తరుశిరస్సు రంజయన్."

(రాత్రి, పగలు రెండును మెల్లమెల్లగా నడుచుచున్నవి; సూర్యకిరణములకు త్వరగా మాంద్యము సడలుచున్నది. నులివెచ్చని గాలితో గూడిన చైత్రుడు, వృక్షరాజి తలలపైన మాధవిలతను రంజింపజేయుచు క్రమముగ ముందుకు సాగుచున్నాడు).

శ్లో॥ "ఉపవనే తపనాఽహితశర్కరం
నవరసాలఫలం చ సముళ్ను తే।
లకుచమాత్మకుచద్వయబంధురం
పురవధూరవధూతహిమాఽమయా॥"

(పట్టణ మనెడు వధువు, మంచు అనెడు రోగమునుండి విముక్తురాలై ఉద్యానవనములో సూర్యుని (వేడిమి) చేత చక్కెర (తీపి) గలిగిన నూతనమైన తియ్యమామిడిపండును, తన కుచద్వయమువలె బంధురముగ నున్న నారింజపండునున్ను తృప్తిగా భుజించు (అనుభవించు) చున్నది.)

శ్లో॥ అహిమదక్షిణమారుతపాయినీ —
త్యుపచితావయవా వనరా యథా।
తరణితాపమితేః సమమేధతే
విలయమేతి వసంత ఉదాతపః.

(వేడిమి గల దక్షిణవాయువు పీల్చిన దగుటచేత ఉబ్బిన అవయవములు గల (వాపులరోగములచేత బాధపడు) వనలక్ష్మి వలెనే వసంతముగూడ సూర్యతాపపరిమితికి సమానముగా వృద్ధి పొందుచు అత్యంతముగా వ్యాపించిన యెండవేడిమికి తాళలేక క్రమముగ నాశనము పొందుచున్నది.)

మూడవ పంచవర్ష ప్రణాళికలో విద్యాభివృద్ధి

— ఎల్. బుల్లయ్య

మన దేశానికి స్వాతంత్ర్యం లభించిన తరువాతనే ప్రాథమిక, సెకండరీ, కళాశాల - ఈ అన్ని స్థాయిలలోనూ విద్యాభివృద్ధి భారీ ఎత్తున జరిగింది. విద్యాభివృద్ధి కృషిలో భాగంగా, గ్రాడ్యుయేటు, *అండర్ గ్రాడ్యుయేటు* స్థాయిలలో ఉపాధ్యాయుల శిక్షణార్థం అదనంగా సౌకర్యాలు కల్పించారు. ఇప్పటివరకు జరిగిన విస్తృతీకరణనుగురించీ, ఇతోధిక విస్తృతీకరణకై నాలుగవ ప్రణాళికలో తలపెట్టిన కార్యక్రమాలనుగురించీ దిగువ వివరించబడింది:-

ప్రాథమికవిద్య

రెండవ ప్రణాళిక ముగింపునాటికి రాష్ట్రంలో 34,040 ప్రాథమిక పాఠశాలలు కలవు. వీటిలో 18,40,664 మంది బాలురు, 11,35,391 మంది బాలికలు – మొత్తం 29,76,055 మంది - విద్యాభ్యాసం చేసేవారు. ఈ పాఠశాలల నిర్వహణార్థం రూ. 7,60,56.000ల వ్యయం జరిగింది.

మనరాష్ట్రంలో నిర్బంధోచిత ప్రాథమిక విద్యాపథకాన్ని మూడవ ప్రణాళికారంభం నుంచి అమలుపరుస్తున్నారు. ప్రణాళికా లక్ష్యంమేరకు అదనంగా 16 లక్షలమంది విద్యార్థి విద్యార్థినులను పాఠశాలల్లో చేర్చుకోవలసివుంది. వీరికొరకు అదనంగా 28,000 మంది ఉపాధ్యాయులను నియమించవలసివుంది, జాతీయ అత్యవసర పరిస్థితివల్ల ప్రణాళికా కేటాయింపులలో కోతఏర్పడింది. ఇప్పటివరకు సాధించిన అభివృద్ధి, మూడవ ప్రణాళిక ముగింపులోగా సాధించదలచిన ప్రగతి ప్రాతిపదికపై, మూడవ ప్రణాళికలో 9ల క్షలమంది బాలబాలికలను అదనంగా పాఠశాలల్లో చేర్చుకున్నట్లు, 16,300 మంది ఉపాధ్యాయులను అదనంగా నియమించినట్లు అంచనా వేయవచ్చు.

ప్రాథమిక స్థాయిలో విద్యాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా రాష్ట్రప్రభుత్వం, మూడవ ప్రణాళికాకాలంలో, అదనంగా శిక్షణ సదుపాయాలు కల్పించే నిమిత్తం, మరో 53 సెక్షన్లను ప్రారంభించింది. రెండవ ప్రణాళిక చివరి 2 సంవత్సరాలలో తెరిచిన 87 సెక్షన్లనుకూడా కొనసాగించింది. వీటిద్వారా ఏటా అదనంగా 3200 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడానికి అవకాశం ఏర్పడింది.

ఉపాధ్యాయ శిక్షణ పొందే అభ్యర్థులకు ప్రస్తుతం చెల్లిస్తున్న స్టయిఫండు రేట్లు తక్కువగా (నెలకు రూ. 35/–) వున్నందువల్లా, జీతపుస్కేలుకూడా ఆకర్షణీయంగా లేకపోవడం (రూ. 80–150) వల్లా ఈ శిక్షణపొందడానికి అర్హతలుగల వ్యక్తులు తగు సంఖ్యలో రావడంలేదు. స్టయిపండు రేట్లను హెచ్చించే విషయమై ఇప్పుడు ప్రభుత్వం పరిశీలిస్తున్నది. నిర్బంధోచిత ప్రాథమికవిద్యా పథకం సందర్భంగా మధ్యాహ్న భోజన కార్యక్రమాన్నికూడా కొత్తగా ప్రవేశపెట్టారు.

మూడవ ప్రణాళిక ముగింపునాటికి, ప్రాథమిక విద్యారంగంలో అభివృద్ధి తొలుత పెట్టుకున్న లక్ష్యాన్ననుసరించి వుండదు. దీనిని, ప్రభుత్వం నాలుగవ ప్రణాళికా కాలంలో సాధించ వలసివుంది. చతుర్థ ప్రణాళికకు సంబధించిన వర్కింగ్ గ్రూప్ ఈ కార్యక్రమాన్నీ, దీని బాధ్యతనూ పరిశీలించినమీదట నాలుగవ ప్రణాళికా కాలంలో దిగువ పేర్కొన్న విధంగా విద్యారంగంలో ప్రగతి సాధించడానికి సిఫార్సులుచేసింది:—

మూడవ ప్రణాళికతోసహా ఇప్పటివరకు కూడా ప్రీప్రైమరీ విద్యారంగంలో చాలా తక్కువ కృషిమాత్రమే జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ప్రీప్రైమరీవిద్య అభివృద్ధి పరిస్థితిని దేశంలోని ఇతర ప్రాంతాల పరిస్థితితో పోల్చినట్లయితే సంతృప్తికరంగా వుండదు.

అందుచేత ప్రీప్రైమరీ విద్యకై సదుపాయాలను విస్తృతీకరించవలసిన, పెంపొందించవలసిన అవసరం ఎంతైనా వుంది. ప్రస్తుతం పంచాయతీ సమితులు బాలవాడీలను నిర్వహిస్తున్నాయి. అయితే వాటిని ప్రైమరీ పాఠశాల లనడానికి వీలులేదు. కాబట్టి ఇప్పుడు పనిచేస్తున్న బాలవాడీలనుకూడా అర్హతపొందిన ఉపాధ్యాయులను నియమించడంద్వారా, అవసరమైన సాధన సామగ్రిని సమకూర్చడంద్వారా పునర్వ్యవస్థీకరించవలసివుంది. దీనితోపాటు కొత్తగా ప్రీప్రైమరీ పాఠశాలలను నెలకొల్పడానికి నిధులు కేటాయించవలసిన ఆవశ్యకతకూడా వుంది. కనుక రూ. 42.3 లక్షల వ్యయంతో కనీసం 500 ప్రీప్రైమరీ సెక్షన్లను తెరవడానికి సూచించారు.

నాలుగవ ప్రణాళికాకాలంలో 100 శాతం బాలురను, 75 శాతం బాలికలను పాఠశాలల్లో చేర్చుకోవడానికి లక్ష్యంగా పెట్టుకోవడానికి సూచింపబడింది. కాని బాలికలను పాఠశాలల్లో చేర్పించే విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపు లక్ష్యం, 75 శాతంకాక

90 శాతం వుండాలని భారతప్రభుత్వం సూచనచేసింది. ప్రస్తుతం అనుసరించబడుతున్న ఉపాధ్యాయుడు — విద్యార్థులు 1: 40 నిష్పత్తి — ముఖ్యంగా ఏకోపాధ్యాయ పాఠశాలలు అధికంగావున్న దృష్ట్యా — చాలా హెచ్చు అని భావించబడుతున్నది. ఉపాధ్యాయుడు — విద్యార్థుల నిష్పత్తిని 1: 35 కి తగ్గించినట్లయితే, పై లక్ష్యాన్ని సాధించేందుకు చతుర్థప్రణాళికలో అదనంగాసుమారు 42,000 మంది ఉపాధ్యాయులను నియమించవలసి వుంటుంది. ఇందుకు సుమారు రూ. 13.61 కోట్లు ఖర్చవుతాయి.

వెనుకబడిన ప్రాంతాలలోని పాఠశాలల్లో బాల బాలికలను తక్కువగా చేర్పించడానికి, సాధారణంగా ఈ ప్రదేశాలలోని ప్రజల దారిద్ర్యమే ముఖ్యకారణం. బాలికలకు అటెండెన్స్ స్కాలర్‌షిప్పులు ఇవ్వడం ద్వారా, స్కూల్ యూనిఫారం, పుస్తకాలు, స్టేషనరీ, మధ్యాహ్న భోజనం లభింపజేయడం ద్వారా వెనుకబడిన ప్రాంతాలలో ప్రత్యేక సహాయక చర్యలు తీసుకోవలసి వుంది. వీటి నిమిత్తం రూ. 5 కోట్లు ఖర్చుచేయవలసి వుంటుంది. అనావృత్త వ్యయంక్రింద రాష్ట్రప్రభుత్వం భారీ మొత్తాలు వెచ్చించవలసి వస్తుంది. సమగ్ర పరిశీలన ఇంకా జరుగకపోయినప్పటికీ, కనీసం 50 శాతం ప్రాథమిక పాఠశాలల్లో, నిబంధనావళిలో నిర్దేశించిన విధంగా కనీస సదుపాయాలు అంటే వసతి, సాధన సామగ్రి, ఆట మైదానాలు మొదలైన సౌకర్యాలులేవు. ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలల్లోనే కనీస వసతి మొదలైన సౌకర్యాలు కలిగించడానికి రూ. 7.5 కోట్లు ఖర్చుచేయవలసి వుంటుంది. (ఒక్కొక్క పాఠశాలకు రూ. 5,000ల చొప్పున 15,000 పాఠశాలలకు).

ప్రాథమిక విద్యాభివృద్ధి విషయంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో దీనిని విస్తృతీకరించే విషయంలో. గ్రామాలలో పనిచేసే ఉపాధ్యాయినులకు తగు నివాస గృహాలను సమకూర్చవలసిన ఆవశ్యకతను రాష్ట్రప్రభుత్వం, కేంద్రప్రభుత్వం కూడా గుర్తించడం జరిగింది. ఇప్పటివరకు ఈ కార్యక్రమం చాలా పరిమితంగా మాత్రమే అమలు జరిగింది. ప్రాథమిక పాఠశాలల్లో బాలికలు అత్యధికంగా చేర్చబడడానికి వీలుగా వచ్చే సంవత్సరాలలో, ఈ పథకానికి అధికతర ప్రాముఖ్యం ఇవ్వవలసి వుంది. అందుచేత, 2000లకు పైగా జనాభా గల గ్రామాలలో, ఉపాధ్యాయినుల కొరకు కనీసం 4000 జంటగృహాలను, ఒక్కొక్కదానికి రూ5000చొప్పునరూ. 2కోట్ల ఖర్చుతో నిర్మించడానికి సిఫార్సులు చేయబడింది.

సెకండరీ విద్య

రెండవ పంచవర్షప్రణాళిక ముగింపు నాటికి రాష్ట్రంలోగల సెకండరీ పాఠశాలల సంఖ్యా వివరాలు దిగువ పేర్కొన బడినవి:—

పాఠశాలలు	పాఠశాలల సంఖ్య			విద్యార్థి, విద్యార్థినుల సంఖ్య		
	బాలురు	బాలికలు	మొత్తం	బాలురు	బాలికలు	మొత్తం
మాధ్యమిక పాఠశాలలు—	1350	116	1466	315800	92085	407885
హయ్యర్ సెకడరీ, ఎం. పి. పాఠశాలలతో సహా ఉన్నత పాఠశాలలు	1091	133	1224	164793	31391	196184

రెండవ ప్రణాళిక ముగింపువరకు సెకండరీ విద్యాపథకాలకు రూ. 703.4 లక్షల ఖర్చు జరిగింది.

తృతీయ ప్రణాళికలో, ఇప్పటి వరకు, 769 మాధ్యమిక పాఠశాలలను, 996 ఉన్నత పాఠశాలలను కొత్తగా తెరవడం జరిగింది. ఇంతేకాక ప్రవేశార్థుల ఒత్తిడిని బట్టి అదనంగా సెక్షన్లు, తరగతులను తెరవడం ద్వారా ప్రస్తుతం పనిచేస్తున్న సెకండరీ పాఠశాలలను అభివృద్ధి పరచడం కూడా జరిగింది.

మూడవ ప్రణాళిక చివరి సంవత్సరంలో మరో 115 సెకండరీ పాఠశాలలను నెలకొల్పుతారు.

ఈ విధంగా, తృతీయప్రణాళికాంతం నాటికి, ఈ ప్రణాళికాకాలంలోనే నెలకొల్పబడే అదనపు సెకండరీ పాఠశాలల సంఖ్య 1865 వుంటుంది. (1096 ఉన్నత పాఠశాలలు, 769 మాధ్యమిక పాఠశాలలు.)

ప్రతి తాలూకా ప్రధాన కేంద్రస్థానంలోనూ బాలికల కొరకు ప్రత్యేకంగా ఒక సెకండరీ పాఠశాలను స్థాపించడమే, రాష్ట్రంలో సెకండరీ విద్యాభివృద్ధికై సౌకర్యాలు కలిగించే విషయంలో, ప్రభుత్వ విధానంగా వుంటుంది. పట్టణప్రాంతాల విషయంలో ఇప్పటివరకు, ఏ పేటా పెంపొందుతున్న అవసరాల దృష్ట్యా, కొత్తగా సెకండరీ పాఠశాలను తెరవడమో, ప్రస్తుతం పనిచేస్తున్న సెకండరీ పాఠశాలను అభివృద్ధి పరచటమో కానీ జరిగింది.

ప్రస్తుతం, కొన్ని తాలూకా ముఖ్యకేంద్రస్థానాలలో మినహా అన్ని తాలూకా ముఖ్యపట్టణాలలోనూ బాలికల కొరకు ప్రత్యేకంగా సెకండరీ పాఠశాల లున్నాయి. రాష్ట్రమంతటా, సెకండరీ విద్యలో ఆయేటి కాయేడు సౌకర్యాలు పెంపొందుతున్నప్పటికీ, అనేక సెకండరీ పాఠశాలల విషయంలో టీచర్లూ ఇతర సిబ్బంది, వసతి, సాధన సామగ్రి, ఆట

(మిగత 49 వ పేజీలో)



సీరియల్ నవల:

విశ్వనాథ సత్యనారాయణ

ఏదవ అధ్యాయము

ఒక ప్రవాహము బయలుదేరి వచ్చుచుండును. అది కొండలమీద బయలుదేరి పడదోసికొంచు వచ్చును. ప్రవాహం చిన్నదియే. కొండలపైనుండి వచ్చుటచేత వేగముగా నుండును. దానిలోనికి వచ్చి మఱి యితరప్రవాహములు కలియువరకు నది చిన్న ప్రవాహముగానే యుండును. తీవ్రత యుండును. చిన్నచిన్నరాళ్ళను పొరలించుకొనివచ్చుట యుండును. అది పొరలివచ్చునపుడు కొన్ని పెద్దరాళ్ళనుఁగూడ బురాణ సంధిబంధములు ప్రిదులుటచే క్రిందఁ బడవచ్చును. అది ప్రవాహబలముకంటెఁ బూర్వప్రవాహములచేతఁ జేయఁబడిన పురాణశిలాసంధిబంధములయందలి యరుగుదలచేత నీ ప్రవాహమే దానికిఁ గారణముగాఁ గనిపించును. కొంతదవ్వు వచ్చిన తర్వాత నితరప్రవాహములు దానితోఁ గలియును. లేదా యొక్కటి జరుగును. దాని వచ్చెడిదారిలోఁ బెద్దమహాశిల లేర్పడియుండును. ఆ శిలలవెనుక నున్న నేల సహజముగాఁ బల్లమైయుండును. పల్లము కాకపోయినను బల్ల మేర్పడిన ట్లుండును. ఆ ప్రవాహముయొక్క వేగ మా పల్లములో నాగిపోవును. అది యంతయు మహాతటాకమైన తరువాతఁగాని మరల ప్రవాహము మొదలుపెట్టదు. చాలవరకు దాని వేగము నీ తటాక మరికట్టుచుండును. ఆ తటాకము తటనికషముగా నుబ్బి క్రొత్తగా వచ్చెడి నీరమును వచ్చిననీరమును వచ్చినట్లుగా వెలికిఁ జిమ్మునంత నిండారుతనమును బొందినగాని తటాకమును దాటినతరువాతనా ప్రవాహమున కట్టి వేగము మరలఁ బట్టదు. కొండలపైనుండి యురికివచ్చిన తరువాతఁ దటాకోపరిభాగమునుండి జారి యాజారుటలో నొక చిన్నత్రోవ యేర్పడి యొడ్డుగా నేర్పడిన కొండలక్రింద మరల నేటవాలుగా నుండి మరియు శిలానిర్మితమైన స్థలమైనచో నపుడు తొలుతటి కొండసెలయేరు తన కొండసెలయేటితనమును నిలుపుకొనఁగలదు. సెలయేరు సహజముగా నుద్భవించును. ఏరుల జన్మము పీరుల జన్మమును దెలియ దన్నట్లు కొండసెలయేటికి రూప మేర్పడువరకు నెట్లేర్పడినదో తెలియదు.

ఒక యముఁడో యొక భేతాళుఁడో మహామేఘాకృతులు బూని జీవాకృతులయందు వర్షము కురియగా నొక ప్రచండమైన సెలయే రుద్భవించును. సాధువైన పర్వతము మీఁదనే యీ భేతాళాకృతియైన యమాకృతి యైన మేఘము కురియవచ్చును. పర్వతము సామాన్యమైన యాకారము కలదియే. ప్రవాహము యమాకృతి. భేతాళాకృతి కొండలచేత నరికట్టఁబడినది. ఆ కొండల వెనుక నున్న తటాకము నిండిన తరువాతగాని దాని ప్రళయాకృతి మరలఁ గనిపింపదు. అది మరల బేతాళమూర్తివలె నడువవలయునన్నచోఁ గొన్ని సన్నివేశములు కలుగవలయును. తత్తటాకజలము పార్శ్వములకుఁ జెదరిపోరాదు. ఆ పర్వతములయందుఁ గొన్ని మహాగాధములైన స్థలము లుండి కొండలలో రంధ్రము లుండి యెచటనో దూరాన జలపాతమువలె బుగ్గలవలెఁ గావచ్చును. అడ్డగించిన పర్వతముల యౌన్నత్య మధికమై ప్రవాహ మెంతవచ్చినను దటాకముయొక్క వైశాల్యమునకే సరిపోయినంత కావచ్చును. వర్ష ఋతువు పోవును. శరద్ధేమంత శిశిర వసంత గ్రీష్మములు వచ్చును. అప్పటికిఁ దటాకము నిండదు. సూర్యదేవుఁ డీ జలములను దన కరములచే నాకర్షించును. మరల వానలు కురియునప్పటికి తటాకము సగ మెండును. తిరిగి వర్షములు కురియువేళకు వచ్చిన ప్రవాహజలము సూర్యునిచేత నాకర్షింపబడుటకుఁ దగినంత మేరియే నింపుటకు నుండును. ప్రవాహ మాగిపోయినట్లగును. తత్తటాకమా సెలయేటిచేతఁ బూరింపబడుచున్న దనిపించుకొనును.

భేతాళాకృతియు యమాకృతియు నైన మిహిరకులుఁడు కల్యాణవతీగతప్రేమయన్న కొండలచేత నడ్డగింపఁబడి కొన్ని యేండ్లు మధురశీతలజలమయతటాకాకృతి నందెను. ఒకవైపున నీ కొండశిల లడ్డగింపఁగా మఱియొకవైపున ప్రవాహమునకు సులభముగాఁ బ్రసారము జరుగుటకుఁ దీవ్రాకృతిఁ దాల్చుటకు వీ లేర్పడెను. భారతదేశమునకు వాయవ్యదిశయందుఁ గాశ్మీరము కలదు. కాశ్మీరమునకు దిగువఁ బలురాష్ట్రములు కలవు. కటకము, సింహపురము, నుత్తరజ్యోతిషము మొదలైన చిన్నిచిన్ని రాజ్యములు కలవు. వాని కీతల గాంధారరాజ్యము కలదు. కాశ్మీరమున నెగువ దరదము కలదు. అభిసారమును త్రిగర్తమును దాని నంటికొనియున్నది. కాశ్మీరము శిలామయదేశము. సింహపురాది దేశములన్నియుఁ బర్వతములలో నున్నవి. ఆ పర్వతములవెనుక నే జాతు లున్నవో తెలియదు. భారతదేశము వైదికమతమైన సనాతన ధర్మమునకు జన్మస్థానము.

సృష్ట్యాదినుండియు నిది కర్మభూమి. ఇచట వేదపురాణేతిహాసములు కలవు: బహుపూర్వజన్మకృత పుణ్య పరిపాకవశమునఁ గొందరుజీవు లెచ్చట నుద్భవించినను భక్తిజ్ఞాన వైరాగ్యములచేత నిండియుందురు. అట్టి జీవులు వందకోట్లలో నొకఁ డగును. తక్కినవా రందరు నిరంతరజగత్ప్రయాణముచేత. సత్ప్రవర్తనచేత, ధర్మాచరణముచేతఁ బుణ్యము నార్జించుకొనుచు జన్మ లెత్తియెత్తి జ్ఞానవంతులు కావలయును. అట్లగుట కేర్పడినది వైదికధర్మము. తన్మార్గమున నిశ్చలబుద్ధులై నిర్వక్రధర్మమార్గగులై జీవులు ప్రయాణించుటకే ధర్మ మేర్పడినది. కాని పలుమందిజీవులు యధేచ్ఛముగాఁ బ్రవర్తింతురు. వేదధర్మము నంగీకరింపరు. జ్ఞానము సర్వసామాన్య మందురు. వారు వేదమున కెదురుతిరుగుదురు. అనఁగాఁ బర

మేశ్వరున కెదురుతిరుగుదురు. భగవంతుఁడు పొలము దున్ని బోదెలలో నుండి చదును చేసిన నేలకు నీళ్ళెక్కించి నాటును. అది మొక్క పెరుగునప్పటికిఁ బొలములో గలుపు పేయును. కృషికుఁడు ఫలాపేక్షచేతఁ గలుపును దీసివేయును, ఆ కలుపును దొలఁగింపనిచోఁ బంట తక్కువగును.

అందుచేత భగవంతుఁడు వేదధర్మావలంబులైన భారత మహాక్షేత్రమున నాటుకొనిన మొక్కలవలె నున్న సత్త్వగుణ ప్రధానులైన జీవులనడుమ దుర్జాతులైనవారుదయించినపుడా కలుపును దీసివేయును. భగవంతుఁడు తానే యొక్క యవతారమును బూనియో యొకమహాపురుషుని ద్వారముననో కలుపుమొక్కలను పెకలించివేయును. ఇట్టిమొక్కలే మ్లేచ్ఛులు. భారతదేశమున నీ వేదబాహిరులను మ్లేచ్ఛులను జేసి వారిని దేశమునుండి వెడలఁగొట్ట నారంభించిరి. వారు భారతదేశమును బశ్చిమదిశకు బోయి యాక్రమించుకొనుచుండిరి. వేదధర్మప్రతిష్ఠాపకులైన మహారాజుల నిత్యపరిపాలనముచేత వారికి భారతదేశమున సింధునదిని దాటి వచ్చుటకు శక్తి చాలక వారిసంఖ్య పెరిగిపోయి వారు మఱియు పశ్చిమమునకుఁ బోయిరి. ప్రపంచ మంతయు నిండిరి. పెరచోట్ల పెద్దపెద్దరాజ్యములను నిర్మించికొనిరి.

ఈ మానవసృష్టిలో నొక వైలక్షణ్యమున్నది. తల్లిదండ్రులు లొకచోటివారు. ఒక గ్రామమువారు. అచట పితృపైతామహమైన యాస్తులు కలవు. వీఁడు జన్మించునప్పటి కా యాస్తి చెడిపోయినది. కూడుగుడ్డలకొఱకుఁ బరదేశమునకుఁ బోవలసివచ్చెను. కాని వాఁడును వాని సంతానమును దొలుతఁ దమది యా గ్రామమని, యచట మరల నాస్తి సంపాదింపవలయు నని యనుకొనుచునేయుందురు. సృష్టిలో నిట్టివారు తమ పూర్వగ్రామములను జేరి మరల నాస్తులను సంపాదించినచో సంపాదింపనువచ్చును. తొలినాటి తమ జన్మభూమిమీఁద మక్కువ యుండుట జీవి లక్షణములలో మొదటిది. ఒక్కొకప్పు డచ్చటి వారు వీరిని వెడలనడపిరి. వారు తనకు జ్ఞాతులు. తాను బ్రతికియున్నంతవరకు వీఁడు వారి నేమియుఁ జేయలేఁడు. కాని యీ పగ పుత్త్రపౌత్రపారంపర్యముగ వచ్చుచుండును. ఒక కొన్నివందలయేండ్లక్రింద నిద్దఱికి విరోధముకలిగెను. వారి నొకరొకరు సాధించికొనుటకుఁ బ్రయత్నించిరి. వీలయినంతవఱకు నపకారములు చేసికొనిరి. వారు చనిపోయిరి. ఆ కుటుంబములకు విరోధము మిగిలియుండును. దానికిఁ గారణములేదు. కారణము నాలుగువందలయేండ్లక్రిందిది. వీరికి సంబంధించినది కాదు. కాని యిప్పటి యా కుటుంబములలో జీవించియున్నవారలలో పగ తమరు కల్పించుకొన్నదియే, తమరు సాధింపఁదగినదియే యన్న తీవ్రతతోఁ బ్రవర్తింతురు. ఇది యొక విచిత్రము. ఎందు కిట్లు జరుగుచున్నదో తెలియదు. ఆరీతిగా మ్లేచ్ఛజాతులు సర్వదా భారతదేశమును గెలిచి పరిపాలింపవలయు నన్న యూహతోడనే బ్రదుకుదురు. వారికిఁ దమ పూర్వులీ దేశమునుండి పూర్వము వెడలనడుపఁబడి రనిగూడఁ దెలియదు. ఈ పగ యొక్క లక్షణ మట్టిది. జీవులయందు మూలమైన విరోధలక్షణము. తెలియకుండగనే నిత్యసర్పణశీలముగ నుండును. అందుచేత మ్లేచ్ఛజాతులు సర్వవేళలయందు భారతదేశము నాక్రమించుటకే ప్రయత్నించుచుందురు. వచ్చుచుందురు. పలుమారు సంహరింపఁబడుదురు. పాఱిపోవుదురు. కొన్నాళ్ళకు మరల నెవఁడో తల యెత్తును. వాఁడు మరల దండెత్తివచ్చును. కొంతకాల మచటఁ దాండవించును. మరల వానిని వైదికధర్మావలంబులు నశింపఁజేయుదురు. ఇది కలికాలమున దేవదానవ యుద్ధము వంటిది. ఇది యొక్క భారతదేశపు మొగముననే వ్రాయఁబడలేదు. సర్వదేశముల చరిత్రయు నిట్టిదే. ఇతరులు దండెత్తి వచ్చుటయు వారి నా దేశీయులు తఱుముటయు నొకప్పుడు పరులు గెలిచి రాజ్యము బ నిర్మించుటయు. గాలక్రమమునఁ దద్దేశీయులు వారిని పాఱద్రోలుటయు సర్వదేశములయందు జరుగుచునేయుండు నన వచ్చును. కాని భారతదేశమునందలి ధర్మము మ్లేచ్ఛజాతుల ధర్మములకంటె విలక్షణమైనది. ప్రత్యేకత కలది. స్వచ్ఛమైనది. భారతీయధర్మమును భారతీయధర్మముగా నవలంబించినచోఁ గూటికి గుడ్డకు లోపమున్న మానవుఁ డుండఁడు. ఇది యిచటి చాతుర్వర్ణ్యముయొక్క రహస్యము. ఆ రహస్యము మ్లేచ్ఛజాతుల కర్థము కాలే దని దిగులుపడనక్కఱలేదు. అర్థముకాని భారతీయులే యెప్పుడును లక్షలకొలఁది నుందురు. వారి సంఖ్యయే మితిమీఱగా ధర్మమును స్థాపించెడి యొక మహాచక్రవర్తి సంభావించి వారిని మ్లేచ్ఛులుగాఁ దఱిమివేయును. ఈ మానవసృష్టిలోఁ బ్రధానముగాఁ గలియుగములో ధర్మము తక్కువ, యధర్మమెక్కువ. పుణ్యము తక్కువ. పాప మెక్కువ. సూక్ష్మతరధర్మపరిశీలన తక్కువ, స్థూలదృష్టి యెక్కువ. సదసద్వివేకము తక్కువ, యుమ్మడియూహ యెక్కువ.

మిహిరకులునినాటికిఁ గలి ప్రవేశించి యిరువదినాల్గువందల యేండ్లైనది. ఈ కలిలోఁ గాలము గడచినకొలఁది మ్లేచ్ఛుల ప్రాభవ మెక్కువగుచుండును. మ్లేచ్ఛులు భారతదేశమున దండులు దండులుగా బయలుదేరివచ్చిన పెద్దపెద్ద యలలవంటి యెద్దడులలో మొదటిది మిహిరకులుని నాటిది. అనఁగా నిప్పటి లెక్కప్రకారము అది క్రీస్తుపూర్వము ఏడువందల నాల్గవ సంవత్సరము. ఈ మ్లేచ్ఛుల దాడి క్రీస్తుశక మేర్పడినతరువాత కొంత వృద్ధియయ్యెను. మఱియుఁ గ్రీస్తుశకములోఁ బదునొకండు వందల యేఁబదియేండ్లు వచ్చువఱకు మ్లేచ్ఛుల దాడులు తఱిమివేయఁబడెను. వారు గెలువలేదు. దేశము నాక్రమించుట జరుగలేదు. క్రీస్తుశక మించుమించుగా నారంభింపఁబోవు నపుడు మ్లేచ్ఛుల దండయాత్రలు బలమయ్యెను. తరువాత నడిమియాసియాయందు మఱియొకమతము బయలుదేరెను. దానితో

జగద్విప్లవ మారంభించెను. కలియుగము ప్రారంభించినతరువాత నాల్గువేలయేండ్ల వఱకుఁ గలిపురుషుఁడు నిలువఁద్రొక్కుకొన లేకపోయెను. అప్పటికి వానికి స్తిమితము చిక్కినది. ఇది తరువాతి కథ.

మిహిరకులుఁడు కల్యాణవతీ పరమ సుకుమార సూనశరభావసుధాహ్రదమునందు డోలాయమాన ప్రియభావనుఁ డగుచుండఁగా సతని సెలయేటితనము కాసారాకృతి దాల్చి యుండెను. అప్పుడు నిలచిన తటాకము నీరు దొరలిపోయి మరల ప్రవాహము కట్టుటకు నుత్తరజ్యోతిష సింహపుర గాంధారాది దేశములమీఁదికి మ్లేచ్ఛులు దండువెడలివచ్చిరి. వా రీ దేశముల నారంభించి యెంత యో దూరము పోయిరి. పోవునపుడు కూడుగుడ్డ లకు లేదు. జనము పెరిగిరి. బ్రదుకవలయును. వ్యవసాయము చేయుట, తోటలు వేసికొనుట, గుడ్డలు నేసికొనుట మొదలైన లక్షణము లన్నియు సహజముగా మానవునకు స్ఫురించును. వాఁ డాచరించును. క్రమముగా ధనవంతుఁ డగును. రాజ్యము లేర్పడును. ఈ మానవలక్షణము భారతదేశమునం దెంత భగవన్నిర్మితమో మ్లేచ్ఛదేశమునయం దంత మానవనిర్మితము. అచట నిచట నున్న స్థితి వారు వృద్ధిపొందినతరువాత సమానముగా కనిపించి వా రిచ్చటిదిగూడ మానవనిర్మిత మనుకొందురు. ఇచటి నాగరకత సహజము, అచటి నాగరకత కృతకము. అది పలు పోకిళ్లు పోవును. ఇది గిరిగీసికొని హద్దులలో నుండును. మానవునియం దున్న స్పర్ధ విచిత్రమైనది. ఒకని నియమమును జూచి యోర్వలేదు. పదిమంది త్రాగుబోతులలో నొక త్రాగనివాఁ డున్నచో వానిని బట్టి త్రాగించెడివఱకుఁ ద్రాగుబోతులకు నిద్ర యుండదు. వానిని కాలుసేతులు కట్టి బలవంతముగా నోరు తెఱచి వాని నోటిలోఁ బోయుదురు. ఒక్కొకపు డా త్రాగనివానికే త్రాగుచున్న పదిమందిని జూచి నోరూరిన ట్లుండి వాఁడే త్రాగును. వాఁడును జెడిపోవును. ఒకప్పు డీ త్రాగనివాఁడు బలవంతుఁ డైనచో వారు వాని నేమియుఁ జేయలేరు. మఱియొకప్పుడు వీఁడే వారి నడుమలోఁ బెట్టును. ఈ సృష్టిలో నెప్పు డెయ్యది యెట్లు జరుగునో యెవఁడు చెప్పఁగలఁడు. కాని పదిమంది త్రాగుబోతులు త్రాగనివాని చేత బలవంతముగాఁ ద్రావించి తాము గొప్పపని చేసితిమని చంక లెగుఱవేయుదురు, గంతులు వేయుదురు, ఊరివెంటఁ బోయి చెప్పికొందురు. పదిమందిని త్రాగుడు నుండి మరపించినవాఁడు చేసిన పని తొలుతటి పదిమంది చేసిన పనివంటి నుత్తమమైన కార్య మైనను వీఁడు పోయి చెప్పికొనఁడు, గంతులు వేయఁడు. ఈ భేద మున్నది. త్రాగనవాఁడు గంతులు వేయునుగాని త్రాగనివాఁడు వేయునా ? ఇది దేవదానవలక్షణముల లోని భేదము.

మ్లేచ్ఛులు గాంధారమునందుఁ జొచ్చిరి. అంతవఱకు మిహిరకులునకుఁ దెలియదు. ఉత్తరజ్యోతిష సింహపుర కటకాది దేశములను వారు ప్రవేశించిరి. వచ్చిన మ్లేచ్ఛులకు నచట నున్న మ్లేచ్ఛులకు నెక్కువభేదము లేదు. అవి యన్నియు మహాపర్వతప్రదేశములు. చిన్నిచిన్ని పల్లె లుండును. పెద్దపెద్ద పట్టణములు లేవు. అచటి జనులు నిత్య ఖడ్గధారులు, ఆశ్వికులు. వచ్చిన మ్లేచ్ఛు లచట దోచికొనుట కేమియు లేదు. గాంధారము వచ్చినగాని సింధునదీప్రవాహములచేత సస్యవంతమైన ధాత్రిలేదు. దోచికొనుటకు వీలులేదు. సుభిక్షమైన దేశమునఁ దగులబెట్టుట కిండ్లుండును. పరంపరగా వచ్చు సుఖమైన రాజ్యమును పండించుకొనుచు, వర్తకములు జేయుచు యుద్ధము మొగ మెఱుఁగని జనులు పట్టణములలోఁ పల్లెలలో సమృద్ధిగా నుందురు. దోపిడికాండ్రిచ్చటకు వత్తురు. రాళ్ళలో రప్పలలో నేమి దోచికొందురు? ఈ సురక్షితమైన దేశములు భారతదేశమునందలివి. కల్పములుగా యుగములుగా నొకపద్ధతిమీఁద నడచుచుండెను. ఆసేతుశీతాచలముధర్మముచేత నొకటికాదు. అపుడపుడు మహాచక్రవర్తు లుదయించి. మహావీరు లుదయించి యీ సర్వధాత్రి యొకటియేదేశ మని నిరూపింతురు. వారు చక్రవర్తులై కప్పములు కొందురుగాని, తత్తద్రాజ్యముల నపహరింపరు. ఆ రాజవంశములను నిర్మూలింపరు. భారతయుద్ధమునకు పూర్వము శ్రీకృష్ణుఁడు కాశ్మీరరాజపాలకులకు మూలపురుషుఁడైన గోనందుని కుమారుఁడు దామోదరుని సంహరించి వాని భార్యయైన యశోధరను సంరక్షించి యామె కడుపున నుదయించిన మరలగోనందుఁ డని పేరు పెట్టికొనిన పసినిసువును రాజ్యమునందు పట్టాభిషిక్తుని జేసెను. ఆ రాజ్యమును దన రాజ్యమునందు కలిపికొనలేదు. ఇది పూర్వ చక్రవర్తుల మర్యాద. ఏరాజైనను ధర్మముగాఁ బరిపాలింపవలయును. ఎవఁడైనను రాజ్యము సనాతనధర్మపథమున నడిపించుటయేగదా చేయవలసినది! రాజులయొక్క ప్రకృతులలో భిన్నత యుండుట చేతఁ గొంచెము హెచ్చుతగ్గు లుండవచ్చును. కాని ప్రధానముగా వేదశాస్త్రపురాణేతిహాస నిరూపిత చాతుర్వర్ణ్య రక్షయే సకలజనుల యొక్క సుఖముకొఱకు పరమేశ్వరునిచే నిర్మింపఁబడిన దని తెలిసికొని విశ్వసించిన యా రాజులకాలమున సాగుచుండెను. కోట్ల సంవత్సరములు సాగెను. వేదధర్మమునందు విశ్వాసము లేని జనులు సర్వజనములు సుఖముగాఁ గూడుగుడ్డలకు లోపములేకుండా బ్రదుకుటకు వీలుగా నిర్మింపఁబడిన వేదధర్మమును తద్ధర్మానుగత రాజ్యపాలనమును ద్వేషించిరి. వారినే మ్లేచ్ఛులనిరి. వారి దండయాత్రలు రెండు కోరికలను బురస్కరించి కొని సాగును. మొదటిది దోచుకొనుట, రెండవది యిచట వేదధర్మమును నాశనము చేయుట. ఆ మ్లేచ్ఛుల యూహలే విచిత్రములుగా నుండును. వారి ధర్మమే ప్రపంచమునందలి సర్వజాతులు సర్వప్రజలు నవలంబింపవలె నన్నది వారి గాఢమైన కోరిక. ప్రపంచ మంతయు నట్లగుటకాదు. దాని మాట యట్లుంచి యీ మ్లేచ్ఛులు తమ బలముచేతఁ గొన్ని దేశములను గొన్ని

జాతులను బలవంతముగా నొక్కచోట బతిమాలి యొక్కచోట లంచములు పెట్టి యొకచోట మోహపెట్టి యొకచోట తమ ధర్మమునకు మార్చిరి. అచ్చట శాంతి కలదా? వారు వీరు నొకటియేనా? తొలుతటి వారధికులు. తరువాత నైనవా రధములు. మానవసృష్టిలో నున్న కామక్రోధాదులను సర్వజను లొక్కటియే ధర్మము నవలంబించుటచేత మారిపోవునా? మ్లేచ్ఛుల యీ దండయాత్రలలో దోచికొనెడి భావ మర్థ మగుచున్నది. తాము గెలిచిన ప్రజలచేతఁ దమ ధర్మము నవలంభింపఁజేయవలయు నన్న రెండవభాగ మర్థమగుటలేదు. మ్లేచ్ఛు లెంత దవ్వు పోయిన నంతద వ్విదియే జరుగును. తోడేలు బలహీనములైన మృగములను వధించుచుఁబోవును. సగము సగము తిని శవములను వదలిపెట్టిపోవును.

ఆనాఁడు మిహిరకులుఁడు కల్యాణవతీ శయనాగారమున నుండి గాంధారమున మ్లేచ్ఛులు చొచ్చి దోపిళ్ళు చేయుచున్నారని యామెకు వచ్చిన వార్త నామెవలన విని కనులు మూసికొని మంచముమీఁద బరుండి తన యిద్దఱుగురువులు చెప్పిన భూతభవిష్యద్వర్తమానముల నన్నింటి నీ విధముగా భావించుచుఁ జాలసేపుండెను. కళ్యాణవతి చివరకు భర్తను పలుకరించి తాను పోయి తన తండ్రిరాజ్యమును రక్షింతు ననెను. మిహిరకులుఁడు కన్నులు తెరచి యామె వంకఁ దీక్షముగాఁ జూచెను. ఆమె యిట్లనెను. 'నా తండ్రి వృద్ధుఁడైనాఁడు. సేనాపతియు మంత్రులును యథేచ్ఛముగఁ బ్రవర్తించుచున్నారు. అయ్యో! రాజ్యము, గుణవంతుఁడైన రాజు కానిచో, నధికారులు ప్రజలను దోచికొని తిందురు. అధికారులకును దోపిడికాండ్రకును భేద మేమి! స్త్రీలను జెఱబట్టుటయు, గృహదహనములు చేయుటయు, ధనము నెత్తికొనిపోవుటయు నిద్దఱకు సమానమే! దోపిడికాండ్రు కటారులతో వత్తురు. వీరు రాజాధికారముతో వత్తురు. రాజు బలిష్ఠుఁడైనచో నధికారులణగిమణగియుందురు. పన్నులను న్యాయముగా స్వీకరించుచుందురు. ప్రజల కిన్ని విధముల నాపదలు రావచ్చును. భూకంపము వచ్చి నేల పగులవచ్చును. వరదలు వచ్చి సస్యములు నాశనము కావచ్చును. వానలు లేక ధాత్రి వట్టిపోవును. అడవులనుండి క్రూరమృగములు జనపదములలోఁ బ్రవేశించి హింసింపవచ్చును. మశూచికము లూత మొదలగు వ్యాధులు వచ్చి జనులు నశింపవచ్చును. ఇన్నిటిని రాజేమి చేయఁగలడు? చనిపోగా మిగిలినవారికిఁ గొంత సహాయపడఁగలఁడు. రాజు రక్షించెడిది సర్వము భద్రముగా నున్నపుడు. దైవవైపరీత్యములు లేనపుడు జనులు పరస్పరము హింసించుకొనకుండుటయు, నధికారులు దుర్జనులై ప్రజలను పీడించుటయు మ్లేచ్ఛులు దండువెడలినపుడు వారిని దఱిమివేయుటయు నీ మూఁడే రాజు చేయదగినపనులు. ఈ మూటిలోఁ జివరిది ప్రజలను మిక్కిలి గగ్గోలు పరచునది. అట్టి యాపద నా తండ్రి దేశమునకు వచ్చినది. నేను కొడుకును గాను. ప్రభువు లనుగ్రహించినచో నేను పోయి గాంధారముల కీ యాపద తొలగించి వత్తును."

మి కు: మీ తండ్రి పోయిన తరువాత రాజ్యమేమగును ?

కల్యాణ ; అల్లునకు సంక్రమించును.

మి కు : తరువాతఁ దనకు వచ్చెడి యాస్తిని రక్షింపవలసిన బాధ్యత యల్లునకు లేదా ? —

ఇద్దఱును కొంతసేపు మాటాడుకొనలేదు. చాలసేపటికిఁ గల్యాణవతి యిట్లనెను. 'ఏమి యాలోచించుచున్నారు ?'

మి కు ; కల్యాణవతీ! ఒక కొండవాగు బయలుదేరినది. ఝంఝామారుతము వలె సాగినది. మహావృక్షములను రాళ్ళను దొరలించుచు వచ్చినది. ఆ ప్రవాహము నొక చిన్ని పర్వత మాపినది. ఆ కొండ చంద్రకాంతశిలానిర్మితము. శరత్కాలపు వెన్నెలలో నాదిశేషుడు కుబుసము విడిచిన ట్లున్నది. ఆ కొండమీఁద ప్రేమచేతఁ బున్నమజాబిల్లి లేని చేతులు తెచ్చికొని దానిని కౌగలించుకొనును. ఆ కొండ యీ ప్రవాహము నాపినది. ప్రవాహముకూడ సంతోషించెను. నన్నీ కొండ నియమించినది. లేనిచో నే నెన్ని మహావృక్షములను గూల్చి యుందునో, యెన్ని మహాశిలలను దొరలించియుందునో! ఇట్లుండగా నా చంద్రకాంతశిలామయ పర్వతము పర్వతముగనే యున్నది. ప్రక్కగా నంత యెత్తులేని కొండ యొకటి యా ప్రవాహమునకు దారి యిచ్చుచున్నది. ప్రవాహమునకు భయముగా నున్నది. మరల తన తీవ్రత్వము, తొలుతటి చండత్వము మరల వచ్చునో. అంతరాంతరమునం దా కొండయేటికిఁ దన ప్రచండవేగమే యిష్టము. మఱియు నింకొకటి. ఆ చంద్రకాంతపర్వతమే యీ కొండవాగు నట్లు దూసికొని పొమ్మని చెప్పున ట్లున్నది.

కల్యాణవతికి దీని యర్థము తెలియును. మిహిరకులుని స్వభావము తెలియును. తనయందతనికిఁ గల ప్రేమ తెలియును. నిష్కంటకుని వధనాటి తన కావించిన మధురతీవ్రనియమము తెలియును. మఱియు నామె కింకొకటి తెలియును. తా నిప్పుడు వేతొకరాజుయొక్క భార్య. తాను పోయి తన తండ్రిరాజ్యమును రక్షించుట యన్నది సాగదు. తన భర్తయే పోవలయును. అడవిలో బహుమృగముల వధించి వాని నెత్తురు త్రావి మాంసమును దిని యథేచ్ఛముగా నున్న పులిని వేటకాండ్రు బంధించి బోనులోపెట్టి ప్రజలకు వినోదము కలిగించుటకుఁ దెత్తురు. ఆ పులి తాను స్వయముగా వేటాడుటనే మఱచిపోవును. పంజరమునుండి రక్షకుఁ డర్పించు మాంసమును దినుటకే యలవాటు పడును. ఒకవేళ బోనునుండి విడివడి

నచో నేమగును? దానికిఁ గాంతారమునకుఁ బట్టణమునకు భేదము తెలియదు. మనుజులను యథేచ్ఛముగఁ గసిమసంగును. ప్రకృతి యిట్టిదై యుండగ దాని రక్షకుఁడు తన విరోధులను సంహరించుటకుఁ బులిని బోనునుండి వదలిపెట్టినచో నది విరోధులను సంహరించును. తన్ను రక్షించెడివారిని సంహరించును. మరల దానిని బట్టికొనుట కష్టము. కాని విరోధులు బలవంతులై యున్నారు. పులిని వదలిపెట్టినగాని వారు సాధ్యపడరు. ఇట్లున్నది తన స్థితి. ఆమె యేమియు మాటాడలేదు. అతఁడును మాటాడలేదు. స్థితి యెట్లున్నదనఁగా రక్షకుఁడు బోనుతలుపు తెఱచియుంచెను. దానిని పొమ్మనలేదు. ఉసికొలపలేదు. దాని యిష్టమన్నట్లున్నది. పులి యలవాటుకొలఁది బోనులోఁ గొంతసే పుండవచ్చును. తలుపు తెఱచియుండుట చూచుచున్నది. వెలికిఁ బోవచ్చునేమో యన్నట్లున్నది.

నాల్గునాళ్ళు గడచినవి. ఈ సంగతి మరల భార్యాభర్తలు మాటాడలేదు. అయిదవనాఁడు మిహిరకులుఁడు కల్యాణవతితోఁ జెప్పకుండఁగనే సేనలను సిద్ధము చేసి నగరరక్షణ కృతజ్ఞున కప్పగించి వితస్తానదిని దాటి సేనలతోఁ బోవుచుండెను. ప్రజల కీ దండయాత్ర యెచ్చటికో తెలియలేదు. గాంధారదేశమునందు సింహపుర కటకోత్తర జ్యోతిషాది దేశములందు మ్లేచ్ఛులు విజృంభించుచుండి రని వారికిఁ దెలియును. కాని యీ భారతదేశమున సర్వప్రాంతములందలి జనులు వైదికధర్మముచేత నొక్కరు గాని లౌకికధర్మములచేత నొక్కరు కారు. గాంధారప్రజల కాపద వచ్చినచోఁ దమ కేమి? ఈ సిద్ధాంతమునందు వారు లగ్నచిత్తులై యుందురు. ప్రజ లిట్లున్నచో నష్టము లేదు. రాజులుకూడ నిట్టి చిత్తవృత్తి కలవా రగుటచేత దేశమున కాపద తటస్థించెను. భారతదేశము నంతయు నొక సామ్రాజ్యముగాఁ జేసిన చక్రవర్తు లున్నప్పుడీ యల్పభేదములు లేవు. ఏరాజున కారాజు విడివిడిగా నున్నప్పు డీ భేదములు మరల వేళ్ళు పాతుకొనును. మరియు నీ దేశమునం దింకొక బుద్ధిలక్షణ మున్నది. రాజులు రాజులు పోటాడుకొందురు. మన కేరాజైన నేమి? వాఁడు ధర్మముగాఁ బరిపాలించినచోఁ జాలు నని యనుకొందురు. మ్లేచ్ఛు లున్నారు. వారి ధర్మము వేఱు. భరతఖండమునం దున్న భిన్న రాష్ట్రములవారి ధర్మ మొక్కటిగాని ఖండేతరధాత్రియందలి జనుల ధర్మము వేఱని వారనుకొనరు. అందుచేత మిహిరకులుఁడు గాంధారమును రక్షించుటకుఁ బోవుచున్నాఁ డనుకొనలేదు. కొందఱను కొన్నారు. అది మామగారి రాజ్యము. తరువాతఁ దన రాజ్యము. దానిని రక్షించుటకే పోవుచున్నాఁడు. సేన లన్నియు పాదఘట్టన జనిత భూభారాధిక్యమువలన నాదిశేషుని పడగలమీఁద రత్నము లత్తుకొనునట్లు నడచెను. ఆ యొత్తిడి కాదిఫణి వేయి ముఖములనుండి వెడలిన యగ్నిజ్వాలలవలె మ్లేచ్ఛులవలని భయము పెరిగెను. వితస్తా సింధునదులు కలసినచోటికి సేనలు చేరెను. మిహిరకులుఁడు వచ్చుచున్నాఁ డని మ్లేచ్ఛులకుఁ దెలిసెను. మిహిరుని పరాక్రమము వారు విన్నారు. పాఱిపో నారంభించిరి. వారు పాఱిపోవుటకుఁ బ్రయత్నింతు రని మిహిరున కదివఱకే తెలియును. కాశ్మీరసైన్యములు గాంధారమునందు చొరబడక కటక సింహపుర ప్రముఖదేశములమీఁది కెగువకుఁ బోయెను. మ్లేచ్ఛులు లక్ష యున్నారు. మిహిరుని సైన్యము పాతికవేలు. మిహిరకులుఁ డొక్కఁడే డెబ్బదియైదువేల సైన్యము పెట్టు. మిహిరకులుఁడు సింధు వితస్తానదుల సంగమస్థలమునఁ దన సైన్యమును విభజించెను. అతని సేనాపతి దర్పమల్లుడు. ఆయనయు గోనందవంశమువాఁడే. మిహిరకులునకు వరుస కన్నగా రగును. కాశ్మీరరాజ్యమున సర్వరాజాధికారులు రాజవంశీయులే. అందఱును సుక్షత్రియులే. అందఱును రాజభక్తి కలవారే. అందఱును గోనందవంశమును ధారుణీపాలనమునందు నిలుపుటకు యత్నించెడివారే. గోనందవంశము కాశ్మీరరాజ్యమును పాలించినన్నాళ్ళు కాశ్మీరమున నీ స్థితికి భంగము కలుగలేదు. దర్పమల్లునకుఁ బదివేల సైన్యము నిచ్చి మిహిరకులుఁ డిట్లాజ్ఞాపించెను. "నీవు సూటిగ గాంధార రాజధానికిఁ బొమ్ము. దారిలో యవను వెదిరించినచో నిర్మూలనము చేయుము. పోయి మహారాజును గలిసికొనుము. చెదరిపోయిన గాంధారసైన్యమును ప్రోగుచేయుము ఎన్ని దుర్గములు యవనుల వశమైనవో మనకుఁ దెలియదు. తొలుత రాజధానిని భద్రము చేసి క్రమక్రమముగా నితరదుర్గములను సాధింపుము. దుర్గరక్షణమునకు సగము గాంధార సైన్యము సగము మనదిగా నుంచుము. దోపిడికాండ్రు పవళ్ళు దాడిచేసినను రాత్రులం దెచ్చటనో శిబిరములయం దుందురు. వారి యా శిబిరములను రాత్రులందు నాశనము చేయుము. మఱునాఁడు వారు మరల మఱియొక గ్రామముమీఁదికిఁ బోవుటకు వీలు లేకుండఁ జేయుము. వారు వట్టి పురుషులే వచ్చిరో స్త్రీలుకూడ వచ్చిరో తెలియదు. స్త్రీలతో వచ్చినచో సులభము. ఒక్క పురుషులే వచ్చినచో సమస్య క్లిష్టతర మగును. వారు స్త్రీలతో రానిచో గాంధారదేశస్త్రీలను చెఱబట్టియో యిష్టమైన కులటలతోడనో సంచరించుచుందురు. వారితోఁబాటు కులటలనుగూడ సంహరింపుము. నీ సైన్యములోని పురుషుఁ డొక్కఁడును స్త్రీవాంఛ కలవాఁడుగా నుండరాదు. అట్టివానిని సంహరింపుము. ఒక యూరుగాని కొన్ని యిండ్లుగాని మ్లేచ్ఛులకు స్థావర మిచ్చినచో వానిని భస్మీపటలము చేయుము. దుర్గములను రక్షించిన తరువాత నీ పని సుదృఢముగాఁ జేయవచ్చును. దుర్గములు రక్షింపఁబడువఱకు సర్వదుర్గములు నీ స్వాధీన మగువఱకు నీకు రెండుపనులు. ఒకటి దుర్గసాధనము. రెండు

పల్లీ పట్టణ గ్రామవాటికలనుండి గాంధార సైన్యముల సాహాయ్యముతోఁ దత్తత్ప్రదేశములయందలి పౌరులయు గ్రామీణులయు సాహాయ్యముతో మ్లేచ్ఛులను సంహరించుట జరుగుచుండవలయును. గాంధారదేశ మహారాజుతో నిట్లు చెప్పుము. మీ యల్లుఁడన కుము. కాశ్మీరాధిపతి యనకుము. కల్యాణవతీ భర్త యనుము. 'ఆయన తొలుత కటక సింహపుర ప్రముఖదేశములకు వెళ్ళినాఁడు. ఒక చెరువుకట్ట తెగినచో గ్రామమును ముంచుచున్నచో మన గడపలముందు పెద్ద దిబ్బలు పోసికొన్నందువలన లాభ మేమి. తెగిన గండిని పూడ్చవలయును. అది దుస్తరమైన కార్యము. గండి పడినచోట కొండలను దొర్లించుము. మహాతాళములను నఱికి యడ్డముగా వేయుము. అప్పుడు మట్టి పోయుము. నీటిప్రవాహ మాగినయనంతరమున మున్ను ప్రవహించిన నీటిని తగిన యరవలవెంట నీరు నేలను ముంచకుండఁ బంపవచ్చును. అదియే సూర్యరస్మి కెండి పోవును. నేల దానిని బీల్చికొనును,' అని చెప్పుము."

దర్పమల్లుఁడు వెడలిపోయిన తరువాత మిహిరకులుఁడు తన సైన్యముతోఁ దొలుత కొండదారులను మూయుటకు వెళ్ళెను. మిహిరకులుని సైన్యము పోయినంతమేర మ్లేచ్ఛుల దాడులను గంటగించుకొనుచున్న దేశీయు లందఱు వాని సైన్యములోఁ జేరుచువచ్చిరి. సైన్య మనఁగా నేమి సైన్యము. కఱ్ఱలును సామాన్యపు గత్తులను బూనిన సైన్యము. మిహిరుఁడు వారందఱిని తన సైన్యములోఁ జేరనీయలేదు. వారిని దన సైన్యము కాదనలేదు. ఎవరో మహాబలవంతులు, ఖడ్గధారులు, పూర్వము సైనికులు నైనవారినే తన సైన్యములో భాగముగాఁ దీసికొనెను. ఎక్కడికక్కడికి గ్రామములను గట్టుదిట్టము చేయుచుఁ బోవుచుండెను. పదిగ్రామములు కలిపి యొక కూటమి. ఆ పదిగ్రామములలోని యువకులను సమావేశ పరచి వారికి ఖడ్గముల నిచ్చి కొద్దిలోననే శిక్షణ యిచ్చి పది గ్రామముల మీఁది యదుపు, దాని రక్షణము వారి కప్పజెప్పుటయు వారికి మించిన దండు వచ్చినచోఁ దనకు వర్తమానము పంపుఁ డనుటయుఁ దొలుతఁ దొలుతఁ జేసెను. మిహిరకులుఁడు సైన్యముతో వచ్చుజాడ మ్లేచ్ఛులకుఁ దెలిసెను. మఱియు మిహిరకులుఁడు ప్రతిగ్రామమును ప్రతిపట్టణమును దా నాక్రమించినపుడు తదాగతులైన మ్లేచ్ఛులను చిత్రవధ చేయించుచుండెను. ఒకని కనులు తోడించును. ఒకనిని చర్మ మొలిపించును. ఒకని గడ్డముక్రిందనుండి మాడుపట్టునకు శూలము దిగవేసి చెట్లకు వ్రేలాడగట్టించును. ఇవి యన్నియు ఘోరకృత్యములే. కాని యీ శిక్షలు వారు దేశములోఁ జేసిన ఘోరములకుఁ బ్రతిక్రియలుగాఁ గనిపించుచుండెను. ఇండ్లు తగలబెట్టిన మ్లేచ్ఛదళమును జుట్టుముట్టి వారిలోఁ జావగా మిగిలినవారిని నిరాయుధులను చేసి వారి చుట్టును మంటలు పెట్టించి తగులబెట్టుచుండెను. నశించిపోయిన మ్లేచ్ఛుల యాయుధములను గుఱ్ఱములను తత్తత్ప్రదేశములందుఁ దా నేర్పఱచిన రక్షకుల కిచ్చుచుండెను. మిహిరకులుని పేరు విన్నచో మ్లేచ్ఛులకే కాదు తద్దేశీయులకుఁ గూడ భయము కలుగుచుండెను. మిహిరకులుఁడు తమ్ము, తమ గ్రామములను రక్షించుటకు నియమించును. అతని యాజ్ఞ నిర్వర్తింపకపోయినచో నతఁడు తిరిగి వచ్చినప్పుడు తా మేమగుదు మన్న భయము సర్వజనుల నావరించిపోయెను. పోయినంత మేర భద్రపఱచుచుఁ బోయినంత మేర మహాభీతి గొలుపుచుఁ బోయినంత మేర మ్లేచ్ఛ సంహారముఁ జేయుచు మిహిరకులుఁడు పోవుచుండగా యమధర్మరాజునకు యమధర్మరాజన్న పేరు సార్థక మనిపించెను. ఊళ్ళు దోచికొనిపోయి మ్లేచ్ఛులు రాత్రులందు విడియుచుందు రెచ్చటోయచట. నాకస్మికముగా మిహిరకులుని సైన్యము ప్రత్యక్ష మగుచుండెను. తొలుత వారి యీ విడిదలలను 'సైన్యములోఁ జుట్టుముట్టును. ఎవఁడును పాఱిపోవుటకు వీలులేదు. తరువాత వాని గుఱ్ఱములను బెదరింతురు. అవి పాఱిపోవుచుండును. వానిని స్వాధీనపఱచి కొందురు. మఱియుఁ దరువాత మ్లేచ్ఛులపైఁ బడి వధింతురు. మ్లేచ్ఛులు గ్రామముల మీఁదఁ బడి యెత్తుకొనిపోయిన స్త్రీలను యుద్ధములో సంహరింపఁబడనివారిని వధ యంతయు నైనతరువాత నొకచోట ప్రోగుచేసి యిష్టముకొలఁది వచ్చినవారిని మిగిల్చి బలవంతముగా నపహరింపబడినవారిని వారి వారి గ్రామములకుఁ బంపుచుందురు. ఇష్టపడివచ్చిన స్త్రీలను తత్తద్గ్రామాధికారుల కప్పగింతురు. గ్రామాధికారులు వారి దోషములను బరిశీలింపవలయును. వారి కేయే శిక్షలు విధింపబడవలయునో మిహిరకులుఁడే నిర్ణయించును. ఆ శిక్షలు విపరీతముగా నుండును. అవాచ్యములుగా నుండును. ఈ శిక్షలమూలమునఁ బ్రజలకు మిహిరకులుఁ డన్నచో రావణుఁడు, హిరణ్యకశిపుఁడు, బేతాళుఁడు ననిపించెను. కాని యతని శాసనము కొలిములోఁ బెట్టి యూది పండిన పదనుగల కత్తివలె నుండెను. భారతదేశ పశ్చిమదిశాభాగములోఁ దార్యము లైన మార్గములు కలవు. ఆ మార్గము లొకచోట సన్ననివి, మఱియొకచోట సుంత విశాలములైనవి. అచటికిఁ బోయి యా మార్గముల నరికట్టెను. తత్రత్యులైన యాటవికులను బార్వతేయులను సమాహారపఱచి తనవెంట దెచ్చెను. తద్దేశప్రజలలో నున్న తన సైన్య మనిపించుకొనుచున్న వీరులను వారికి జతపఱచి క్రొత్తగా వెలినుండి మ్లేచ్ఛుల దండులు రాకుండ నియమము చేసెను. ఆ మార్గముల కిరువైపున నున్న పర్వతములమీఁదఁ బెద్దపెద్దరాళ్ళు మోపెట్టియుంచఁబడెను. పెద్దపెద్ద దళములుగా విదేశీయులు వచ్చునపుడు పైనుండి వారు రాళ్ళను దొర్లింతురు. ఒక్కొక్కచోట పదిపదిరాళ్ళు పెద్దబండలు. ఇట్లు పర్వతములమీఁది శిలల యొద్ద రక్షణకు నిలువబెట్టఁబడిన పురుషుల కాహారము నందించుటకుఁ గొందఱ నేర్పాటు

చేసెను. ఆ మహాపర్వతములలోని వారంధ్రములు గుఱ్ఱములమీఁదనే సంచరింతురు. మిహిరకులునితో నెవ్వఁడును 'మీ రిట్లు చేసినచో బాగుగా నుండు' నని చెప్పలేరు. అతఁడు వినఁడు. వినఁడు సరికదా యతని కిష్టము లేనిచో వెంటనే వాని శిరస్సును ఖడ్గముతో ఖండించును. మంచిమాటను జెప్పుటకుఁగూడ సేనాపతులు జంకుదురు. అతని సైన్యము దళములుగా నుండును. దళమునకు పందమంది. ఆ పంద మీఁదివాడు దళాధిపతి. అట్టి పదిదళముల మీఁదివాఁడు చమూపతి. ఇట్టి చమూపతులు మిహిరకులుని సైన్యములోఁ పదునేనుగురు కలరు. అయిదుగురు చమూపతులమీఁద నొక సేనాపతి యుండును. అట్టి సేనాపతులు మువ్వురు కలరు. వీరి యందఱిమీఁద దా నిప్పుడు మహాసేనాపతి. సైన్య మంతయుఁ గలసి యున్నప్పటి నిర్ణయము దీనిపైన మఱికొంత యున్నది. మువ్వురు సేనాపతులును రాజ బంధువులును సుక్షత్రియులు. రాజునకు వారికి బీరకాయపీచు సంబంధ మున్నది. ఆ బంధుత్వపుఁ బ్రస్తావన యెప్పుడైన మిహిరకులుఁడు చేయవచ్చును. అది రాజు సేనాపతియందుఁ జూపించిన యనుగ్రహము. వారా ప్రస్తావన చేయరాదు. చేసినచో వాఁడు గర్వి యని యర్థము. రాజుతో సమానప్రతిపత్తిని వాంఛించుచున్నాఁ డని యర్థము. మఱునాఁడు వాఁడు నిరుద్యోగి యగును. సామాన్యముగా సైనికుఁ డగును. ఒక సైనికునిమీఁదఁ బదిమంది సైనికుల పర్యవేక్షణ యుండును. వాఁడు బెసగిపోవుటకు వీలులేదు. ఈ సేనానులు మువ్వురును మిహిరకులునకు లాలాటికులు. ఎప్పు డతని కనుబొమ కదలునో యా కదలిక యర్థమేమో తెలిసికొని వెంటనే క్రియాచరణకుఁ గడంగువారు. వారు మువ్వుర కొక యూహ తోఁచెను. కొండమార్గము లిట్లరికట్టబడిన తరువాతఁ దమ సైన్యమే యా మార్గముల వెంట మఱియుఁ బశ్చిమదేశములకుఁ బోయి యచటి యీ యొత్తిడియొక్క పుట్టినస్థలమును మట్టుబెట్టినచో నీ యొద్దడి మఱియుఁ గొన్నివందలయేండ్లవఱకు రాదనియు నచటి మ్లేచ్ఛులు విజృంభింపరనియు వారికి నూహ కలిగెను. రాజుతో నెవరు చెప్పుదురు: ఎవ్వరును జెప్పలేరు. మిహిరకులుఁ డట్లు కట్టుదిట్టము చేసి తత్తద్దేశీయులైన సైనికులను బది వేలమందిని తన్మార్గరక్షకులుగా నియమించి మఱియు దక్షిణమునకుఁ బోయెను. అచ్చట మిగిలిన మ్లేచ్ఛులు పూర్వమే గుండెలు దిగజాఱిపోయి కొందఱు భారతీయుల వేషములు వేసికొనుచుండిరి. తత్పూర్వమే మ్లేచ్ఛులు భిక్షుకులుగా భిన్నప్రాంతములయం దుండుట కలదు. కొందఱు మ్లేచ్ఛులు తాము భిక్షుకులుగాఁ దిరుగ నారంభించిరి. నిర్భయముగాఁ దిరుగాడు మ్లేచ్ఛదళము లందందుఁ గలవు. వారిని మిహిరకులుఁడు సులభముగా సంహరించెను, ఎవని వాకిట గుఱ్ఱము కలదో వాని యిల్లు పరీక్ష చేయబడును. ఆ యింటిలో దొరకు ఖడ్గములు, కటారులు, గదలు, బల్లెములు మిహిరకులుని భటులు వశము చేసికొందురు. భారతదేశీయుల ఖడ్గములకు మ్లేచ్ఛుల ఖడ్గములకు భేదము లుండును. మ్లేచ్ఛుల ఖడ్గములు సర్వదా వక్రములు. వారికి దీర్ఘఖడ్గము లుండవు. వారి కెక్కువ కటారులు. వారికి గద లుండవు. ఏనుఁగులు లేకపోయినను వారి యొద్ద నంకుశము లుండును వారు వానితో మనుజులను బొడిచి లోని నరములను బయటకు లాగుదురు. భారతదేశమున నంకుశములను దంతావళములను నడపుటకే మిక్కిలి యుపయోగింతురు. ఏనుఁగులు లేనివాని యింటిలో నంకుశ మెందులకు! సామాన్యుల గృహములయందు యుద్ధాశ్వము లెందులకు. మిహిరకులుని సైన్యము గుఱ్ఱములు కనిపించినచో నవి యుద్ధాశ్వములో పౌరుల సంపత్తి ననుసరించి ప్రవహణమున కుపయోగించు నశ్వములో తేలికగాఁ గనుగొందురు. శత్రువుల సన్ని కలిగిన ప్రతిచోట గుఱ్ఱములను కైవసము చేసికొనుటయేకాదు, ఆయుధములను స్వాధీనము చేసికొనుటయేకాదు గృహములను తగులబెట్టుదురు. ఆ యా కుటుంబములను నాశనము చేయుదురు.' ఇట్లు మ్లేచ్ఛులకుఁ దావొసంగిన దేశీయులలో నన్ని వర్ణములవారును గలరు. వారు క్షత్రియులైనచో నధికశిక్ష. బ్రాహ్మణులైనచోఁ గొంచెము తక్కువశిక్ష. తదితరవర్ణముల వారికి మఱియుఁ దక్కువశిక్ష. ఈరీతిగా మ్లేచ్ఛులు రాకముందు మహాధనవంతులైన పలుమంది నిర్ధనులై ధనవంతుల యిండ్లలోఁ బనులు చేసి బ్రతకవలసినవారైరి. ఉత్తమ కులస్త్రీలు మ్లేచ్ఛసంపర్కము కలిగియున్నవారైనచో వారిని శిరస్సులు గొరిగించి వివస్త్రలను జేసి యూరంతయు ద్రిప్పించి ఖడ్గములతో నఱికి చంపుదురు. నీచకులస్త్రీలను డోంబాలుగాఁ జేయుదురు. డోంబా లనఁగా స్వాపకు లనఁగా నా దేశములం దున్న యస్పృస్యజాతి. అందులో మేళతాళములతో వీథులందు నాడెడి యస్పృశ్యజాతి. అట్టి స్త్రీల నస్పృశ్యలుగా మార్చివేయుదురు. వారి దోషము మ్లేచ్ఛపురుషసంగమమాత్రమైనచో నీ శిక్ష. మ్లేచ్ఛులకు సాహాయ్యముకూడఁ జేసినచో వారి యెడళ్ళు గాయములు చేసి చేతులు కాళ్ళు కట్టి కుక్కలకుఁ గాకులకుఁ గ్రద్దలకు వదలిపెట్టుదురు. ఇట్టి మహాక్రూర కార్యములచే మిహిరకులుఁ డన్నచో జనములకు భయమువేసిపోయెను. ఇట్టి పనులు సుక్షత్రియులు చేయింతురా? దేశమునందలి జను లిట్లు చెప్పికొన నారంభించిరి. 'మిహిరకులుఁడు క్షత్రియుఁడు కాఁడు. భారతదేశీయుఁడు కాఁడు. వీఁ డెవఁడో మ్లేచ్ఛుఁడు, వీఁ డొక హూణజాతివాఁడు. తా నొక భారతీయునివలె నటించుచు భారతీయులను హింసించుచున్నాఁడు.' కాని యెఱిఁగినవారికి మిహిరకులుఁడు సుక్షత్రియుఁడు.

(సశేషం)

పంజాబ్ కేసరి

జూలూరి హనుమంతరావు

ఉ॥ ఓ మహనీయభారతమహోదయులార! స్వదేశభావనా
ధీమతులార! భారతనదీనదపుణ్యయశోవిశాలగా
థామహితాత్ములార! పరదాస్యము వద్దిక లెండు రండు స్వ
ర్ధామము మాతృభూమి భరతస్థలి స్వేచ్ఛఁ బ్రభాసమూర్తిగాన్.

మ॥ ఇది - నీభావము, దృక్పథమ్ము, మధురస్వేచ్ఛాసుకృన్మార్గ, మె
య్యది నీవాంఛిత మైనదో యదియ నే డబ్బెన్ ద్వదీయప్రభా
హృదయాంతర్గతనిత్యధైర్యగుణమే యీ భారతీ స్వేచ్ఛ యై
విదితప్రాభవ మయ్యె నోలజపతీ! విశ్వంభరాస్తుత్య మై.

ఉ॥ దేశహితార్థికిన్ ఫలము దేశబహిష్కరణంబ? పావనో
ద్దేశము గల్గువానికిని దేహము నెల్లెడ వాతలా? దురా
శాశమనమ్ము హూణజనసంతతి కెక్కడి దయ్యా? నీ క్రుధా
వేశితసింహగర్జనమె ప్రీల్చెను వారి బలమ్ము లాలజీ!

శా॥ పంజాబ్ కేసరి వౌదు నిశ్చయముగా స్వాతంత్ర్య మీభారతో
ర్విం జన్మించెడివారిఁ కేరి కరుణావీక్షార్థహా? జన్మతో
రంజిల్లం; బరదాస్యభావ మిచటన్ రాకూడ దన్నీదు మా
టం జిప్పిల్లెఁ బరప్రభుప్రతిధనుష్టంకారహుంకారముల్.


ఉ॥ స్వైరవిహారమున్ సలిపి సై మనుసంఘము లెక్కసేయకే
వీరుడ వౌచు నిల్చి పరవీరభటాళికిఁ బ్రక్కబల్లె మై
ధీరుడ వై పరప్రభుత ధీగుణమున్ సడలించి భారతో
ర్వీరమణీయగౌరవచరిత్రను నిల్పితి వయ్యా! లాలజీ!

కం॥ 'నిక్కము నను గురిపెట్టెడు
నొక్కొక్కతుపాకిగుండు నొక్కొక మే కా
రక్కసి 'యింపీరియలిజ'
మెక్కెడు శవపేటిఁ గూర్ప హిందూధరలో.'


మ॥ అని నీ వన్నది నిత్యసత్య మయి మర్యాదానుసారంబుగా
ననిపెన్ - అంతిమ యాత్రకై వలసరాజ్యప్రేతమున్ భూతముఁ
జనహృన్మోదము నవ్యకాంతివిలసత్సౌరభ్యనీరేజసం
జనితానంతవికాస మై చెలఁగ స్వేచ్ఛాభారతోర్వీస్థలిన్.

చ॥ భవదమలప్రశస్తి బహుభంగుల స్తుత్యము; దేశభావసం
భవమగు; చేతనారుచిరపంకజ మౌను; లసించు నెప్డు కాం
తివలయకేంద్ర మై; లజపతీ! హృదయామృతవాహినీస్ఫుర
చ్ఛవి శతపత్రవత్సరలసజ్జననోత్సవ మౌచు నొప్పెడిన్.


ఢిల్లీలో రిపబ్లిక్ దినోత్సవ వేడుకలు



రిపబ్లిక్ దినోత్సవాల సందర్భంగా పదిహేడు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన బృందాలు రమణీయమైన జానపద నృత్యాలు ప్రదర్శించాయి. ప్రతి బృందం తమ ప్రాంతంలోని అపూర్వ నృత్యాలను ప్రదర్శించింది. ఆంధ్రప్రదేశ్‌నుంచి వెళ్ళిన జానపద నర్తకుల బృందం గౌరవ పురస్సరంగా రాష్ట్రపతి ముందునుంచి నడిచివెళ్తున్న దృశ్యం




ఆంధ్ర ప్రదేశ్ బృందం నాయకుడిని రాష్ట్రపతికి పరిచయం చేసినప్పటి చిత్రం.




ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జానపద నర్తకులకు వెండి సోవెనీర్లను బహూకరించారు. జానపద నృత్యాలలోనూ, శకటాలంకరణలోనూ ఆంధ్రప్రదేశ్ బృందానికి తృతీయస్థానం లభించింది.

అలంకృత శకటాలు


... మణిపూర్





... లక్కాదీవులు


... మద్రాసు







... మధ్య ప్రదేశ్

... గోవా






... నాగాల్యాండ్





... రాజస్థాన్




... చేతి పరిశ్రమలబోర్డు

... మధుర గిరిజన మహిళలు జనవరి 30 వ తేదీన రాజ్‌ఘాట్‌కు వెళ్ళి జాతిపితకు శ్రద్ధాంజలి ఘటించారు.






అంతర్జాతీయ చలనచిత్రోత్సవ ప్రతినిధులతో మధుర జానపద నృత్య కళాకారులు.




రాజఘాట్ వద్ద ఆంధ్రప్రదేశ్ బృందం.



ఇండియాగేటుదగ్గర ఊరేగింపులో ఆంధ్రప్రదేశ్ జానపద నర్తకులు.

"ఒకరినొకరు ప్రేమించుకోవడం నేర్చుకోవాలి. భారతదేశాన్ని జాజ్జ్వల్యమానం చేయడానికి అందరూ కలిసికట్టుగా గానంచెయ్యండి, నర్తించండి, నవ్వండి, శ్రమించండి —" అని ప్రధాని లాల్‌బహాదుర్‌శాస్త్రి, తల్కటోరా ఉద్యానవనంలో సమావేశమైన అన్ని ప్రాంతాల జానపద నర్తకులను ఉద్దేశించి అన్నారు.







ఆంధ్రప్రదేశ్ మధుర నర్తకులతో ప్రధాని.




కేంద్ర రేడియో సమాచార మంత్రిణి శ్రీమతి ఇందిరాగాంధీతో జానపద నర్తకులు.



హిమాచలప్రదేశ్ బృందంవారితో నృత్యం చేస్తున్న మన జానపద నర్తకులు.





తల్కాతోరా ఉద్యానవనాన్ని సందర్శించడానికి వచ్చిన శ్రీమతి ఇందిరాగాంధీ అక్కడి శిబిరంలో వెల్లివిరిసిన ఆనందంతో ప్రఫుల్ల వదనమైన దృశ్యం.



తల్కాతోరా ఉద్యానవనాన్ని కేంద్ర రక్షణ మంత్రి శ్రీ వై. బి. చావన్ సందర్శించిన సందర్భంలో వారికి ఒక బేడ్జి, పూలగుత్తి బహూకరింపబడినప్పటి చిత్రం.

'అవును మిత్రులారా! మీ దప్పు గ్రామీణులకు మహా చక్కని మనోల్లాసాన్ని కలిగిస్తుంది' అన్నారు శ్రీ వై. బి. చావన్.





హిమాచల ప్రదేశ్ జానపద నర్తకులతో ఆంధ్రప్రదేశ్ మధుర గిరిజన స్త్రీలు.

తల్కాతోరా ఉద్యానవనంలో జరిగిన విచిత్రవేషధారణ పోటీలో ఆంధ్రప్రదేశ్ బృందనాయకుని 'పెద్దపులి' వేషం.



లాలాలజపతిరాయ్ శతవార్షిక జయంతి

కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

శ్లో॥ శ్రీమద్భారతమాతృ పుణ్యవిభవాత్ జాతఃసుపుత్రోమహాన్
శ్రీలాలాలజపత్ సుధీరవిరతం యోఽభ్యర్చయత్ భారతం ।
విద్యాధర్మ సమాజసేవనవిధౌ పాశ్చాత్యనిర్వాసనే
దేశస్యోద్ధరణే కృషించ విదధే సోఽశ్రాంతమశ్రాంతధీః ॥

శ్లో॥ వంశేఽత్యుగ్రేఽగ్రవాలే జనిమభజత యో భారతీయాగ్రనేతా
ప్రత్యగ్రాదిత్యతేజాః లజపతి రతులోదాత్తపాండిత్యచండః ।
భ్రాజచ్ఛ్రీ భారతాంబానిగళగణ సముత్కృంతనే వీరపుత్రః
తస్మై యచ్ఛామి భక్త్యాంజలి మతి వినతః ధీరలాలాబుధాయ ॥

సీ॥ ఎవనిజన్మకు గురుపు లీ భువి; వారలే నిరుపమవిద్యకు గురువు లైరి;
ఎవనికి సహజమై యెసఁగె వైదికధర్మ మదియె జన్మకు ధ్యేయమై తనర్చె;
ఎవఁడు ప్రజాసేవయే విధిగా నెంచె నది జన్మసార్థక మనుచు సలిపె;
ఎవఁడు భారతసుధాభృంగార మగుచు స్వాతంత్ర్యామృతమున సోదరులఁదనిపె;

తే॥ గీ॥ అట్టి భారతకర్మవీరాధినేత
కఖిల భారతసేవాంకితాత్మజనికి
మాతృసేవాగ్రనాయకమణికి లాల
లజపతికి శ్రద్ధ నంజలులను ఘటింతు.

మ॥ తన ధీవైభవయుక్తిఁ బశ్చిమవిభుత్వం బూచెఁ దా నేచుచున్;
తనగీర్వైభవశక్తి భారతము నుత్సాహించె మేల్కొల్పుచున్;
తన శ్రీవైభవశక్తిఁ బేదల దరిద్రత్వంబు మాన్పెన్; నుతిం
తును లాలాను సుధీరునిన్ లజపతీంద్రున్ ధర్మసంవర్ధనున్.

ఉ॥ వైదికధర్మవర్ధన దివాకరమూర్తికి, భారతీయ భా
గ్యోదయభానుమూర్తి కమృతోపమమానస పుణ్యమూర్తికిన్
సోదర భారతీయ వివిధోత్కట దాస్యనివర్తి మూర్తి కెం
తే దృఢభక్తితో లజపతీంద్రున కంజలులన్ ఘటించెదన్. (తరువాయి 19వ పేజీలో)

లాలా లజపతిరాయ్

డా. దివాకర్ల వేంకటావధాని

ఉ. దేశము వృద్ధికై జనత
తి ప్రకటాభ్యుదయోపలబ్ధికై
క్లేశము లేశ మెంచక మ
తీమసవృత్తికిఁ బోక సంతతా
వేశముతోఁ గృషిన్ సలిపి
పేరు గడించిన ధీర ! లాలజీ !
నీ శతవార్షికోత్సవము
నించు నెదన్ నవజీవనప్రభల్.

మ. నిను దర్శింపను నీ ప్రసంగము వినన్
నీ తోడి బాంధవ్యముం
గననైనన్ భవదీయ నామము సమా
కర్ణించినంతన్ నినుం
గనినట్టుల్ భవదీయ భాషితము నా
కర్ణించినట్టుల్ భవ
జ్జని సంబంధము కల్గినట్టు పులకాం
చద్భక్తి మై పొంగెడిన్.

సీ. దేశప్రసూదాస్య పాశ విచ్ఛేదన
క్రియ కర్థ మసువు లర్పించినావు
భరతధాత్రీ సముద్ధరణ సంతత దీక్ష
కడలేని కడగండ్లు గుడిచినావు
జనతా మనోవికాసవ్యాప్తి నర్థించి
విద్యాలయములు స్థాపించినావు
సంఘస్థ చిరదురాచారముల్ తొలఁగింపఁ
జాల సంస్కారముల్ సలిపినావు

పితరులకు భక్తి సేవ గావించినావు
మతమునం దాస్థ వీడక సతతరాజ
కీయ కార్యప్రవృత్తి సాగించినావు
నీవ యొక సంస్థ వను మాట నిజము నిజము.

మ. పరదేశస్థులఁగూడఁ బ్రీతిమయ భా
వం బొప్ప నీక్షించి త
త్పరమస్నేహము చూఱగొంటి ధృతియున్
శౌర్యంబు ధీరత్వమున్
బరఁగం జేసి యరాతి మత్త గజ సం
తానోగ్ర పాంచాల కే
సరివై మించితి నీకు నీవ సరి వి
శ్వస్తుత్య ధీ ! లజ్పతీ !

శా. మే యోకన్యక దుష్టచిత్తయయి సా
మీచీన్యము న్వీడి స
ద్ద్వేయం భా భరతావనీ విమల కీ
ర్తి న్మాప నేమేమొ తా
వ్రాయం దద్గత హేతువాదవికల
త్వం బీవు ఖండించి దే
శీయ ప్రాభవ మెత్తిచూపితి ప్రసూ
సేవైక చింతాఖనీ !

మ. శతసాహస్ర భటాళి మారణవిధా
సామర్థ్య ఘోరాస్త్ర సం
తతికంటెన్ గగనాధ్వ సంచర విమా
నక్షిప్తహాలాహలా
స్విత జీవాంతక వాయు సంతతుల కం
టెన్ భీతి గావించె గ
ర్విత చిత్తాంగ్ల జనాళికిన్ నయలస
ద్రీత్యర్థముల్ నీ నుడుల్.

శా. లాలాజీ ! నినుఁబోలు నాయకు లన
ల్పంబైన త్యాగంబునన్
రాలు న్నన్నముగాఁ దనూరుధిరముల్
రాజ త్స్వాతంత్రతత్వమన్

లీలాసౌధముఁ గట్టిరే మచట సం
దీపింతు మానంద సు
శ్రీలాలిత్యము మీఱఁ జెట్టొకఁ డమ
ర్త్యం బం డొకం డొందెడిన్.

మ. ఒక దుర్మార్గుఁడు లాటి పుచ్చుకొని నీ
వ్యాఘోరముం గొట్టి యో
డక మాత్రంఘ్రియు గార్చ నా కలిత దా
ర్ఢ్యంబైన నీ నెత్తు రు
ర్వీకిఁ జిందించి సజీవుఁడై మనియెనా
యేమయ్యె నావేళ వై
రికరిస్తోమవిదారణోగ్ర భరతో
ర్వీ వీర హర్యక్షముల్.

శా. చేఁతన్ మాటలు కార్యముల్ పరహిత
క్షేమప్రదానైక ని
ష్ఠాతాత్పర్యముతోఁ జెలంగ జననీ
స్వాతంత్ర్య సిద్ధ్యర్థమై
సాతత్యంబుగ సేవచేసిన నినుం
జా వెట్లు దాపించెడిన్
జాతానాం మరణం ధ్రువ మ్మను నుడుల్
సామాన్యతః ప్రోక్తముల్.

మ. జవహర్లాలు గతించెఁ జైనియుల దు
శ్చర్యా ప్రచారంబు లం
తవిహీనంబుగ సాగుచుండెఁ బోరు గ
న్నన్ ప్రక్కలో బల్లెమై
యవధిం గూర్చెడి నిండె నెల్లెడల న
న్యాయమ్ము స్వార్థమ్ము మా
త్రవనిన్ స్వర్గమునుండి యైన సుఖధు
ర్యం జేయవే లాలజీ !

(17 వ పేజీ తరువాయి)

శా॥ గాఢాంధతమసంబు తేజమున నిష్కాసింపఁగా నీ భువిన్
ప్రౌఢుండై; భరతోర్వి సజ్జనమనోఽబ్జంబుల్ వికాశింప నా
రూఢిన్ బర్వుచు; శత్రుసంతతికి నుగ్రుండై ప్రపంచంబునం
దాఢౌకించెను తీక్ష్ణమూర్తి లజపత్యాదిత్యుఁ డుద్దాముఁడై.

చ॥ జననముఁ గాంచి రెండఱో విచారఘనుల్ మన భారతంబునం
దున, లజపత్ సమాను లతిదుస్సహతేజులు; కాని ధీరవ
ర్తనమున సింహమట్లు జనదాస్యగజేంద్రుని కుంభయుగ్మఖం
డనచణు లార్యవీరు లకటా ఒకరిద్దరె పుట్టి రీ ధరన్.

కం॥ ఆంగలుల లాఠి దెబ్బల
కంగము బలియిచ్చినట్టి యతులితవీరో
త్తుంగ త్యాగికి లజపతి
కంగములన్ వాల్చి భక్తి నంజలు లిడెదన్.

శ్లో॥ స్వతంత్రే భారతాకాశే కల్పతాం కల్పకోటిషా ।
లాలాలజపతీంద్రస్య కీర్తిజ్యోత్స్నా దివా నిశమ్ ॥

లజపతీంద్రా! నీకు జోహారువుల్

ఉత్పల సత్యనారాయణాచార్య

ఆ. ఇది దురాగతమ్ము ఇటనుండి పొమ్మంచు
మాఱు మ్రోసె నాఁడు భారతమ్ము
తెల్లదొరల నెదుర నల్లని జెండాలు
పట్టి నిల్చె వీర భారతమ్ము.

చ. దుమ దుమ వచ్చు తెల్లదొర
త్రోవలు నల్లపతాక నీడలై
గుమురుకొనంగ, శ్వేతహాత
కుం డట యొక్కఁడు సర్వభారత
ప్రముఖుని నిన్నె కొట్టెనట!
పై బడి, నాటి పరాభవాగ్నికిన్
కుమిలిన దెల్లభారతము
కొండొక నిప్పుల గుండమట్టులై.

సీ. పంజాబుకేసరి పైబడ్డ యా దెబ్బ
ఆంగ్లపాలకుల దౌష్ట్యమ్ము దెలిపె
లాలాజి పైబడ్డ లాఠీ ప్రహారమ్ము
తెల్లదొరల నల్పు తేటపరపె
పరమసాధువుమీద పడిన యా ఘాతమ్ము
దుర్వినీతాళి ఘాతుకత దెల్పె
ధర్మవీరుని గుండె తాకిన యా దెబ్బ
వ్యాపారకుల ఉన్నరూపు దెలిపె
తెలిపె నా దెబ్బ దమననీతి ప్రధాన
కుత్సితాంగ్లేయ పాలకక్రోధమెల్ల
జాతి జాతికి దేశ దేశమ్మునకును
ప్రాచ్య పాశ్చాత్య సభ్య ప్రపంచమునకు.

ఉ. అ మ్మహనీయ మూర్తి కగు
నాపద గాంచి అజాదు కోర మీ
సమ్మున చేయి వైచె, పరజాతి
దురాగత మోర్వలేక తీ
వ్రమ్ముగ మాళవీ కళవ
ళం పడె, నెంతయు బోసుబాబు ఉ
గ్రమ్ముగ మాఱె, ఛీ యనె ఖి
లాఫతు నేత మహమ్మదాలియున్.

మ. తన దేశోన్నతి దెబ్బ తిన్న దని చిం
తా క్రాంత దృష్టి ప్రసా
రణముం జేయు సుధీలలాము డగు నా
లాలాజి హృద్దీపికా
ర్తిని ఆవిర్భవ మొందినట్లుగ భగ
త్సిం గొక్కఁ డా పాప జా
తిని వెంటాడి కలంచ కత్తి పయి కె
త్తెన్ వీరభద్రాకృతిన్

మ. గరువం బొప్పగ నాడు చెన్నపురిలో
గర్జించినా డాంధ్రకే
సరి ఏదీ నను కొట్టు డంచు నిజ వ
క్షస్స్ఫాలనన్ జేసి ని
ర్భర ధైర్యంబున నిల్చినప్పుడు గదా
పంజాబులో వృద్ధ కే
సరి కోదార్పు ఘటిల్లె, సైమను బహి
ష్కారం బెదన్ మెచ్చుచున్.

శా. ఆరాధ్యుండవు నీవు మాకు భవ దీ
యస్ఫార సేవా ఫలా
కారం బైన స్వతంత్రతా మహిత భా
గ్యం బందుకొన్నార మో
వీరస్వర్గ మలంకరించిన మహా
వీరాగ్రణీ! నీ యశ
శ్శ్రీరేఖల్ వివృత మ్మొనర్చునవి ప్రా
చీ ద్వారబంధమ్ములన్.

శా. ఇదె జాతీయపతాక భారత జనం
బేనాడు నిన్ విస్మరిం
పదు నీ పేరున నున్న లాల్ పద మహ
త్వం బెట్టిదో! నేటి కిం
పొదవన్ భారతనేత లందఱి కను
స్యూతమ్ముగా వచ్చుచు
న్నది దీవింపుము సర్వదా లజప
తీంద్రా! నీకు జోహారువుల్.

*(రవీంద్ర భారతిలో, 1965 జనవరి 28వ తేదీన
జరిగిన లాలా లజపతిరాయ్ శతజయంత్యుత్సవం
సందర్భంలో చదివిన పద్యములు)*

సరస్వతీ మహలునందలి తెలుగులో వ్రాయబడిన

హిందీ తాళపత్ర గ్రంథములు

వారణాసి రామమూర్తి 'రేణు'

సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయల నిర్యాణానంతరమూ రమూ శేవిషించి తల్లికోట యుద్ధానంతరమూ తెలుగు వాఙ్మయ సరస్వతి, స్వస్థానం వదలి చోళ మండలానికి వలసవెళ్ళి, తుంగ భద్ర కృష్ణ గోదావరి సలిలాలతో పుష్టిని సంతరించుకొనిన తన జీవితానికి కావేరి జీవనాల మేలుకలయికలతో క్రొంగ్రొత్త వన్నెచిన్నెలు దిద్దుకున్నది. రూపురేఖలు సవరించుకున్నది. తంజనగరం, మధుర, పుదుక్కోట, ఎట్టయాపురం మొదలయిన చోటులందు చిన్నచిన్న రాజ్యాలు, సంస్థానాలు స్థాపించుకొనిన తెలుగు నాయకుల ఆస్థానాలను తన సంగీత నాట్యభంగిమములతో వాఙ్మయ విన్యాసములతో ముఖర మనోజ్ఞము గావించినది. వలస పోయిన, నాటి నాయకప్రభువులు, తమవెంట విజయనగర సామ్రాజ్యమునకు జెందిన సత్సంప్రదాయములను గొనిపోయి వానిని ప్రోది యొనర్చి ప్రవర్ధమానము గావించియుండిరి. నాయక ప్రభువుల కాలము ఆ యా సంస్థానాల చరిత్రలోననే అద్వితీయము, స్వర్ణాక్షరముల లిఖింప బడదగినది. విజయ రాఘవనాయకుని ఏలుబడికి సంబంధించిన చివరి రోజులలో, ఉత్తరమునుండి మహారాష్ట్రులు విజృంభించి తంజావూరును దోచుకొని అక్కడ తమ ఆధిపత్యము స్థాపించుకొనిరి. రణరంగములో విజయరాఘవుడు తన కుమారునితో గూడ పోరాడి నిహతుడయ్యెను.

ఛత్రపతి శివాజీ సోదరుడు శ్రీ 'ఏకోజీ' లేక 'వెంకోజీ' అనే మహారాష్ట్రి వీరుడు తంజావూరిని వశ పరచుకొని, తనకు బూర్వమున్న నాయకరాజులు నెలకొల్పిన సంగీత సాహిత్యాలను ఉపాసించి ఆ సంప్రదాయాలను యథాతథంగా పరిరక్షించుకొనినాడు. ఆయన జ్యేష్ఠపుత్రుడు 'షాహజీ' గొప్ప కవి పండితుడు, కవి గాయక పండితపోషకుడు. ఈయన తన ఏలుబడిలోని తిరువసనల్లూరను గ్రామమును షాహజీరాజపుర మను పేర, నలువదిమంది ఆస్థాన విద్వాంసులకు దానము గావించిన యశస్తిలకుడు. లలిత కళలకు చక్కని ప్రశ్రయ మిచ్చినవాడు.

క్రీ॥ శ॥ 1693 సం॥న దానముగా యివ్వబడిన ఈ గ్రామము ననుభవించిన వారిలో శ్రీ రామభద్ర దీక్షితుడు ప్రాతఃస్మరణీయులు. శ్రీ శ్రీధర వెంకటేశార్యులు — వీరినే అయ్యావాళ్ అనికూడ అంటారు — భాస్కర దీక్షితుడు, పెరియప్పకవి మొదలగు కవి పండిత ప్రకాండులు, మహిమాన్వితులు ఉన్నారు.

శ్రీ షాహజీ సంస్కృ తాంధ్ర మరాఠీ హిందీ భాషలలో గొప్ప పండితుడు, కవి. సంస్కృతాంధ్రములలో ననర్ఘ మణుల వంటి రచన లనేకము గావించినాడు. కావ్యములు, యక్షగానములే కాక 'శబ్దరత్న సమన్వయ, మనియు 'శబ్దార్థ సంగ్రహ' మనియు రెండు నిఘంటువులు గీర్వాణభాషలో కూర్చినదిట్ట. ఈయన రచించిన తెలుగు యక్షగానములు (నాటకములు), కావ్యములు, కిరాత విలాసము, కృష్ణలీలా విలాసము, పార్వతీ కళ్యాణము, శంకర పల్లకి సేవాప్రబంధము, విష్ణుపల్లకి సేవా ప్రబంధము మొదలగునవి యిరువదింటికి పైగా నున్నట్లు తేలును. మరాఠీ భాషలో తొలినాటకమును రచించిన కీర్తి ఈయనకే దక్కినదని అందురు. మరాఠీ సంస్కృతాంధ్రములే గాక హిందీలో గూడ నీ మహారాజు రచనలు రెండు తంజావూరు సరస్వతీ మహలునందు గానవచ్చుచున్నవి. అవిగూడ యక్షగానములే ; మరాఠీ మాతృభాషగ గల యీ మహారాజు ఎక్కడనో చోళమండలమున నుండి ఆంధ్ర హిందీ భాషల నభ్యసించి వానిలో, ననల్పమగు కావ్య గౌరవము సంతరించుకొనిన రచనలు గావించుట పరమాద్భుతము ! ఇంతియే కాదు; ఈ మహారాజు సంతతివాడే యగు 'శివాజి' అను శాసకుని ఏలుబడిలో ఆయన ప్రోత్సాహముపై రచించబడిన యక్షగాన మొకటి ఉర్దూ భాషలో దొరికినది ; దానిని దాదాపు రెండేండ్ల క్రిందట నేను సరస్వతి మహలు లైబ్రరీలో చూచి

మొదటి రెండు ఆకులు కడపటి ఆకునందలి విషయము వ్రాసికొని యుంటిని. ఇది మరియు ఆశ్చర్యకరమగు విషయము; 'భావ సమైక్యత' కొరకు మన మీనాడు పరితపించుచున్నాము. మన పూర్వీకుల కన్న మనము వైజ్ఞానికముగ ఎంతో అభివృద్ధినీ ప్రగతినీ సాధించినా మనుకొను చున్నాము. సభా వేదికలపైననూ వార్తా పత్రికలు మొదలగు వానిలోనూ భావసమైక్యతను గురించి బహ్మాండముగ ఉపన్యాసములు వ్యాసములు సాగించుచున్నాము. ఆర్భాటపు ప్రయత్నముల ద్వారా ఆశించిన లక్ష్యమును 'భావసమైక్యత'ను ఎంతవరకు సాధిం తెలియును; చినా మనునది మన అంతరాత్మలకు మనకేవాక్కూరత్వమునకు మాత్రము లోటులేదు. అట్టిచో నేటికిదాదాపు 250 సంవత్సరములకుపూర్వము ఎచ్చటనో తమిళదేశములో ఒకానొక మహారాష్ట్ర ప్రభువు తెలుగు, హిందీ భాషలలో అనర్ఘములగు రచనలు సాగించిన విషయము, ఆ విధముగా తన ఏలుబడిలో గల తెలుగు, హిందీత్యాది భాషలు మాటాడు — అల్ప సంఖ్యాకులగు ప్రజల అవసరములను తీర్చిన పద్ధతియు అచ్చెరువు కలిగింపవా ? ఇందులో మరొక చమత్కార మేమన, హిందీ, ఉర్దూ భాషలలో ఆనాడు రచింపబడిన గ్రంథములు తెలుగులిపిలో తాటియాకులపై వ్రాయబడియున్నవి ; హిందీలో రచింపబడిన యక్షగానములలోని గీతములు కర్ణాటక సంగీత పద్ధతిలో — రాగతాళాదులలో నుండుట మరియు విశేషము ; ఇదే విధముగ కొన్ని తెలుగు తాళపత్ర గ్రంథములు హిందీ, మోడీ లిపులలోగూడ వ్రాయబడియున్నవి. బహుశః ఆనాడు, మనకువలె ప్రగతి పథాన్ని అవలంభింపని ఆ మనీషులకు భాషా భేదములు లిపి వైవిధ్యములు సమస్యలు కానట్టు తోచును ; ఏమో ; నిజమయిన భావసమైక్యతకు యింతకన్న చక్కని నిర్మాణాత్మకమగు నిదర్శనము మరేది లభింపగలదు ? ఇక ప్రకృత మనుసరామః

శ్రీ షాహజీ మహారాజ కృతములగు హిందీ రచనలు రెండు కలవని మనవిచేసియున్నాను. అవి రెండును తెలుగు లిపిలో తాటియాకులపై వ్రాయబడినయున్నవి. అందొకటి 'రాధా వంశీధర విలాస నాటకము' రెండవది 'విశ్వాతీత విలాస నాటక' మను, శివరాత్రి మాహాత్మ్యకథ యితివృత్తముగా గల రచన. రెండును యక్షగాన పద్ధతిలో నున్నవి. రెంటియందును గీతములు, కర్ణాటక సంగీత పద్ధతిలో - దరువులు, పదములు మొరలగువాని రూపమున వ్రాయబడినవి. గీతములలో ప్రయుక్తమైన భాష ప్రజాభాషకు సన్నిహితమైనది. సూత్రధారుడు పాత్రలు మాటాడే వచనములు 'సదాక్కడీ' అనబడే కలగాపులగపు హిందీలో ఉన్నవి. వీనిలో అనగా ఈభాషల్లోతెలుగు రచనాపద్ధతీ నుడికారమూ వీని ప్రభావము గోచరించును. రంగస్థల నిర్దేశము అచ్చటచ్చట తెలుగు భాషలోనే చేయబడుటయు గలదు. ఉ :— 'అని భక్షించేది' 'పిలుచుకొని వచ్చేది' యిత్యాదులు. లేఖకులందరు దాదాపు తెలుగువారే అగుటనో యేమో ఆ తాళపత్ర ప్రతులలోని భాష చాలా దురూహముగా ఉండి పరిష్కరించుటకు ఎంతో కష్ట మనిపించును. సరస్వతి మహలునందలి యిటువంటి తాళపత్ర గ్రంథములు చూచునప్పుడు, ఆనాడు అనగా నేటికి రెండుమూడు శతాబ్దుల క్రిందట చోళమండలమున సాంస్కృతికములయిన వ్యవహారములలో ప్రయోగింపబడు భాష తెలుగని గట్టిగా తోచును. లేఖరులు తెలుగువారగుటయే గాక ఎక్కువగా అపండితులుగ గూడ నుండినట్లు తేలును. పది పూటలు యే దాతయేని భోజనము పెట్టుచో అతనికి ఒక గ్రంథము వ్రాసి ఇచ్చుచుండిరి; పై రెండు కృతులలో నొకటియగు విశ్వాతీత విలాస నాటక ప్రతియందలి కడపటియాకును పరిశీలించినచో సీవిషయము స్పష్ట మగును. అం దిట్లున్నది.—

"రః యలేకమునందు పదారవనాటకం బైన, విశ్వాతీత విలాస నాటకం, రెట్టాల గ్రామం రావిచేడి తిమ్మయ్య కుమారుడు, లేఖరి వెంకట రంగయ్య చేతివ్రాలను, సంపూర్ణమగునట్లుగాను, వ్రాసి పూర్తిచేసిన తాట్యాకులు. ॥౧౨॥

అన్నదాతా సుఖీభవ ; త్యాగేశ స్తవ కళ్యాణం కరోతు; కర కృత మపరాధం క్షంతు మర్హంతి సంతః॥ ఈ విశ్వాతీత విలాస నాటకం వ్రాయించిన వరుడు ప్రసన్న భాగోతులు॥ ఆయన చెప్పిన ప్రకారం నేను వ్రాశినాను. నేను వ్రాశిన తర్వాతను శ్రీనివాస భాగోతులు యీ ప్రతిని చూచి ఎట్లో పంతుల వాడి చాతను వ్రాయించినాడు."

దీనినిబట్టి వ్రాతప్రతులు ఎంత తప్పుల తడకలుగా ఉండుటకు అవకాశము కలదో స్పష్టమగును. మొదట హిందీభాష సరిగా తెలియకపోవుట, మరొకడు చెప్పినది విని వ్రాయుట ; ఆ విని వ్రాయుటలో నెన్నియేని లేఖన ప్రమాదములు దొరలవచ్చును. ఇదిగాక మరొక చిక్కు గూడ గలదు. గీతములు కర్ణాటక పద్ధతిలో పాడబడుచున్నందువలన సంగీతమునకు అవసరమగు విధమున శబ్దములలోని యక్షరములను హ్రస్వీకరించుట దీర్ఘీకరించుట తరచుగ నుండినది. అందుచే పాడబడిన విధముననే లేఖరులు హిందీని వ్రాసియుండిరి. ఒక ఉదాహరణము —

'రాధా వంశీధర విలాస నాటక'ముతో అంధకారమును వర్ణించు గీతము —

"దేఖ మాయి తిమిర శ్యామా ఘూనిరా !

తిమిరా శ్యామా ఘనిరా !

ఇచ్చట మొదటి పంక్తిలో 'తిమిర శ్యామ ఘనేరా !' అని ఉండుటకు బదులుగా 'తిమిర శ్యామా ఘూనిరా !' అని ఉన్నది. ఇదే రెండవ పంక్తిలో 'తిమిరా శ్యామా ఘనిరా' అయింది. ఇట్లే "అపనో మానిక్ కహాఁ గయా సోధూంఢన' అని ఉండవలసిన చోట 'అపనో మాణిక్యా-హ గయా సుధూండోన్' అని లేఖరి వ్రాసినాడు. ఇటువంటి అవకతవకలు లెక్కకు లేనన్ని.

పరిష్కరణకు సంబంధించిన యీ గొడవ వదలి ఆ హిందీ రచనలందలి యితివృత్తాలు, వానికి సాహిత్యంలో గల విలువలను గురించి సంక్షేమంగా మనవి చేస్తాను. వానిలో మొదటిది 'రాధా వంశీధర విలాస నాటకము.' దీనికి రాధాకృష్ణుల ప్రేమ కథా వస్తువు. రాధాకృష్ణుల విరహంతో నాటకం ప్రారంభమై చివరకు యిరువురి పునస్సమాగమముతో ముగియును. మంగళాచరణ శ్లోకానంతరం విఘ్నేశ్వరుడు ప్రవేశించి విఘ్నములు తొలగించి తను తొలగిపోవును. తర్వాత క్రీడోద్యానపాలకుడు వచ్చి రాధ వన విహారమునకై వచ్చుచున్నదని సూచించి వెడలిపోవును. అంతట చెలికత్తెతో రాధ ప్రవేశించి ఒకదాని వెంట నొకటిగా మధ్యాహ్నము, వసంతము, సాయంసమయము, చీకటులు, మేఘములు చంద్రోదయము మొదలగు వర్ణనలు పాడి అభినయించును. ఇక అదే వనమున వేరొక చోట కృష్ణుడు ప్రియా విరహంలో తపించుచు తన మిత్రుడు ఉద్ధవుని రాధను కొని వచ్చుటకై పంపును. ఉద్ధవుడు రూపగర్వితురాలగు రాధను అనునయించుటకు ప్రయత్నించి విఫలుడై తిరిగిపోవును. రాధ కృష్ణునిపై నిందారోపణము కావించును. కృష్ణునివద్దకు ఒకయోగి వచ్చి రాధాసమాగమము జరుగగలదని జోస్యము చెప్పును. ఈ లోపుగ చెలికత్తె కోపము వదలి ప్రియుని చేర బొమ్మని రాధకు బోధించును. కాని రాధతన సౌందర్యాన్ని నమ్ముకొని మంకు పట్టు వదలదు. ఇంతలో అచట యోగి సలహా ప్రకారం కృష్ణుడు మురళి ప్రయోగించును. వంశీనాదము వినుటతోడనే పరవశయై రాధ కృష్ణుని చేరబోయి తన యపరాధమును క్షమింప వేడుకొనును. ఇరువురి సమాగమము మంగళముతో నాటకము పరిసమాప్తమగును.

ఈ చిన్నికథలో విప్రలంభ శృంగారమే ప్రధానముగవర్ణింపబడినది. యోగిశ్రీకృష్ణుల సంభాషణ చమత్కారముగ నుండును. కావ్యదృష్టితో చూచిన పాటలలో చాలా భాగము రసభావాలంకారాలతో నిండి మనోజ్ఞముగా ఉండును. బాహ్య ప్రకృతి వర్ణనలలో కల్పనాచమత్కారము శబ్దముల సొంపు యింపు గలిగించును. శైలి సర్వతో ప్రసన్నముగ నడచినది. భావప్రకటనమున చక్కని వైచిత్రి పఠితులకు గిలిగింతలు కలిగించునదియై గ్రంథకర్త గంభీరపాండిత్య ప్రదర్శనమునకు నికషోపలముగ భాసించును. సౌందర్య గర్విత మానిని రాధ, శ్లేష ఉపమాలంకారముల మేలు కలయికతో తన రూపాన్ని యీవిధంగా చిత్రించుకొనును.

"అష్టనిధి మోపై రహే
వహ్ ఏక్ నిధి కహాఁ జాన పాయే?॥
కాహేకో తూ మనావన చాహే,
అపు హితేయహాఁ ఆవే॥
ముఖ జానో మేరో మహాపద్మ
కరపద్మ దేఖో సఖి రీ॥
శంఖనిధి దేఖ్ తూ కంఠ్ మేరో
నైన మకరనిధి జాన్॥
కచ్ఛపనిధి దేఖ్ మేరా పయోధర్
కుందనిధి దసన సహావే॥
నీలనిధి ఘన చికుర జానో
ఖర్వ రతిసుందర్ రూప్ మేరో
సకలనిధి మేరో అంగబసే సఖి
ముకుందనిధి ఆపుహి ఆయి మిలే"

"సఖీ ! ఎనిమిది నిధులు నాకడ నున్నవి. ఆ ఒక్కనిధి ఎక్కడకు పోగలదు ? నీ వేల నాకు బోధించెదవు ? అతగాడే స్వయముగా రాగలడు ! చూడుము ! నా ముఖము మహాపద్మము. చేయి పద్మము గదా ! శంఖనిధి నా కంఠమే ! నేత్రములు మకరనిధి. నా పయోధరాలు కచ్ఛపనిధి. దంతములు కుందనిధి. కేశరాశి నీలనిధి. రతిని మరపించే నా అందమే ఖర్వనిధి. ఇన్ని నిధులు నావద్ద నుండగా ఆ ముకందనిధి తనకై తాను వచ్చి కలియదా ? ఎందులకీ వెర్రి ?' ఇందులో 'ముకుంద' శబ్దంలో శ్లేష చక్కగా పొందింపబడినది. రాధ వచన వైదగ్ధ్యము గడుసుతనము చక్కగా వెల్లడి అయినది.

కవి మరొక పదములో రాధ విరహ వర్ణన ఎంత రమణీయంగా చేసెనో గమనించుడు.

"చంద మేకోమృగ యహ్ నాదనున్,
చందకో జాననదే !
యానో ఎక్ ఛన్ జుగశీ భాయీ
కై సేమైఁ బిఘరై రహూఁ ?
భుజగ దేఖి సఖి నాదలుబ్ధ ఖ్వై
ఆహార్ త్యజ రహే !
యానోఁ యహమలయానిల
ప్రబలహ్వై విరహిన దుఖదే !

"సఖీ ! మురళీనాదం విని నేను పిచ్చిదాననై పోయితినే ! ఆ నల్లవాడు నా గర్వం

అణచుటకు మురళిని పంపెనేమే ? ఇది నా ప్రాణములు తోడుచున్నదిగదా ! ఈ నాదాన్ని విని చంద్రుని వాహనం లేడి అతనిని అడుగు ముందుకు సాగనిచ్చుటలేదు. అందు చేత క్షణ మొక యుగముగా రాత్రి పేగు చున్నది. ఆ భుజగము నాదసౌఖ్యాన్ని మరగి భోజనము మానివేసినదే ! దానితో రెచ్చి పోయి మలయానిలము నాబోటి విరహిణులను కాల్చివేయుచున్నదే ! ఈ విరహం ఎలా భరించగలనే ?"

షాహజీ మహారాజు రచించిన రెండవ హిందీ యక్షగానము విశ్వాతీత విలాసనాటకము. రాధా వంశీధర విలాసనాటకమున కన్న నిది తెలుగు యక్షగాన పద్ధతికి మరింత సన్నిహితముగా నుండును; దక్షిణాదిన తోడయమంగళము లేక తోడుమంగళము అని భజన సంప్రదాయమున చలామణి అవుతున్నదానికి సమానముగ ఉండే కొన్ని మంగళాచరణ గీతాలతో నాటక ప్రారంభమగును. మొదటిగీతము శివపరమైనప్రార్థన. రెండవది విష్ణుపరమగు మంగళము. మూడవది విష్ణుపరమగు శరణాగతి. నాలుగవది శివపరమగు శ్లోకము. తదనంతరము విఘ్నేశ్వర పరమగు ప్రార్థనగీతము. అటు తర్వాత ద్వారపాలకుని ప్రవేశము, కథా ప్రారంభము. ఈ నాటకమునకు శివరాత్రి మాహాత్మ్యకథ యితివృత్తము. శివకేశవులు కలహభోజనుడైన నారదుని మూలమున తమలో తాము గొప్పవార మని కలహించుకుని శ్రీ జగదంబను మధ్యవర్తిత్వము నెరపమని వేడుకొనుట – పార్వతి వారిరువురిలో విష్ణువును పరమేశ్వరుని చరణములను, బ్రహ్మను పరమేశ్వరుని శిరస్సును పూజించి రమ్మని చెప్పి ఎవరు ముందుగా వచ్చెదరో వారు రెండవవారికన్న గొప్పవారగుదురని చెప్పుట – అదేవిధముగా వారిర్వురు వెళ్ళి శివుని శిరస్సును చరణములను దర్శింపలేక విఫల మనోరథులై తిరిగివచ్చి ఆ సంగతి జగదంబకు నివేదించి తమ అజ్ఞానమునకు పశ్చాత్తాపపడి శివుని సర్వశ్రేష్ఠత్వమును అంగీకరించి, పార్వతి సహాయమున శివుని దర్శనము గాంచుట – యింతమాత్రమే. ఇందులో కామధేనువు మొగలిరేకులు బ్రహ్మకు సాక్ష్యము చెప్పినట్లు కర్ణాకర్ణిగా వినవచ్చే ఉదంతములేదు. తమ భర్తలు శివపారమ్యము తెలిసికొనుటకువెళ్ళి దీర్ఘకాలము రాక తడయుటచే లక్ష్మీ సరస్వతులు భయపడి జగదంబకడకేతెంచి తమ విరహ వ్యధని వేదించుట అనే క్రొత్త అంశమును కవి చేర్చినాడు. ఇందులో 40 వరకు గీతములు గలవు. ఎక్కువగీతాలకు రాగనిర్దేశము చేయడబడ లేదు కాని కర్ణాటక పద్ధతి ననుసరించి తాళము లివ్వబడినవి. వచనభాగము కలగాపులగపు 'సధుక్కడీ' హిందీ. కావ్యసౌష్ఠవము 'రాధావంశీధర విలాస నాటక మంత గా ప్రౌఢము గాకపోయినను అంత పేలవమును గాదు. కొన్ని గీతాలలో కవి ప్రతిభ కొట్టవచ్చినట్లు స్పష్టముగా కనిపించును. మచ్చునకు ఒక ఉదాహరణ –

సరస్వతి తనభర్త ఎన్నాళ్ళకు తిరిగి రానందుకు చింతిల్లి పార్వతితో తన విరహ బాధను వర్ణించు ఘట్టమునందలి యొక గీతము –

బాలాపనసూం యిస్ విధిసూం కుఛనహీం
సుఖపాయో మాయీ ॥
సున్ సఖి యేహీసనబ్ బాత్, ఉన్ కే
బిచురే హమారే అంగధాలసేహోతే ;

* * *

జబ్ తే ఉన్ కే అఛత పడే మోపే. తబ్
తేకఛీముఖ, హ్మారో వాస్ ॥
సృష్టి ఉద్యోగ మోకర్తేరహతే మైం
కైసే సుఖపావూం
మంగలసూత్ర ఉన్ సూ పాయోమైనే
ఆన్ మిలావో సాధ్ ॥

"సఖీ ఈ విధిని కట్టుకున్ననాటినుండియు నా కొకనాడును సుఖములేదు గదా. నేను వాస్తవము చెప్పుచున్నాను. ఆయన నన్ను వదలి వెళ్ళినందువలననే నా శరీరం పాలిపోయి ఈ విధముగ తెల్లబడినది. 'ఆయన నా నెత్తిన అక్షింతలువేసిన నాటినుండియు, ఆయన నోటిలోనే నేను (నానుచున్నాను) నివసించుచున్నాను. సృష్టి అనే ఉద్యోగంలో ఆయన నిమగ్నుడై యుండగా నాకు సుఖ మెక్కడిది. ఆయనవలన నాకు లభించినది మంగళసూత్రము మాత్రమే !"

ఈ గీతంలో శిరస్సుపై అక్షతలు వేయుట, మంగళసూత్రము కట్టుట అను ప్రయోగములు హిందీవారికి క్రొత్త. తెలుగు ఆచారములు నుడికారము కవి రచనపై తమ ప్రభావమును ఏ విధముగ గనుపరచినదియు యందువలన తెల్లమగును. 'ఉద్యోగ' మనుమాట యిచ్చట పూర్తిగా తెలుగు ప్రయోగము – పని అనే అర్థంలో వాడబడినది. హిందీలో ఆమాటకు ప్రయత్నమని అర్థము. సరస్వతి తెలుపుదనమును బ్రహ్మనోటియందు వాసము గావించుట అనే విషయమును కవి చక్కగా ఉత్ప్రేక్షించి చమత్కరించినాడు. 'నోటిలో నానుట' అనునదిగూడ హిందీకి అపరిచిత మగు తెలుగు జాతీయము. సరస్వతి మనోవ్యథను, ఎత్తిపొడుపులతో వ్యంగ్య మర్యాదతో ఈ గీతము చక్కగా ధ్వనింపచేయుచున్నది.

షాహజీ రచించిన ఈ రెండు హిందీ నాటకములకు హిందీ సాహిత్యమున గల స్థానము విశిష్టము. హిందీ సాహిత్యమున యక్షగాన పద్ధతిలో నాటకములు లేనేలేవు. ఆ విధంగా ఒక క్రొత్తసాహిత్య రచనా

పద్ధతిని హిందీకి సమకూర్చుట, షాహజీ. అనగా ఒక హిందీతర రచయిత ఆ భాషకు గావించిన మహోపకారము. అందులకు హిందీ సాహిత్యము ఆ మహారాజున కెంతయినా ఋణపడియున్నది. అంతేగాక హిందీలో నాటకరచనా ప్రారంభము కూడ వంద యేండ్లకన్న ప్రాచీనము కాదు. ఆ విధముగ షాహజీని హిందీనాటక పితామహుడన్నను అతిశయోక్తి కానేరదు. తన హిందీనాటకములను దాక్షిణాత్య గేయనాటక పద్ధతిలో కర్ణాటక రాగతాళములలో రచించి ఆ మహానుభావుడు సేతుశీతసగాలకు మధ్య చక్కని సాంస్కృతిక సేతువు నిర్మించి యావద్భారతావనికి వందనీయుడైనాడు.

షాహజీ తర్వాత రాజ్యమునకు వచ్చిన మహారాష్ట్ర రాజులలో శివాజీ అనే రాజు కాలమున "షజీ ఉద్దౌలా జౌర్ శరమ్ నాగ్ బీబీ కాకిస్సా" అనే ఉర్దూనాటక మొకటి, ఎవరో రచించినది, సరస్వతి మహాలునం దున్నది. అందులోని రచనాపద్ధతిగూడ షాహజీ రచిత హిందీనాటకములను బోలినదే. తమ రాజ్యములో నున్న మహమ్మదీయులకొరకై యీనాటకకర్తను శివాజీరాజు ప్రోత్సహించి యుండెననుటలో సందేహము లేదు. ఈ నాటకమును గురించిన వివరములు పూర్తిగ సేకరించబడనందున దీనిని గురించి ఎక్కువగా ప్రసంగించుటకు తావులేదు.

ఈ విధముగ తంజావూరు రాజ్యము నేలిన మహారాష్ట్ర ప్రభువులు హిందీ ఉర్దూ భాషలలో నేటికి రెండు మూడు శతాబ్దములకు పూర్వమే స్వయముగ రచనలు గావించియు రచయితలను ప్రోత్సహించియు ఆ రెండు భాషలకు నెనలేని సేవ గావించియుండిరి. భారతదేశపు భావసమైక్యతనూ సాంస్కృతిక సమన్వయ చరిత్రను అధ్యయనము చేయగోరువారికి తంజావూరు మహారాష్ట్ర రాజులకాలము చక్కని వెలుగును ప్రసాదించగలదు. మన సంస్కృతి, చరిత్రలో దానికిగల ప్రాముఖ్యము విశిష్టమైనది.

ఈనాడు హిందీ నిజమైన జాతీయభాషగా రూపొందవలెనన్నచో నది ప్రాంతీయ భాషల నుండి యెంతయో గ్రహించవలసి ఉండును. ప్రాంతీయభాషా సాహిత్యముల రచనావిన్యాసములు, ప్రత్యేకతలు అందు ప్రతిబింబించవలెను. ఆనాడే దానిని నిజమైన జాతీయభాష అన పిలుపడును, రాష్ట్రభాష లేక జాతీయభాషగా హిందీకి రూపురేఖలు దిద్దవలసినది, దిద్దగలుగునదియు హిందీ మాతృభాషగా గలవారు కాదు, హిందీతరులైన హిందీ అభిమానులు, రచయితలు మాత్రమే. వివిధ ప్రాంతాల భాషలనుండియు ప్రాణరసమును గ్రహించిననాడే హిందీకి యావద్భారత ప్రజానీకపు ఆదరాభిమానములు లభింపగలవు.

మూడవ పంచవర్షప్రణాళికలో ఉద్యోగావకాశాలు

జి. సంతానబాబు

పనులు చేయదలచినవారందరికీ నిరంతరాయంగా పని కల్పించడంలో ఆధునిక ఆర్థికవిధానం విఫలమవుతున్నదని సుప్రసిద్ధ ఆర్థికవేత్త జోన్ రాబిన్సన్ అభిప్రాయం. ఇది ఈ విధానంలోని ప్రధానలోపంగా పరిగణించబడుతున్నది. దీనికి నివారణోపాయాలను నిరంతరం శోధించడం జరుగుతున్నది. పనిపాటలు చేయదలచే దేహదార్ఢ్యంగల వ్యక్తులందరికీ ఉపాధులు కల్పించడం అనే సమస్య అన్నిదేశాలలోనూ వుంది. ఈ పరిస్థితి అభివృద్ధి జెందిన దేశాలలో, వెనుకబడిన దేశాలలోకూడా ఒకేవిధంగా వుంది. అయితే నిరుద్యోగ పరిస్థితికి గల కారణాలు, దీని పరిమాణం వివిధ దేశాలలో విభిన్నంగా వుంటే వుండవచ్చు. పనులు చేయదలచిన వారందరికీ ఉపాధి సదుపాయాలు కల్పించడమనేదే అన్ని దేశాలలోనూ సాంఘిక విధానం లక్ష్యంగా వుంటున్నది. పూర్తిగా ఉపాధి సౌకర్యాల కల్పనవల్ల ఆర్థిక ప్రయోజనాలు హెచ్చుగా సిద్ధించడమేకాక వ్యక్తిగతంగా ఆర్థిక భద్రతకూడా చేకూరుతుంది. ఇది ఏర్పడినందువల్ల అభ్యుదయం సాధ్యమవుతుంది. మానవాళికి గౌరవప్రపత్తులు పెంపొందుతాయి. వివక్షణ క్షీణిస్తుంది. ప్రజాస్వామిక సమాజానికి రక్షణ లభిస్తుంది. ఈ కారణాలచేతనే డాక్టర్ వౌరా ఆస్టే ఈ విధంగాఅభిప్రాయపడ్డారు :— "ప్రజల జీవన ప్రమాణాన్ని, నిరుద్యోగులకు విస్తారంగా ఉద్యోగాలు లభింపజేయడం ద్వారా ఇతోధికంగా, తీవ్రగతిని పెంపొందించవచ్చు. అంతేకాని గ్రామీణ లేక పట్టణ ప్రాంతాలలో కనీస వేతనాలను పెంపొందించడానికి కానీ లేదా అమలుపరచడానికికానీ, ఆధునిక నమూనా ఉత్పాదక సంస్థలలో నిర్దిష్టమైన కొందరికి అధిక జీతాలు లభించే ఉద్యోగాలు సమకూర్చడానికి కానీ ఉద్దేశించిన కార్యక్రమాలవల్ల ఈ విషయంలో ఆట్టే ప్రయోజనం వుండదు."

భారతదేశంలో ప్రణాళికా కర్తలు, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధిని సాధించే కృషిలో మొదటినుంచీ దేశంలో అసంతృప్తికరమైన ఉద్యోగ పరిస్థితిని ఎదుర్కోవలసివచ్చింది. ఈ సమస్య సర్వవ్యాప్తమైనది. నిరుద్యోగులు లేనిప్రాంతమంటూ ఈనాడు లేదనే చెప్పవచ్చు. ఇంతేగాక ఈ పరిస్థితి పట్టణప్రాంతాలలో గ్రామ ప్రాంతాలలోకూడా ఇంచుమించు ఒకేవిధంగా వుంది. ఎంతోమంది నిరుద్యోగులుగా వున్నారు. అనేక మందికి — ముఖ్యంగా గ్రామప్రాంతాలలో — పాక్షికంగా మాత్రమే విభిన్నరకాల ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. దేశ జనాభాలో విపరీత పెరుగుదల ఏర్పడడంతో ఈ పరిస్థితి మరింత తీవ్రమైనది. ఈ అంశందృష్ట్యా, భారతదేశంలో ప్రధాన ప్రణాళికా లక్ష్యాలలో ఒకటిగా ఇతోధికంగా ఉద్యోగావకాశాల కల్పనను ఆమోదించడం జరిగింది. పూర్తిగా ఉపాధి సదుపాయాలు కల్పించడానికి దీర్ఘకాలకృషి అవసరం. శ్రామికశక్తిలో ఏర్పడే పెరుగుదలకు అనుగుణంగా ఉద్యోగావకాశాలను పెంపొందించడానికి ప్రతి ప్రణాళికలోనూ ప్రయత్నం సాగింది. ఈ విషయంలో మూడువిధాల ప్రయత్నించడం అవసరం. పట్టణ ప్రాంతాలలోనూ, గ్రామీణ ప్రాంతాలలోనూవున్న నిరుద్యోగులకు తగువిధంగా ఉద్యోగావకాశాలు కల్పించాలి — ఇది మొదటిది. ఆతరువాతిఅంశం, శ్రామికశక్తిలో సహజసిద్ధంగాఏర్పడే పెరుగుదలకు సంబంధించినది. పెంపొందే శ్రామికబలగానికిఉద్యోగావకాశాలుకలుగజేయడంఅవసరం. గ్రామీణ ప్రాంతాలలోనూ, పట్టణ ప్రదేశాలలోనూ వ్యవసాయం, కుటుంబ వృత్తులలోనివారికి పనిపాటలకు హెచ్చు అవకాశాలు వుండాలి— ఇది చివరిది.

ఆంధ్రప్రదేశ్‌లోని పరిస్థితిని ప్రధానంగా దృష్టిలో వుంచుకొని మూడవ పంచవర్ష ప్రణాళికలో ఉద్యోగావకాశాలను గురించి స్థూలంగా తెలియజేయడానికి ఈ వ్యాసంలో ప్రయత్నించడం జరిగింది. వీటిని తెలుసుకోవడానికి పూర్వం తృతీయ ప్రణాళికారంభంలో ఎంతమంది నిరుద్యోగులుగా వున్నదీ, ఈ ప్రణాళికాకాలంలో వీరిసంఖ్యలో ఎంత పెరుగుదల ఏర్పడేదీ తెలుసుకోవడం అవసరం. ఇందువల్ల ఈ ప్రణాళికా పథకాలవల్ల లభించగల ఉద్యోగావకాశాలను గురించి తెలుసుకోవడానికి వీలవుతుంది.

దేశంలో మూడవ ప్రణాళికారంభంలో 80 లక్షలకుపైగా నిరుద్యోగులున్నట్లు అంచనా. వీరుకాక, పాక్షికంగా ఏదో ఒక పనిలో వుంటూనే అదనంగా పనులు చేపట్ట దలచినవారి సంఖ్య 150 లక్షలు మొదలు 180 లక్షల వరకు వున్నట్లు అంచనా. అయితే వారి సంఖ్యను ఖచ్చితంగా అంచనా కట్టడం సాధ్యంకాదు. తృతీయ ప్రణాళికా కాలంలో శ్రామికశక్తిలో దాదాపు 170 లక్షల పెరుగుదల వుంటుందని అంచనా. కాబట్టి మూడవ ప్రణాళికలో పూర్తిగా ఉద్యోగావకాశాలు కల్పించాలంటే 250 లక్షల ఉద్యోగ ఖాళీలు అవసరం. కాని తృతీయ ప్రణాళికా కార్యక్రమాలు 140 లక్షల ఉద్యోగ ఖాళీలను మాత్రమే కల్పించే అవకాశం వుంది. (105 లక్షల ఉద్యోగాలు వ్యవసాయేతర రంగాలలో, 35 లక్షల ఉద్యోగాలు వ్యవసాయరంలో). వ్యవసాయేతర రంగాలలోగల ఉద్యోగావకాశాలకు సంబంధించిన వివరాలు దిగువపట్టికలో పేర్కొనబడినవి:-

రంగం		ఉద్యోగావకాశాలు	
నిర్మాణాలు	—	23.00	లక్షలు
విద్యుచ్ఛక్తి, నీటిపారుదల		1.00	లక్షలు
రైల్వేలు	—	1.40	లక్షలు
ఇతర రవాణా, రాకపోకలు		8.80	లక్షలు
పరిశ్రమలు, ఖనిజాలతోసహా			
లఘు పరిశ్రమలు		16.50	లక్షలు
అటవీశాఖ, మత్స్యశాఖ			
తత్సంబంధితరంగాలు		7.20	లక్షలు
విద్య	—	5.90	లక్షలు
ఆరోగ్యం	—	1.40	"
ఇతర సాంఘిక సేవలు		0.80	"
ప్రభుత్వ సర్వీసు	—	1.50	"
వర్తక, వాణిజ్యాలతోసహా			
ఇతర రంగాలు	—	37.80	"
మొత్తం		105.30	"

వ్యవసాయేతర కార్యక్రమాలలోనూ, వ్యవసాయ కార్యక్రమాలలోనూ ఈ అదనపు ఉద్యోగావకాశాలు వుండడంతోపాటు పూర్తి ఉపాధి సౌకర్యాలు లేనివారికికూడా చెప్పుకో దగిన సహాయం చేకూరవచ్చని ఆశించబడు తున్నది. అయితే ఈ విషయంలో సంఖ్యా వివరాలను పేర్కొనడం కష్టసాధ్యం. పైన తెలుసుకున్న సమాచారాన్నిబట్టి తృతీయ ప్రణాళికలో 250 లక్షల మందికి ఉద్యోగాలు అవసరంకాగా 140 లక్షలమందికి మాత్రమే ఉపాధి సౌకర్యాలు కల్పించ బడుతున్నట్లు విదిత మవుతున్నది. కొత్తగా వచ్చే ఉద్యోగార్థుల సంఖ్య సుమారు 170 లక్షలు వుండగా, నూతనంగా కల్పించే ఉద్యోగాల సంఖ్య 140 లక్షలు వుంటుంది. కాగా ప్రణాళికారంభంనాటికే నిరుద్యోగుల సంఖ్య 80 లక్షలు వుండనేవుంది. వీరి సంఖ్య నాలుగవ ప్రణాళికారంభంవరకు 110 లక్షలకు హెచ్చే అవకాశం వుంది. మూడు ప్రధాన మార్గాలద్వారా ఈ సమస్యను పరిష్కరించడానికి తలపెట్టబడింది. వీటిలో మొదటిది ప్రణాళికా పథకాల మేరకు ఉద్యోగావకాశాలు, మొదటికంటే విశాల ప్రాతిపదికపై హెచ్చుతగ్గులు లేకుండా సమానంగా ఏర్పడేట్లు చూడడం. రెండవది — గ్రామీణ పారిశ్రామికీ కరణకు బృహత్తర పథకాన్ని చేపట్టాలి. ప్రత్యేకించి గ్రామీణ విద్యుదీకరణ కార్యక్రమాలు, గ్రామీణ పారిశ్రామిక వాటికల అభివృద్ధి, గ్రామీణ పరిశ్రమలను పెంపొందించడం, మానవశక్తిని సద్వినియోగం చేయడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. మూడవది—చిన్నతరహా పరిశ్రమలలో అధికంగా ఉపాధి సౌకర్యం కల్గించడానికి తోడు దాదాపు 2.5 మిలియనుల మందికి సాధ్యమైతే అంతకన్నా ఎక్కువ మందికి సంవత్సరానికి సగటున 100రోజులు పని కల్పించడానికి కావలసిన గ్రామీణ పనుల కార్యక్రమాన్ని నిర్వహించడానికి ప్రతిపాదించారు. లక్ష్యాలు యీ విధంగా ఉండగా మూడవ ప్రణాళికా కాలంలో 14 మిలియనుల మందికి ఉపాధి కల్పించాలనే అసలు లక్ష్యానికి తక్కువగానే యీసౌకర్యం లభించవచ్చునని మధ్యంతరంగా జరిగిన మదింపువల్ల తెలిసింది. మూడవ ప్రణాళికా కాలంలో ఏర్పడే నిరుద్యోగుల సంఖ్య పెరుగుదలకు సమానంగా 17 మిలియనుల మందికి ఉపాధి సౌకర్యాలు కల్పించే లక్ష్యం ఉండగా దాదాపు 13 మిలియనుల మందికి మాత్రమే యీ సౌకర్యం లభిస్తుందని యిటీవల అంచనా వేశారని జాతీయ అభివృద్ధి మండలికి సమర్పించిన తమ నాల్గవ పంచవర్ష ప్రణాళిక మెమోరాండంలో ప్రణాళికా సంఘంవారు పేర్కొన్నారు. మూడవప్రణాళికాంతానికి మొత్తం దేశాల్లో 12 మిలియనుల మంది నిరుద్యోగులు ఉంటారని స్థూలంగా చెప్పవచ్చు.

ఇక ఆంధ్రప్రదేశ్‌లో యిటీవలి అంచనాల ప్రకారం మూడవ ప్రణాళిక ఆరంభంలో నిరుద్యోగుల సంఖ్య 3.75 లక్షలు ఉంటుంది. మూడవ ప్రణాళికా కాలంలో ఉపాధి సౌకర్యాలు కావలసిన వారి సంఖ్య 12.59 లక్షలకు ఉంటుందని అంచనా వేశారు. ఈ విధంగా మూడవ ప్రణాళిక ఆఖరువరకు అందరికీ ఉపాధిసౌకర్యాలు కల్పించడానికి 16.34 లక్షల ఉద్యోగాలు అవసర మవుతాయని అంచనా వేశారు. అయితే మూడవ ప్రణాళికా కాలంలో అదనంగా 10.79 లక్షల మందికి ఉద్యోగ సౌకర్యాలు కల్పించబడ వచ్చునని అంచనా. అందువల్ల నాల్గవ ప్రణాళిక ప్రారంభం వరకు రాష్ట్రంలో 5.55 లక్షల మంది నిరుద్యోగులు ఉంటారని అంచనా వేశారు. రెండవ ప్రణాళికా

కాలంలో దాదాపు రూ. 190కోట్ల పెట్టుబడి ఫలితంగా 5.84 మందికి ఉపాధిసౌకర్యం లభించగా మూడవ ప్రణాళికాకాలంలో రూ. 310 కోట్ల పెట్టుబడితో 10.79 లక్షల మందికి అదనంగా ఉపాధి సౌకర్యాలు కల్పించవచ్చునని ఆశించబడుతున్నది. ఈ విధంగా ఉద్యోగసౌకర్యాలు కల్గించడానికి సంబంధించినంత వరకు మూడవ ప్రణాళిక కొంతవరకు విజయవంతమయింది. ప్రస్తుత ప్రణాళిక మూడు, నాలుగు సంవత్సరాలలో రాష్ట్రంలో పరిశ్రమలను అధికంగా నెలకొల్పుతున్న దృష్ట్యా యీ రాష్ట్రానికి సంబంధించినంతవరకు ఉపాధి సౌకర్యాలను కల్పించే లక్ష్యాలను అధిగమించవచ్చు ననడంలో అసత్య మేమీ లేదు. భారీ విద్యుత్పరికరాల పరిశ్రమ, సింథెటిక్ ఔషధాల ఫ్యాక్టరీ, హైదరాబాదు విశాఖపట్నంల పరిసర ప్రాంతాలలో పరిశ్రమల పెంపుదల, విశాఖపట్నంజిల్లాలో డి. బి. కె. రైల్వేల పనులు, మొదలైన వీటన్నిటి ఫలితంగా ఉపాధి సౌకర్యానికి సంబంధించినంతవరకు మన లక్ష్యాలను అధిగమిస్తా మనే భావం బలపడ్తుంది. ముందే అంచనావేయడం క్లిష్టమైనప్పటికీ, నాల్గవ ప్రణాళిక అమలు ప్రారంభంనాటికి యీ రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్యను దాదాపు 3-4 లక్షలకు తగ్గించవచ్చునని ఆశించబడుతున్నది.

ప్రస్తుత పరిస్థితులదృష్ట్యా నాల్గవ ప్రణాళిక దృక్పథం ప్రోత్సాహకరంగానే ఉంటుందని భావించబడుతున్నది. యీ రాష్ట్రంలో ఒకటి రెండు ప్రత్యేక అంశాలు పేర్కొనదగినవి ఉన్నాయి. మన రాష్ట్రంలో జనాభా పెరుగుదల నిష్పత్తి దేశజనాభా పెరుగుదల నిష్పత్తి కన్నా తక్కువగా ఉంది. నాల్గవ ప్రణాళికాకాలంలో యింతవరకూ చెప్పుకోదగిన పెట్టుబడిధనం పెట్టబడిన మన ప్రాజెక్టులు పూర్తి అయ్యి ఫలితాలను అందజేసి తద్వారా పెద్దసంఖ్యలో ఉపాధి సౌకర్యాలను కలుగజేస్తాయి. చాలాకాలం నుంచి నిర్మాణంలోవున్న నాగార్జున సాగర్ వంటి బృహత్తర ప్రాజెక్టులలో కొంతభాగం పూర్తి అయ్యి నీటిపారుదల సౌకర్యాలను లభింపజేస్తాయి. భవిష్యత్తులో నిర్మింపబడే ఉక్కు-ఫ్యాక్టరీద్వారా కూడా ఉపాధి సౌకర్యాలు మరింతగా మెరుగుపడే అవకాశం ఉంది. మొత్తంమీద యీ రాష్ట్రంలో ఉపాధి కల్పనకు సంబంధించినంతవరకు పరిస్థితి నిరుత్సాహకరంగా యేమీలేదు.

సాధారణ పరిస్థితి మెరుగుగా ఉన్నప్పటికీ, విద్యాధికుల నిరుద్యోగ పరిస్థితి కొంతవరకు ఆందోళనకరంగా ఉంది. ఉపాధి కల్పన కేంద్రాలలోని గత ఆరు సంవత్సరాల నమోదు రిజిష్టర్లను పరిశీలిస్తే యితర వర్గాలకన్నా విద్యాధికులైన దరఖాస్తుదారుల సంఖ్య పెరుగుదల యథావిధిగానే కొనసాగుతున్నట్టు విశద మవుతుంది. విద్యార్జన, శిక్షణకు వినియోగమైన కాలం, డబ్బుఖర్చు దృష్ట్యా యీ పరిస్థితి వాస్తవంగా చాలా తీవ్రమైనది. వారి అభిప్రాయాలను మార్చుకుని ఫలప్రదమైన ఉపాధిని చేపట్టడానికి వీలుగా విస్తృత ప్రాతిపదికపై వృత్తి విద్యా శిక్షణ కార్యక్రమాలను అమలు జరపడానికి చర్యలు తీసుకుంటున్నారు. మారుతున్న పారిశ్రామిక కార్మిక పరిస్థితులకు తగినట్టుగా వ్యవహరించడానికి వీలుగా వివిధ సాంకేతిక వ్యాపారాలలో శిక్షణ, అప్రెంటిస్‌షిప్పు సౌకర్యాలను విస్తరింప జేయడానికి కూడా చర్యలు తీసుకుంటున్నారు.

వినియోగించిన మొత్తం పెట్టుబడి ఫలితంగా కలిగిన ఉపాధి సౌకర్యాలను వర్గీకరించడం సాధ్యం కాకపోయినప్పటికీ గతంలో జరిగిన ఆర్థికప్రగతి కార్యక్రమాల వల్ల భవిష్యత్తులో ఆశాజనకమైన ఫలితాలు కలుగుతాయని చెప్పవచ్చు. పారిశ్రామికాభివృద్ధికూడా అతి ముఖ్యమైన విషయం. ఉదాహరణకు యిప్పుడు పెద్దఎత్తున అమలు జరిగే వ్యవసాయాభివృద్ధి పథకాలు, చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి ఫలితంగా మొత్తం దేశంలో అంచనాకు మించిన సంఖ్యలో ఉపాధిసౌకర్యాలు కలిగే అవకాశం ఉంది. వ్యవసాయ ఉత్పత్తులను ఎక్కువ చేయడానికి పెద్దఎత్తున అమలుజరిపే కార్యక్రమాలవల్ల చిన్నతరహా పరిశ్రమలస్థాపన వల్ల ఏర్పడే ఉపాధి సౌకర్యాలను యీ దశలో అంచనా వేయడం కష్టమవుతుంది. గతంలో మొత్తం దేశంలో ఉపాధి సౌకర్యాల లక్ష్యాలను సాధించడం జరగనప్పటికీ భవిష్యత్తు అంత నిరాశాజనకంగా యేమీ లేదు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంత వరకు గతంలో మనం బాగానే కృషి చేశాము — విద్యాధికుల నిరుద్యోగ సమస్యపై ప్రత్యేకశ్రద్ధ వహించాల్సి ఉన్నప్పటికీ భవిష్యత్తులో కూడా యీ కృషిని యీ విధంగానే కొనసాగించడం జరుగుతుంది. రాష్ట్రంలో జరుగుతున్న పారిశ్రామికాభివృద్ధి ప్రగతి ఫలితంగా పరిస్థితి మరింత మెరుగు పడవచ్చు.

మహాశివరాత్రి

ఈమని వేంకటకృష్ణశర్మ

క॥ శ్రీ కారుణ్యాంబుధిని । న్మాకాంతాధిపసుసేవ్యు భావభవారిన్
కాకోదర సద్భూషు । న్నాకాధిపవంద్యు నభవు నవ్యయు నజితున్.

ఉ॥ అంతక గర్వవారిద మహాబలునిం గమనీయపార్వతీ
కాంత మనోజ్ఞభృంగుని విఖండిత వారిజగర్భు మస్తకున్
చింతిత భక్తకోటి సరసీరుహ హృత్సుఖసంస్థితుం గుహా
భ్యంతరవాసు నీశ్వరుని ఫాలవిలోచనుఁ జన్మయు న్విభున్ —

శా॥ పారావార గభీరు నింద్రజనుతుం బాపాగ్ని శుద్ధోదకం
బై రాజిల్లెడు శర్వునిం ద్రిణయనుం బర్వేందు సన్మంగళున్
భూరిప్రాభవ మంత్రసంయుతుని శంభు న్నాగచర్మున్ శివున్
నారీలోలుని నిత్యునిం బురహరున్ నాగేంద్ర మోక్షప్రదున్.

మ॥ సమదానేకపగామినిన్ శశిముఖిన్ చంద్రార్ధ ధృద్దేవినిన్
కమలాక్షిన్ నవపల్లవాంఘ్రియుగళన్ గంభీర పంచాస్య స
ద్గమనం బర్వతరాజపుత్రి నుమ దుర్గ న్కాళిక న్పార్వతీ
రమణి న్చండిం దుష్టహారిణి సదార్య న్భక్తసంలక్షణిన్ —

చ॥ ఘనమగు మంత్ర తంత్రములుఁ గమ్మనిపాటలు భూసురుల్సతుల్
వినయముమీఱఁ జెప్పగను వీనులవిందుగఁ బాడుచుండగన్
కనిగిరి దుర్గసంస్థితుని ఖర్వపుదేవిని ముత్ప్రయాసతన్
కని 'శివరాత్రి' పర్వదినకాలము నంతయు వ్యర్థపుచ్చకన్.

తే॥ వివిధ భగవత్కథలతోడ వేడ్కఁ జెంది । జాగరంబును చేసితి సగముప్రొద్దు
రాజితంబుగ సకల పురప్రజలకు । గుహాజనకు డిచ్చు రక్షను నహరహంబు.

మాళవికాగ్ని మిత్రము - విద్యాపద్ధతి

అయ్యగారి నరసింహమూర్తి

మానవునకు మానసిక వికాసముతోఁ బాటు వినయ సౌశీల్యాది సుగుణ సంపత్తియు కార్యాకార్య విచక్షణాజ్ఞానమును నొసగునది విద్య యనఁబడును. ప్రాచీన కాలమున కంటె నవీన కాలమున విద్యను నేర్చుట కనేక విధములగు సౌకర్యములు కల్పింపబడినవి. జనాభా లెక్కలను బట్టి చూచిన స్వాతంత్ర్యమునకు ముందుకంటె నేడక్షరాస్యు లెక్కువగా కనబడుచున్నారు. కాని ప్రజల కక్షరజ్ఞాన మలవడుచున్న కొలఁది యవినీతి, యక్రమ ప్రవర్తనలు దినదిన ప్రవర్ధమానము లగుచున్నవి. కారణము నేటి మానవుడు మానసిక వికాసమునకు తగు రీతిని విద్య నభ్యసింపకుండ మార్కుల సంపాదనమే ప్రధాన లక్ష్యముగా గ్రహించుట. నేటి మానవు డొకదశ వఱకును జదువుకొనియు, తా నేర్చిన విద్యను తన కనుకూలముగా జీవితమున కక్కరకు వచ్చునటుల నుపయోగించుటను నేర్వలేకున్నాడు. మీదుమిక్కిలి తానింత వఱకు వేలు తగులబెట్టి నేర్చిన విద్య యెందులకు పనికివచ్చుట లేదని కుందుచు తన యదృష్ట మింతియేయని డిందు పడుచున్నాడు. చదువు ముగిసిన వెంటనే నూట యేబది, లేక రెండువందల రూప్యములకుఁ దక్కువగాని వృత్తిలోఁ జేరగల్గుట — తన కా పనియందు శక్త్యాసక్తు లున్నను లేకున్నను, పనిచేసినను చేయకున్నను మొదటి తేదీనాటికి మొత్తమును చేతికి అందుకొనగల్గుటయే విద్యాఫలమని భ్రాంతిపడుచున్నాడు. నేటి విద్యార్థి రెండు మూడు భాషలతో బాటు మూడు శాస్త్రములను నేర్చియు తా నేర్చిన విద్య నే విధముగా నుపయోగించిన లేక తా నేర్చిన విద్యచే నెట్టి కార్యములను చేసి ధనార్జన చేయగల నను చింత ఇసుమంతయైనను లేక ఊరక తన చదువును, అటు సర్వులను కసితీర రేయింబవళ్లు తిట్టుకొనుచు మానసిక శాంతిని పోగొట్టుకొనుచు, అమూల్యమగు కాలమును, ఆత్మజ్యోతిని ప్రకాశింపఁజేయు విద్యను వ్యర్థము చేసికొనుచున్నాడు. దీనికి కారణము విద్యార్థిలో మానసిక వికాసము కలుగకుండుటయే.

పూర్వకాలమున భారతదేశమున వృత్తులనుబట్టి వర్ణ వ్యవస్థ యేర్పడినది. ఒక్కొక్క కులమువా రొక్కొక్క విద్యను కాపాడి పోషించుచువచ్చిరి. ఆకారణముగ నీ విద్యలను "కుల విద్య" లనియు, వేఱు వేఱు వృత్తులకు సంబంధించిన వగుటచేత "వృత్తి విద్య" లనియు వ్యవహరింపబడినవి. ఆ వృత్తి విద్యలనే మనము నేడు సాంకేతికవిద్య లని (Technical education) వ్యవహరించుచున్నాము. నేటివలె వృత్తి విద్యల కానాడు పాఠశాలలుగాని, కళాశాలలుగాని లేవు. వృత్తివిద్యలయందారితేరిన వృద్ధులు వారి కర్మశాలలయందే వారివారి కులములందలి బాలకులకు విద్యాప్రదానము చేసెడివారు. మఱియు వంశక్రమానుగతమగు వృత్తి యగుటచే నందలి సులువులు—బలువులు, మెలఁకువలు కొన్ని ఆ కులమువారికి అప్రయత్నముగనే యలవడుచుండెడివి. కులవిద్య వదలి యన్యవిద్యాగ్రహణము కులద్రోహముగాఁ బరిగణింపఁబడుచు వచ్చెడిది. స్వధర్మము శ్రేయోదాయకమని, పరధర్మము భీతావహము, అనాచరణయోగ్యము అను విశ్వాస ముండినది. "వెలివిద్య లెన్నియైనను కులవిద్యకు సాటిరావు కుంభినిలో నన్" అను సూక్తులు పుట్టినవి.

ఆయా కులములవారికి వారి వృత్తివిద్యలయం దెక్కువ యాదరాభిమానము లుండెడివి. ఎల్లవృత్తులవారును తమ తమ వంశములతోఁబాటు తమ వృత్తులనుగూడ పైకి దీసికొని రావలెననెడి తహతహ, ఆకాంక్ష మెండుగ నుండెడివి. ఈ విషయమునే "మాళవికాగ్ని మిత్రమున" గణదాసుఁడు తెలిపినాడు. "కామం ఖలు సర్వస్యాపి కుల విద్యా బహుమతా" (ఎవని కులవిద్యయందు వాని కభిమానము మెండుగదా) "నాది" యనునపుడుండు ఆకాంక్ష, ప్రేమ, వల్లమాలిన యభిమానము వేఱొకతఱి కానరావు.

ప్రతి మానవునకు చతుష్షష్టి కళలలో నేదియో యొకదానియం దాసక్తి యుండితీరును. ఆ వ్యక్తుల యభిరుచులను తల్లిదండ్రులుగాని, గురువులుగాని గుర్తెరింగి వారిని సుశిక్షితులై బోధనాపటిమగల గురువులకడ నుంచినచో "సూర్యుఁడు — సూర్యకాంతమణివలె నిరువురు ప్రకాశితు లగుదురు. ఈ విషయముననే మాళవికాగ్ని

మిత్రమున గణదాసుడు మాళవికనుగూర్చి యిట్లనుచున్నాడు. "పాత్ర విశేషేన్యస్తం గుణాంతరం వ్రజతి శిల్పమాధాతుః''. అది యెట్లు "జలవివసముద్ర శుక్తౌ ముక్తాఫలతాం పయోదస్య" యను రీతిగా. దీనినే భర్తృహరి "స్వాత్యాం సాగరశుక్తి మధ్య పతితం సన్మౌక్తికం జాయతే" అని చెప్పినాడు. కనుక వ్యక్తి యభిలాష ననుసరించి చక్కగా విషయమును సుబోధ మొనర్పగల గురువు లుండవలెను.

"దృశ్యంతమసి నపశ్యతి దీపేన వినాసా చక్షురపి" (1-9) చీఁకటియందు వస్తువులను దీపములేనిదే కన్ను లున్నను గాంచలేని యట్లు చదివిన విద్యను సక్రమముగా వినియోగింపనేర్వనిచో నా విద్యయు వ్యర్థమే.

పూర్వపు విద్యాభ్యాసకులకు విజ్ఞానము సంపాదింపవలె ననెడి జిజ్ఞాస యెక్కువగా నుండినది. ప్రస్తుతము విద్యయొక్క పరమార్థము చాలబాగము మారిపోయినది. ధనసంపాదనమే నేటివిద్య పరమార్థమైనది.

పూర్వము విద్యార్జన చేయువారు తాము పేరుతెచ్చుకొనుటయే గాక తాము 'ఫలానా' గురువుకడ విద్య నేర్చి యింతవార మైతిమని సగర్వముగా చెప్పుకొనెడివారు. నేఁ డట్లు చెప్పుకొనుట సకృత్తు. పూర్వకాలమున నిట్లుండిరనుటకు "దేవ శ్రూయతామ్ మయా సుతీర్థాత్ అభినయ విద్యా శిక్షితా। దత్త ప్రయోగశ్చాస్మి। దేవేన దేవ్యాచ పరిగృహీతః" (ప్రథమాంకమ్).

ప్రస్తుతముకూడ ఆయా విద్యలలో నారితేరి బోధనాపటిమ గలవారున్నారు గాని అట్టివారి శక్తిని గుర్తించి ఆదరించు మేధావులుమాత్రము దుర్లభులు.

ఒక విద్యావంతుని శక్తిసామర్థ్యములను బరీక్షించుటకు కూడ సమర్థులైన, పక్షపాత రహితులైన వారుండినపుడే వారి ప్రజ్ఞా విశేషములు వెల్లడి యగుటకు, రాణించుటకు వీలగును. ఈ విషయమువలనే కాళిదాసు పరివ్రాజక ముఖమునఁ బలికించినాడు. "మాళవికాగ్నిమిత్రము"న హరిదత్త గణదాసులకు విద్యా విషయమైన వివాదము కలిగినపుడు దండెవరధికులో నిర్ణయించుటకు రాజు పరివ్రాజకను కోరగా ఆమె "అలం ఉపాలంభేన పత్తనే విద్యామానేఽపి గ్రామే రత్నపరీక్షా" అని ప్రత్యుత్తర మిచ్చినది. మఱియు విద్యావంతుని శక్తి సామర్థ్యముల నొకఁడు పరీక్షించుటయు సరిగాదు. పరీక్షాధికారి యెంతటి విజ్ఞానసముపేతుఁడైనను ఒకడు చేయు నిర్ణయములో దోష ముండునని కూడ పరివ్రాజక ముఖముననే పలికించినాడు. "సర్వజ్ఞస్యా ప్యేకాకినో నిర్ణయాభ్యుపగమో దోషాయ". సమవిద్య గలవారి మధ్యయశః స్పర్థ యుండుట సహజము. 'స్పర్థయా వర్థతే విద్యా' యనునట్లు ఆయా విద్యలు బాగుగా నభివృద్ధి పొందుటకు వీలగును. "ప్రాయం సమాన విద్యా పరస్పర యశః పురోభాగః."

అట్లు విద్యలో నిరువురు సమానముగా నున్నపు డెవరి నెన్నికచేయవలయుననగా "వయోవృద్ధులకుఁ బ్రాధాన్య మీయవలె"నని చెప్పుచున్నాడు. "నను సమానేఽపిజ్ఞాన వృద్ధభావే వయోవృద్ధత్వాత్ గణదాసః పురస్కార మర్హతి" (ద్వితీయాంకమ్).

పలువురను పరీక్షకు (Interview) పిలచినపుడు ఒకరిద్దఱను పరీక్షించి పక్షపాతముచేతనో గౌరవముచేతవో అభిమానముచేతనో దానిని వారి కంటకట్టరాదు. ఎదిరి గుణములను గూడ తెలిసికొని యుక్తముగా నాలోచించి బహూకరింప వలెను. "తిష్ఠ। తిష్ఠ। గుణాంతర మజానన్ కిమితిత్వ మాభరణందదాసి".

వ్యక్తిలో విద్య యేయే రీతుల ప్రకాశించునో ఎట్టివాడు గురువగుట కర్హుడో పరివ్రాజకముఖమున కాళిదాసుడు నుడువుచున్నాడు. "శ్లిష్టా క్రియా కస్యచిదాత్మ సంస్థా సంక్రాంతి రన్యస్య విశేషయుక్తా। యస్యోభయం సాధుసశిక్షకాణంధురి ప్రతిష్ఠాపయితవ్యఏవ॥" కొందరు తాము నేర్చిన విద్యను తమయందే ప్రకాశింప జేసుకొందురు. మరి కొందరు తామునేర్చిన విద్యను శిష్యులకు బోధించి ప్రకాశింప జేసికొందురు. ఇట్లుభయ మెవరియందు ప్రకాశించునో వారినే గురువులకు గురువుగా నిలుపవలెను. వారినే సద్గురువులని చెప్పవలెను.

ఒక ముఖ్యవిషయము:— అందరు చదువుకొన్నవారే యైనను వారందరు గురువులుగా నియమింపఁ బడుట కర్హులుగారు. ఎందులకన సుశిక్షితులైనంత మాత్రమున వారందరు బోధనా విషయమున సమర్థులుగారు. ''సుశిక్షితోఽపి సర్వ ఉపదేశ దర్శనేన నిపుణోభవతి" నేటి విద్యార్థుల విద్యాప్రమాణములు హీనస్థితిలో నుండుటకు ఇది యొక ముఖ్య కారణము. అనఁగా నుపాధ్యాయులలోఁ బెక్కుమందికి బోధనాపాటవము కొఱవడియుండుటయే.

నేఁ డధ్యాపకులుగా పనిచేయువారు కొందఱిలో (ఉత్తమ శ్రేణులయం దుత్తీర్ణులయ్యు) బోధనాశక్తి కొఱవడియుండుట సర్వసాధారణముగా నందరును గమనించుచునే యున్నారు. అట్టి యుపాధ్యాయులకడ చదువుకొను విద్యార్థుల కాయా విషయములందభిరుచి క్షీణించి యేదియో యొక రకముగా "ఠః పరీక్షా గండము" దాటి బయటపడిన అదియే పదివేలని విద్యార్థు లెంతురు. విద్యార్థి కొక విషయము (Subject)లో ఆసక్తిగాని, ప్రవేశముగాని లేకున్నను ఉపాధ్యాయుని ఉపన్యాసము

వలన విద్యార్థిలో విషయమును క్షుణ్ణముగా నేర్పవలెననెడి కుతూహలము కలుగఁజేయు నుపాధ్యాయు లుండవలెను. విద్యార్థుల విద్యా ప్రమాణము పెరుగుటకు ప్రథమ సోపానము బోధనాశక్తిగల యుపాధ్యాయులను పక్షపాత రహితముగా నెన్నికచేయు విధానమును అమలుజరుపవలెను.

కొందఱు తమకు బోధనాపటిమ లేదని గుర్తెఱిగియు, వేఱొక చోటునకు పోయిన తాము పైకి రాలేమని యెంచియో, లేక ఈ ఉపాధిలోగల లాభముల నాశించియో తిరుగటిరాయివలె నందే యుండి యటు తామభివృద్ధి చెందక ఇటు విద్యార్థులయందు పురోభివృద్ధిని చూపింపలేక యిరువురా-చెడుచున్నారు. జ్ఞానము సంపాదించిన యుపాధ్యాయులు అజ్ఞానులవలె వందల కొలది విద్యార్థుల జీవితములను నాశనము చేయుచున్నారు. ఇట్టి యుపాధ్యాయులు నేడు లెక్కకు మిక్కిలి యనిన ఆగ్రహముగాని, ఆశ్చర్యముగాని చెందవలసిన పనిలేదు. ఉపాధ్యాయవృత్తిలో నున్న ఒకవ్యక్తి తన శక్తి సామర్థ్యములను, తానెంతవఱకు విద్యార్థులకు న్యాయము చేకూర్చుచున్నదియు గుర్తెఱింగియు, తమ పిల్లలకు చదువు చెప్పు నుపాధ్యాయులను గూర్చి ఆ సంస్థలలో పనిచేయువారేమియు పిల్లలకు బోధింపరనియు, వారికేమియు రాదనియు విద్యా ప్రమాణములు పడిపోవుటకు, చదువునందు విద్యార్థి కాసక్తి నశించిపోవుటకు వీరే కారకులనియు వారిని మహాపండితులు విమర్శింతురు. "గురివిందగింజ తన నలుపు నెఱుంగఁజాలదుగదా!" ఉపాధ్యాయులకు చదువుచున్న పిల్లలన్న పెక్కురు పైపాతమునేచెప్పుదురు. ఉపాధ్యాయులే యిటు లన్న పైవారు ఉపాధ్యాయులను గూర్చి చెప్పిన వింత పడవలసిన పనిలేదు. కనుక ఉపాధ్యాయుల నెన్నికచేయునపుడు వారిచే ముందుగా వారు చెప్పెడి విషయాలపై నాలుగైదుపన్యాసముల నిప్పించి దానినుండి వారి యోగ్యతను గుర్తించి పదవిని స్వీకరింపఁజేయవలయును గాని కేవలము 'పట్టా' (Degree) బట్టి పదవిని పట్టముగట్టరాదు.

ఇఁక గురుశిష్యులనుగూర్చి విపులముగాఁ జెప్పుచున్నాడు.

గురువునొద్ద చేరిన శిష్యులు మందమతులై యుపదేశములను బాడొనరించిన ఆ దోషము గురువులదా! యను ప్రశ్నకు సమాధానముగా నగ్నిమిత్రునిచే "అట్టి మందమతులను స్వీకరించుటలోనే గురువుల తెలివితేటలు వెల్లడియగు నని పలికించినాడు. "దేవీ! ఏవమాపాద్యతే! వినేతుర ద్రవ్యపరిగ్రహోఽపి బుద్ధిలాఘవం ప్రకాశయతి" (అట్టి మందమతులను స్వీకరించుటలోనే గురువున కింకను తెలివితేటలు కావలె నని తెలియనగును). ఒక వ్యక్తికొక విషయముపై అభిలాష లేకపోవుటకు కారణమాతని మానసికప్రవృత్తియైనను కావచ్చును లేక గురువుల బోధనా విషయమైన లోపమైనను కావచ్చును.

కొన్ని విద్యాసంస్థలు కేవలము తెలివిగల విద్యార్థులను మాత్రమే చేర్చుకొనుచు తాము సక్రమమైన మార్గములో క్రమశిక్షణాయుతముగా చక్కని యుపాధ్యాయులచే నుత్తమమైన శిక్షణ నిప్పించి మంచి 'మార్కు-లతో ఉత్తీర్ణు లగునట్లు చేయుచున్నామని చెప్పుదురు. మాళవికాగ్నిమిత్రమున చెప్పినట్లు ఆయా విద్యాసంస్థలలో పనిచేయు నధ్యాపకుల కందఱకు ధీశక్తి, బోధనా పటిమలు కలిగినవారైనచో పాఠశాలా కళాశాలల నిర్వాహకులు 'ఏవరేజి మార్కులు' గల విద్యార్థులను చేర్చుకొనక పొమ్మందురెందువలననో తెలియదు. మంచిమార్కులు గల విద్యార్థులకే యావిద్యాసంస్థలలో 'సీటు' లభ్యమగునను విషయము, కేవలము తెలివిగల్గిన విద్యార్థులను మాత్రమే చేర్చుకొనుట మూలమున ఆ విద్యా సంస్థలకు పేరువచ్చుచున్నదని తెలిసియు అట్టి విద్యార్థులు గల సంస్థలకు పేరు వచ్చుట సర్వసాధారణము, ఆశ్చర్యకర విషయమని గుర్తెఱుంగక జ్ఞానియు నజ్ఞానియు వారి కృషిని (సంస్థావ్యవహర్తల) పలు తెఱంగుల ప్రశంసించుచు 'ఈగలవలె సీట్ల' కొఱకు కెగబడుదురు. పేరువడిన సంస్థలలోఁ గల నిబంధనావళిని విద్యాసంస్థలలోఁ గూడ ప్రవేశపెట్టిన అన్ని సంస్థ లదేస్థాయిలో నుండగలవని గుర్తెఱుంగని యజ్ఞానులు నేటివిద్యావేత్తలు పేరుపడిన సంస్థలలో ఎక్కువభాగము 'average students' ను చేర్చుకొనవలె ననెడి నిబంధన ముంచినచో వారి కీర్తి ప్రతిష్ఠలు కూలంకషముగ అచిరకాలములోనే యందఱకు నెఱుక పడగలవు. పేరుపడిన విద్యా సంస్థలలోకూడా Tution వ్యాపార మధికముగా నుండుట కొందరైనను గుర్తించి యుండకపోరు. అట్టిచోట్ల Tution వర్తక మధికమగుట యనిన క్లాసులో ఉపాధ్యాయు లెంత బాగుగా చెప్పుచున్నారోయూహించు కొనగలరుకూడ.

విద్యార్థి యెంత మందమతియైనను పూవులతోఁ గూడిన దారమురీతి సజ్జనుల సాంగత్యమున ధీప్రకాశమునందును. "మన్దోప్యమన్దతా మేతి సంసర్గేణ విపశ్చితః॥ ఎట్లన పంకచ్ఛిదః ఫలస్యేవని కర్షేణా విలంపయః" (ఇండుపకాయ గంధముచే బురదనీరు తేటయైన రీతిగా).

ఇఁక యథార్థముగా పాండిత్యము, బోధనా సామర్థ్యముగల గురువులనుగూర్చి-ఎవడు కొత్తకీర్తిని గడించి భుక్తికి గడించుచు విద్యావ్యాసంగములలో పాల్గొనక

పరు లేమనుకొన్నను తమ కీర్తిప్రతిష్ఠలకు భంగము రాదని యోచించుకొనునో యట్టి వాని విద్య కేవలము భుక్తికొరకు మాత్రమే యని – అతడు విద్య నమ్ము వర్తకుడని కాళిదాసు మాళవికాగ్నిమిత్రమునఁ బల్కినాడు.

"లబ్ధాస్పదోఽస్మీతి వివాద భీరో స్తితిక్షమాణస్యపరేణ నిన్దామ్ యస్యాగమః కేవల జీవికాయై తం జ్ఞానపణ్యం వణిజం వదంతి" (1-17) ఇట్టి వర్తకు లీ రోజులలో కోకొల్లలు. విద్యాప్రమాణములు పెరుగవలెనన్నచో నిట్టివ్యాపారము సంపూర్తిగా నరికట్టవలెను. ఇట్టి వ్యాపారములే నేడు విద్యాసంస్థలలో అక్రమవర్తనకుఁ దోడ్పడుచున్నవి. ఇట్టి వ్యాపారమువలన ఉపాధ్యాయుల నిర్లక్ష్యముచే నిర్ధను లగు తెలివిగల విద్యార్థులు కొందఱు చెడిపోవుచున్నారు.

గురువులు శిష్యులను తమ బిడ్డలుగా భావించి ("గురువులకు శిష్యులు పుత్రులు..." మహాభారతము) వారి భావిని గూర్చి 'గురువులే నిష్పక్షపాతముగా నొక మార్గమును జూపవలెను. శిష్యుల యోగక్షేమముల నరయు కార్యము గురువులదే, యని మాళవికాగ్నిమిత్రమున ధారణిపలుకు.

కవికుల చంద్రుఁడగు కాళిదాసుచే కీర్తింపఁబడిన మహాకవి భాసుఁడు తన 'పంచరాత్రము'న "శిష్య పాపం గురోరపి" అని చెప్పినాడు. ద్వాదశవర్షప్రాయుఁడగు వఱకు పిల్లవాని మంచి చెడ్డల నారయుట తలిదండ్రుల విధియని ఆపై తల్లిదండ్రులు తమ పుత్రులను యోగ్యుఁడైన గురువుల కప్పగించినపుడు వారు చెడి రన్నచో ఆ పాపము ఆ తల్లిదండ్రులని మాత్రము కాదని తెలిపినాడు.

శ్రీరామచంద్రుని కీర్తిచంద్రికవలె ఉత్తరరామచరిత రచనే తన కీర్తిచంద్రికలను నలుదెసల వ్యాపింపచేసిన మహాకవి భవభూతి తద్గ్రంథమున ఎల్లరు విద్య నేర్పుట కర్హులు కారని యీ క్రింది శ్లోకమున సూచించినాడు.

"వితరతి గురుః ప్రాజ్ఞే విద్యాం
యథైవచ తథాజడే।
నచఖలు తయోఃజ్ఞానేశక్తిం
కరో త్యపహన్తినా
భవతిచ పునర్భూయాన్ భేదః
ఫలం ప్రతితద్యథా।
ప్రభవతి శుచిర్బింబగ్రాహే
మణిర్న మృదాంచయః॥

పై విషయములనుబట్టి తేలిన యంశములు: పిల్లవాని కభిరుచియైన విషయమును గమనించి ఆ విషయమును చక్కఁగా బోధింపఁగల గురువుల కడకు పంపవలెను. గురువుల నెన్నిక చేయునపుడు బోధనాసామర్థ్య మున్నచో వానిని గురువుగా నెన్నుకొనవలెనుగాని కేవల మర్హతా పత్రమును జూచి పదవి స్వీకరింపఁజేయరాదు. ఎందులకన చదువుకున్నవారందఱకును బోధనాసామర్థ్య ముండుట దుర్లభము. బోధనాశక్తిలేని యుపాధ్యాయులు తాము చెడినను చెడకున్నను చేజేతుల వారు ప్రతి సంవత్సరము వందల వేలకొలది విద్యార్థుల జీవితములను నాశనము చేయుదురు (చున్నారు కూడ). "ట్యూషన్ల" పేర జరుగు వర్తకమును సంపూర్ణముగా నరికట్టి విద్యార్థులకు కలుగు సందేహములను చక్కఁగా తీర్చవలెను గాని "కసిరికొట్టి" కూర్చొనబెట్టుట మహాపరాధమను తలంపు ఉపాధ్యాయులకు కలుగవలయును. ప్రస్తుత విద్య దృష్ట్యా విద్యాప్రమాణములు పెరుగవలెనన్న ఈ అంశములు తప్పక పాటింపఁదగినవి.

కథానిక :

యోగ్యతా పత్రాలు



సత్యనారాయణ అతని యిల్లాలు చాలా ఉదార స్వభావులు. ఎవరన్నా కష్టాల్లో సతమతమౌతూంటే చూచి వీరి నవనీతం లాంటి హృదయాలు కరిగి వెనువెంటనే తగిన సేవాసద్భావ కార్యక్రమాలకు ఆటపట్టు ఔతూండేవి. ఏవ రెట్టి బాధల్లోఉన్నా చేత నైనంతసాయం చేస్తేనేగాని ఆ దంపతులకు ఆత్మశాంతి చేకూరేదిగాదు. తమ కెంతో అవసరమున్నా మానుకొనిఐనా యితరులకు ద్రవ్యసహాయంచేస్తూండేవారు. ఈ దంపతుల ఉదారబుద్ధికి వారి స్నేహితులు బంధువులు వారిని చాలా ప్రశంసిస్తూ ఉండేవారు.

"ఉండేదికాస్తా దానధర్మాలు చేస్తూ కూచుంటే కొండలైనా తరుగక మానవు. తుదకు వృద్ధాప్యంలో మీ కెవ్వరు తోడ్పడ తారు. డబ్బును దానధర్మాల కట్టే ఖర్చుపెట్ట కండి" అని హితులు వారికి సలహా యిస్తూ ఉండేవారు.

మధురాంతకం దొరస్వామి

"ఉన్నభూముల్లో వచ్చేకాస్తా ఆదాయం తమలాంటి పుత్రహీనులగు దంపతులకు చాలుననీ బీదవారికిచ్చిన ఎట్టినియేగానీ దేవునికై మనము ఖర్చుచేసినట్లేనని అట్లాంటి గడ్డురోజులు దాపరించిన ఆ రామచంద్ర మూర్తే మన బాకీలు చెల్లించి కష్టాలు గడపి కాపాడుతాడనీ మానవసేవే మాధవసేవ." అని వేదాంతాన్నంతా వల్లిస్తూండేవాడు సత్యనారాయణ.

వయసు మీరినకొద్దీ అవయవ పటుత్వం తగ్గుతున్న సత్యనారాయణ పొలాలనైనా అజమాయిషీ చేసుకొనే శక్తిలో లేక పోయాడు. రాసురానూ వర్షములు వెనుకపట్టి పంట తగ్గడంతో సత్యనారాయణ ఆదాయం

క్షీణింప వొడగింది. జీవనం జరగడం మహా కష్టంగా పరిణమించింది. గడ్డు రోజులు రానేవచ్చాయి. రోజురోజుకూ విపరీతముగా ధరలు పెరిగాయి. తమ నిత్య జీవితావసర వస్తువులకు మునుపటికంటే యెక్కువ సొమ్ము ఖర్చుచేయవలసి వచ్చింది. గత్యంతరం లేకపోవడంచేత వెంటనే సుబ్బయ్యగారికి వేయిరూపాయలకు తనయింటిని, భూములను అడమానముంచి తన నిత్యజీవితావసరాలకు ఆ ధనం ఖర్చుపెట్టుకొన్నాడు సత్యనారాయణ. ప్రతియేటా వడ్డీమాత్రము తప్పనిసరిగా వెంకటసుబ్బయ్యకు చెల్లించేవాడు. యోగ్యుడైన వెంకటసుబ్బయ్యకూడా దాంతో తృప్తిపడేవాడు.

కాలమనే ఖిల్లుడు వెంకటసుబ్బయ్యను తనలో లీనంచేసుకున్నాడు. ప్రస్తుతం వెంకటసుబ్బయ్య ఆస్తికి అతని ఏకైక పుత్రుడు వారసుడయ్యాడు. ఇతడు తన తండ్రిలాంటి ఉదారస్వభావుడు కాదు. తాను పెత్తనమునకు వచ్చిన కొద్దిరోజుల్లోనే సత్యనారాయణకు ఫలానా తేదీలోపల పైకం వేయిరూపాయలు చెల్లించనంతట అడమానంలో కనినమేరకు, ఇల్లు, భూమి, అంతా తన స్వాధీనం చేసుకొంటానంటూ నోటీసు జారిచేసాడు.

సత్యనారాయణ నోటీసు అందుకొన్నాను. వెంకటసుబ్బయ్యగారిగృహం ఆ గ్రామానికి వందమైళ్ళలో ఉంది. నేరుగా వెంకటసుబ్బయ్యగారి పుత్రునితో కలుసుకొని తన కష్టాలను వివరిస్తే అతడు తప్పక వాయిదాఐనా యిస్తాడు అని ప్రయాణానికి సన్నద్ధుడైనాడు. కనులు సరిగా చూపానడం లేదు. చెవులు సరిగా వినిపించడంలేదు. ఊతకఱ్ఱ సాయంగాఉన్నా ఆ పాదమస్తకం శరీరం అంతా కంపించి పోయేస్థితి సత్యనారాయణది. ఈ స్థితిలో ఒంటరిగా వంద మైళ్ళు ప్రయాణం చేయడం భావ్యంకాదని ఆతనిభార్య లక్ష్మీదేవి అతనిని వారించింది. సత్యనారాయణ అర్ధాంగి నోదార్చి యింటి వద్ద జాగ్రత్త యనిచెప్పి రెండెద్దుల బండిని సిద్ధముచేయించి అందు ఆసీనుడై సమీపపు రైల్వేస్టేషనుకు బయలుదేరాడు. లక్ష్మీదేవి వృద్ధుని సాగనంపుతూ దారిలో జాగ్రత్త అని పలుమారు హెచ్చరించింది.

అతి ప్రయత్నంపై రైలుపెట్టెలోనికెక్కి కూర్చోడానికైనా శక్తిలేని తాను పడుకొని బాగా ముసుగుపెట్టుకొన్నాడు. సత్యనారాయణ. తాను దిగవలసిన స్టేషనులో తాను సక్రమముగా దిగలేనని అతనికి సందేహము కలిగింది. తాను దిగవలసిన స్టేషనును గూర్చి ప్రయాణీకులపై ప్రశ్నలవర్షం కురిపింప మొదలుపెట్టాడు. టికెట్ ఇన్స్పెక్టరుగారు వృద్ధుని సమీపించి "తాతగారూ ! మీరు దిగవలసిన స్టేషన్ సమీపించడానికి యింకా చాలాకాలం పడుతోంది. హాయిగా నిద్రపోండి ! మీరు దిగవలసిన స్టేషనురాగానే లేపుతాను," అని అభయమిచ్చి తిన్నగా సాగిపోయాడు.

సత్యనారాయణ సీటుకు యెదురుగా నున్న సీటులో యిద్దరు యువకులు కూర్చున్నారు. ఇన్స్పెక్టరుగా చన్న మాటలనుగూడా వారు బాగా విన్నారు. అందు ఒకయువకుని వయసు ఇరవై సంవత్సరాలుంటాయ్. పొడవుగా, చామనఛాయలో అందగాడుగానే కనిపిస్తున్నాడు. అతనిపేరు సురేశ్‌బాబు. తన మిత్రుని చెవిలో మెల్లగా యిట్లన్నాడు. "చూడూ మోహన్ : నే నిప్పు డొక వినోదము కల్పిస్తాను. అతడు దిగవలసిన స్టేషన్ యిదే అని నమ్మకము కల్పిస్తాను ! నీ వీ తమాషా చూడాలిసుమా !" అన్నాడు.

సత్యనారాయణ చాలా అలసి ఉన్నాడు. అతడు నిద్రాదేవి బాహులతా పంజరంలో ఒదిగి యీ జగతితో తన కేమీ ప్రసక్తిలేనట్లు ప్రశాంతంగా కన్నులు మూసుకొని నిద్రాసౌఖ్యాన్ని అనుభవింప సాగేడు. సమీపమందలి స్టేషనులో ఆగుటకు రైలువేగము తగ్గి మెల్లగా నడక సాగించింది. సురేష్‌బాబు వున్నట్టుండి పైకి లేచి వృద్ధుని సమీపించి అతని భుజమును తన చేతితో గట్టిగా తట్టుచు "మీరు దిగాల్సిన స్టేషన్ యిదే. దిగండి !" అని హెచ్చరించాడు.

సూర్యాస్తమయము సంధ్య చీకటులు బాగా అలముకొంటున్నాయి, రైలుబండిలో లైట్లు వెలిగింపబడినాయి. ఆశతవృద్ధుడు బాగా గాబరా పడ్డాడు. ఆ యువకుడు బహుశ టికెట్ యిన్స్పెక్టరుచే పంపబడ్డాడేమోనని తలచాడు. తాను దిగవలసిన స్థళము యిదేనని తొట్రుపాటున తొందరలో ఊతకఱ్ఱ సాయంతో నడచుకొంటూ ప్రయత్నముపై రైలుపెట్టెలోనుండి ప్లాటుఫారం పైన అడుగులు మోపాడు. రైలు కదలడానికి మొదలుపెట్టింది. ప్లాటుఫారంపై నిలబడిన సత్యనారాయణకు రైలుపెట్టెలో నుండి వికటంగా పరిహాసం చేస్తూన్న సురేశ్‌బాబు అతని మిత్రుడు కనిపించారు. తాను మోసపోతి నని వృద్ధుడు తెలుసుకొనునంతలోనే రైలు కదిలి సాగిపోయింది.

"ఇది సరియైన వినోదము సుమా ! శతవృద్ధుడు నేను చెప్పిన మాత్రమున, స్టేషన్ ఏదైనది గమనించలేదు. అతనికి చెవుడు, గ్రుడ్డి రెండూ జంటగా ఉన్నాయి కాబోలు! తగిన శాస్తి జరిగింది" అని కసిగలవానివలె వెటకారంగా మిత్రునితో ఛలోక్తులుగా విసురుతున్నాడు. "నేను ద్వారము సమీపించునంతలో అతడు నిజము గుర్తించి ఆగిపోతా డని తలంచుకొంటిని. ఆశ్చర్యము! ఇది చాలవింతకదా ? మోహన్ ! "అన్నాడు. మోహనుడు ఓనో నని తలపంకించాడు.

అహ్హాహ్హాహా! ఆ బుద్ధిలేని ముసలాడు స్టేషన్ పేరు పిలువబడడం ఐనా వినిపించుకోలేదు. నేను చెప్పినమాటే అతనికి వేదవాక్కయినది.

కొంత వడికి "సురేశ్‌బాబూ! నీకు చిదంబరదాసువద్ద ఉద్యోగం దొరకడమనేది కష్టమని తలుస్తాను," అన్నాడు మోహన్. ఈ మాటలు ఆమాటలు అటకు క్రొత్తగా వచ్చిన ఒక పెద్దమనుష్యుడు విన్నాడు.

"చాలు చాలు! ఇక నిలుపు! నాకు తప్పక చిదంబరదాసుగారివద్ద ఉద్యోగం లభిస్తుంది. అతనికి తెలిసిన గొప్పవారి వద్ద నుండి కావలసిన రికమండేషన్ లెటర్లూ, కాండక్టు సర్టిఫికేటులు తీసుకొని పోతున్నాను." "చాలామంది ఆ ఉద్యోగానికి ప్రయత్నం చేస్తూన్నారు సుమా!" "ఉండనీండి! వందమంది గాకపోతే రెండువందల మంది వెయిటింగ్ లిస్టులో ఉండనీయండి. వారిని నేను లెక్కపెట్టుకోను. వారి తలదన్నినట్లు నేను, కావలసినకాండక్టు సర్టిఫికేట్లు, విద్యాయోగ్యతనుసూచించు సర్టిఫికెట్లుప్రొఫెసర్ రామమూర్తిగారినుండి, ఆనరుబుల్ డాక్టరు శేషాచలం వద్దనుండి, ముద్దురావు, రైల్వేకంట్రాక్టరుగారినుండి తీసుకొని వస్తూన్నాను. ముద్దురావుగారి మాటే చాలు నాకు ఉద్యోగం సంపాదించడానికి. ఆ సమయంలో నూతన వ్యక్తి ప్రత్యేకించి పరిశీలనగా సురేశ్‌బాబు మోమును తిలకించాడు. ఇంకా సురేశ్‌బాబు తన్నుగూర్చి యేమేమో గొప్పలు చెప్పుకొంటూన్నాడు.

ఉన్నట్టుండి నవ్వి "ఇప్పుడా వృద్ధుడు ఎక్కడున్నాడు? ఎక్కడ తాను దిగాల్సిన చోటు? ఎక్కడ దిగాడు? ఎంతవింత! నేను లేపినదే తడవుగా ఎంత తొట్రుపాటుతో ఆత్రముతో రైలుపెట్టె తలుపును సమీపించాడు. నేనెప్పుడింతవింత చూడ లేదు."

నూతనవ్యక్తి మరలా పరిశీలనగ సురేశ్‌బాబును తిలకించాడు. కొంతసేపటికి సురేశ్‌బాబు వాగడం పూర్తికావచ్చింది!

* * *

రెండోట్రెయిను ఎన్ని గంటలకని? సత్యనారాయణ విచారించాడు. మరుదినం వరకు వేరే రైలు అతనికి లేదని యెవరో చెప్పారు. అది కొత్తస్థలము — రాత్రి సమయం! తనవద్ద ఖర్చులకైనా యెక్కువ పైకం లేదు! దుఃఖముతో "నే నేమి చేయడం!" అని తెరువరుల నడిగాడు. మరుదినం రైలువేళ కచటనే ఆగవలసిందిగా వారతనికి సలహా నిచ్చారు. అంతకంటె వారేసాయం అతనికి చేయలేకపోయారు. ఆరాత్రి ఆస్టేషన్‌లో ఆగాడు. ఆకలితో, నిద్ర పట్టక చాలా అవస్తపాలైనాడు. భానూదయంతో అంధకార మంతా పటాపంచలైపోయింది. ప్లాటుఫారంపయి జనం రద్దీగా అటు యిటూ తిరుగుతున్నారు. క్రొత్త క్రొత్త ప్రయాణీకులు అటూ నిటూ పచార్లు చేస్తో రైలురాకకై నిరీక్షిస్తున్నారు. కడపట యెవరో ఒక పెద్దమనుష్యుడు విధేయతాస్వభావము గల ఒకబాలునితో నడచి వస్తూన్నాడు!

వారు కొంత సమీపంలో నిలుచుండినారు. తండ్రి అన్నాడు "అటు చూడు! ఆ శత వృద్ధుడు పాపం! నిజంగా ప్రయాణము చేసే స్థితిలో లేడు. నీ వతనికి కావలసినచో నీ చేతనైన సాయం చేయి!" అన్నాడు. ఇంతలో రైలుబండి ప్లాటుఫారం చేరింది. తండ్రి తన కుమారునికి గుడ్‌బై చెప్పేళ్లాడు!

రామస్వరూప్ తిన్నగా సత్యనారాయణను సమీపించి 'సాయము చేయనా?' అని ప్రశ్నించాడు. మెల్లగా ఆ శతవృద్ధుని భుజము పట్టుకొని తిన్నగా నడిపించుకొంటూ వచ్చి రైలుపెట్టెలో కూర్చుండబెట్టేడు.

"అబ్బాయీ, నీకు కృతజ్ఞుణ్ణి! వృద్ధావ్యములో నున్న నాకు నీ లేతచేతులు బాగా బలం చేకూర్చాయి! నీ వెక్కడికి పోతూన్నావు."

"చిత్తూరికి! అక్కడ ఒక వ్యాపారి తనకు గుమాస్తా కావలయునని పత్రికలలో ప్రకటించాడు. ఒకవేళ నాకా ఉద్యోగం దొరుకుతుందేమో నని పోతూన్నాను," అన్నాడు.

సత్యనారాయణ చిఱునవ్వు నవ్వి మంచిది అబ్బాయీ నీకు తప్పక ఉద్యోగము లభిస్తుంది. నేనుగూడా చిత్తూరునకే వస్తూన్నాను. నాకు వెంకట సుబ్బయ్యగారిల్లు ఎక్కడో తెలియదు. పూర్వం అతడు మా వూరిలో ఉండేవాడు. వ్యాపారార్థం చిత్తూరు చేరి, ఒక పెద్ద భవనం కొని వ్యాపారం సాగిస్తూండి, పాపం యీ మధ్యనే అతగాడు చనిపోయాడు. అతని కుమారునితో పనుండి వచ్చాను."

"నేను చిత్తూరులో ఉండగా పెక్కుసార్లు వెంకట సుబ్బయ్యగారి ఇల్లు చూచాను. మీకు కావాలిస్తే వారి యిల్లు చూపిస్తాను."

అర్ధగంటలో రైలు చిత్తూరు చేరుకొన్నది. ఆ బాలుడు మెల్లగా రోడ్డువెంబడి నడచి, తనతో వస్తూన్న సత్యనారాయణతో 'యిదేనండీ వెంకటసుబ్బయ్యగారి గృహం!' అన్నాడు.

అబ్బాయీ నీవు చేసిన మేలు నేను ఏనాటికీ మరువలేను. ఈ ఊళ్లో చిదంబరదాసు గారనే ఒక వ్యాపారి ఉన్నాడు. అతడు నాకు చిరపరిచితుడు. అతనితో మాట్లాడిన తర్వాతే వెంకటసుబ్బయ్యగారితో నేను మాటలాడాల్సి ఉంటుంది. నీ కేమైన ఆ చిదంబరదాసుగారి యిల్లు తెలిస్తే తెలిపి పుణ్యం కట్టుకో."

"కానండీ నే నతనివద్ద ఉద్యోగమును సంపాదించడానికై వచ్చాను. మీరు అతనినే అడుగుతూండడం చాలా చిత్రంగా ఉంది."

"చిదంబరదాస్‌గారు మీకు తప్పక ఉద్యోగము యిస్తారని తలస్తాను."

"ఇదుగో గాంధీ రోడ్డులో కాంగ్రెసు భవనానికి ఎదురుగా ఉంటున్నదే చిదంబరదాసు గారి కార్యాలయం," అన్నాడు రామస్వరూప్.

నీవు అర్జీ యిచ్చుకొనే లోపుగనే వెంకటసుబ్బయ్యగారి పుత్రుడు యింటివద్ద ఉన్నదీ లేనిదీ తెలుసుకొని నేనూ అక్కడికి వస్తాను. నాకు చిదంబరదాసుగారు చాలా స్నేహితులు.

వా రిరువురు వేరుపడ్డారు. రామస్వరూప్ చిదంబరదాసుగారి ఆఫీసు చేరాడు. వరండాలో తనవలె ఒక అబ్బాయి అదే ఉద్యోగానికై వెయిట్ చేస్తూండటం కంట బడింది.

రామస్వరూప్‌కు ముందుగానే సురేశ్ బాబు చిదంబరదాసు ఆఫీసు వరండాలో ఆసీను డయ్యాడు. అతని ప్రక్కనే కూర్చున్నాడు రామస్వరూప్! ఆ యిద్దరు కుర్రాళ్లు నిరీక్షిస్తున్నారు. ఇంతలో బయటనుండి పద ధ్వని వినిపించినది. ఆ వృద్ధుడు లోనికి ప్రవేశించాడు!

"చిదంబర్ దాస్ గారూ! నేను మీకు జ్ఞాపకమున్నానా?" శబ్దము వీనుల బడడంతో చిదంబరదాసు సంభ్రమాశ్చర్యాలతో కుర్చీ నుండి లేచి వరండాలోని కేతెంచి వృద్ధుని రెండుచేతులు పట్టుకొన్నాడు.

సత్యనారాయణగారు, మీకు స్వాగతము! ఒక పర్యాయము గాదు వేయిపర్యాయాలైనా సుస్వాగతాలు మీకు అర్పించాల్సింది. ఆనాడు నా కష్టాల్లో ఆదుకొన్న నారాయణ మూర్తివే నీవు.

సత్యనారాయణను చూస్తూ అతడు మితి లేని కష్టాల్లో ఉండవచ్చని చిదంబరదాసు గ్రహించాడు. సత్యనారాయణ రుగ్ధకంఠంతో "వెంకటసుబ్బయ్యకు వేయి రూపాయలు అప్పుపడియుంటిని. అతని కుమారుడు నోటీసు జారీచేశాడు. అతడు దయాదాక్షిణ్యాలంటూ లేని మనిషి. మీరైనా అతనికి నచ్చజెప్పి వాయిదా ఐనా యిప్పించినచో మూడు నెలల్లోగా అతని బాకీ చెల్లించుకొంటాను."

"సత్యనారాయణగారు! 30 సంత్సరాలకు పూర్వం ఎవరూ స్నేహితులు ఐనా లేని దీనస్థితిలో ఆకలితో నకనకలాడిన రోజులలో నా విద్యార్థిదశలో నన్ను మీ యింటికి తీసుక వెళ్ళి పోషించారు. నీ సహాయమే లేకుంటే ఆనాడు నా విద్యే అడుగంటేది. నేడు యీ మాత్రము వ్యాపారం చేసుకోడానికి మీ రానా డిచ్చిన ఆశ్రయమే ముఖ్య కారణం! మీ సానుభూతియే నేడు నన్నింత వాణ్ణిగా చేసింది. యీ దినము నేను లక్షాధికారిని – నీవు చేసిన మేలుకు ప్రతిఫలంగా నేను కొంతైనా నీకు సాయం జేయకుంటే దైవం సంతోషించదు. నేడు నీ బాకీ మొత్తము వేయిరూపాయలు చెల్లించి నీ అవమానము విడిపిస్తాను," అన్నాడు. ఆ వృద్ధుని కండ్లలో ఆనందాశ్రువులు తొణికిసలాడినై.

"చీకటిరోజులు వచ్చినప్పుడు ఆ రామచంద్రమూర్తే కాపాడుతాడు – అన్న నా విశ్వాసం నిజంగానే ఫలించింది" అన్నాడు. ఇరువురిమధ్య యింత సుదీర్ఘమైన సంభాషణ జరుగుతూండడం – ఆ వరండాలో యిద్దఱు కుఱ్ఱాళ్ళు కాచుకొని చిదంబరదాసువైపు చూస్తూ వింటూనేయున్నాడు.

ద్వారముచెంత నిలుచుండిన సత్యనారాయణను జూచినపుడు సురేశ్‌బాబు గుండె అమాంతం ఆగినట్లయినది. కానీ యింతలో ఆ ముదుసలికి కన్నులు సరిగా కానరావు. తన్ను గుర్తించి చిదంబరదాసుగారితో తన దుడుకుతనము వీకరువుబెట్టడు. ఎటూ రామస్వరూపుకు ముందుగా రావడంచేత తనకే ఆ ఉద్యోగం లభిస్తూంది అన్న తలంపు ఎదలో బొడమి సురేశ్‌బాబుకు ఊరట కల్గించింది.

చిదంబరదాసుగారూ సత్యనారాయణగారూ యింకను యేవేవో ముప్పైసంవత్సరములకు పూర్వపు తమ జీవితానుభవాలను గూర్చి ముచ్చటించుకొంటున్నారు.

"సత్యనారాయణగారూ! యింటికి పోయి విశ్రమింపుడు. వందమైళ్ళు పయనించి ముసలితనము కావడంచేత బాగా అలసి పోయారు. మఱి మీ ప్రయాణము ప్రశాంతముగా జరిగినదా" అన్నాడు.

"బాగానే జరిగింది! కానీ...పాతికేండ్ల కుఱ్ఱా డొకడు నన్ను ఏమరించి వేరొక స్టేషన్‌లో దింపాడు. అందుచేత రాత్రి అంతయు ప్లాటుపారంపై జాగారం ఉండాల్సి వచ్చింది."

"కొంత సేపు ఆగండి. ఈ యిద్దరు అబ్బాయిలు ఇన్‌టర్‌వ్యూకు వచ్చారు. విచారించి మఱి యింటికి పోదాం."

"వార్తాపత్రికలలోని అడ్వర్టయిజ్‌మెంటు చూచి ఉద్యోగానికి అర్జీ ఉంచుకొన్నారా?" అన్న ప్రశ్నకు ఔనౌనని ఆయిద్దఱు కుఱ్ఱాళ్లు ముక్తకంఠంతో జవాబిచ్చారు. (సురేశ్ వైపు తిరిగి) నీ పేరేమిటి? అన్నాడు. "నాపేరు సురేశ్ నేను మీ ఉద్యోగానికి తగుదునని తలుస్తాను. నేను నాతో గౌరవనీయులు డాక్టరు శేషాచలం వద్దనుండీ, ప్రొఫెసర్ రామమూర్తిగారినుండి, ముద్దురావు, రైల్వే కంట్రాక్టరు గారినుండీ యోగ్యతాపత్రాలు తీసుకొని వచ్చానండి."

"అవేవీ నాకు చూపనవసరంలేదు. ప్రస్తుతానికి మీ యోగ్యతంతా నాకూ తెలుసు!"

(మిగతా 45 వ పేజీలో)

సంగీత సాహిత్యములు

కట్టా నరసింహాచార్యులు

"సంగీత మథ సాహిత్యం
సరస్వత్యా స్తనద్వయమ్
ఏకమాపాత మధుర మన్య
దాలోచనామృతమ్"

సంగీతపదము వినినంతనే సాహిత్య పదము గుర్తురాక మానదు. సంగీత సాహిత్యాలకు నాగరికతా సంస్కృతులకు వలె విడదీయ వీలులేని కలయిక సకల జగత్ప్రసిద్ధము. సంగీతంలేని సాహిత్యం గానీ, సాహిత్యంలేని సంగీతంగానీ రాణింప నేరవని విద్వాంసులకు తెలియని విషయం కాదు. సంగీత సాహిత్యాలు లేని వ్యక్తిని కొమ్ములు తోక లేని విచిత్ర జంతువుగా కొందరు సహృదయులు భావించుట సమంజసమని చెప్పకతప్పదు. నృత్త గీత వాద్యాల కలయికయే సంగీతము. ఈ సంగీతము తొట్టెలో దొర్లే బిడ్డదగ్గరనుండి పాలకడలిలో పాప పాన్పుపై పవళించే పరమాత్మవరకు హాయిని కలిగిస్తుంది. ఱాళ్ళనుకూడా కఱిగిస్తుంది. విషాన్ని వెదలగ్రక్కు ఆసీవిషాలమీదకూడా తన ప్రభావాన్ని ప్రసరింప చేస్తుంది. వేయేల! పశువులుకూడ తమ స్వాభావికమైన మొరటుతనాన్ని విడచి సంగీతంలోని సహజ మాధుర్యాన్ని అనుభవింపగలవని అనుభవజ్ఞులు చెప్పుట విజ్ఞులందరు వినే ఉంటారు. కనుక సంగీతమంటే రసజ్ఞులచే మెచ్చుకొనబడిన లలిత కళలలో ముఖ్యమైన కళ.

సాహిత్య పదమును పెద్దలు రెండు రకాలుగా నిర్వచిస్తారు. శబ్దార్థముల కలయిక సాహిత్యమని కొందరు. హిత మనగా రసము; రసాస్వాదమువలన విగళిత వేద్యాంతరము, బ్రహ్మానంద సహోదరమునగు పరమానందము కల్గును. కనుక రససహితములైన శబ్దార్థములు సాహిత్యము అని కొందరు చెప్పుచున్నారు. ఏది ఎట్లైననూ గుణాలంకార పరిష్కృతములై దోషశూన్యములైన శబ్దార్థములు కావ్య నాటకాది పద వాచ్యములై – సాహిత్యమను పేరును పొందుచున్నవి. సాహిత్యము లేని మానవుడు జన్మరాహిత్యము లేని దానవుడు. సాహిత్యము మానవునకు కీర్తిని ధనమును వ్యవహార జ్ఞానమును అమంగళ నివృత్తిని పరమానందమును కలిగించును. పురుషార్థ చతుష్టయమును సకల కళానైపుణ్యమును సంపాదించును. విజ్ఞానముతోబాటు గుణములను కూడ వృద్ధినొందించును. ఉత్తమ పురుషుల ఉదార చరితములను వినిపించి దానవుని మానవునిగా మార్చును. ఇట్టి సంగీత సాహిత్యములు సరస్వతీదేవికి సహజ భూషణములగు స్తనద్వయమని సహృదయులు నుడువుచున్నారు. మొదటిది ఆస్వాదనకాలమందే ఆస్వాదయితకు మాధుర్యమును కలిగించును. రెండవది కొంత తడవునకు ఆలోచనలో మునిగిన ఆస్వాదయితకు అమృతపు ఊటలను ఊరించును. జీవనేచ్ఛతో మాతృమూర్తియగు సరస్వతియొడిలో ఆటలాడుచున్న సహృదయుడను బిడ్డకు ఈ రెండును క్రమికాభివృద్ధిని కలిగించును.

ఐశ్వర్య గర్వ రాహిత్యములకు; సామర్థ్య పరోపకారములకు; సామ్రాజ్య దాక్షిణ్యములకు; ఔదార్య ప్రియవాదములకు వలె సాహిత్య పాండిత్యములకు అరుదుగ సమానాధికరణ్యము సంభవించుచుండును. సాహిత్యవేత్తలు వేఱు, పండితులు వేఱు. పండితులలో సాహిత్యము కొరవడియుండును. సాహితీవేత్తలలో పాండిత్యము సున్న. పాండిత్య మనగా శాస్త్రీయ విజ్ఞానము. సాహిత్య మనగా స్వప్రతిభా సంపాదితమైన సహజమగు ఆత్మసంస్కారము. ఆత్మభేదమును బట్టి సంస్కృతి మారుచుండును. శాస్త్రీయ విజ్ఞాన మందరకు సమానము. కనుకనే మన రాధాకృష్ణ పండితుడు "ఒకరుచేసిన ప్రయోగములను మఱియొకరు చేయగలరు కానీ ఒకరు వ్రాసిన కావ్యములను మరియొకరు వ్రాయజాలరనియు, అమెరికా దేశమును "కొలంబస్" కనిపెట్టియుండనిచో మఱియొకడు కనిపెట్టియుండెడివాడు అనియు; కాళిదాసు మన దేశమున జన్మించియుండనిచో నవరస నిధానమగు "అభిజ్ఞాన శాంకుంతలము"ను చదివి ఆనందించు భాగ్యము భారతీయు

లకు తదితరులకు దక్కియుండెడిది కాదనియు; షేక్స్పియర్ జన్మించనిచో "హామ్లెట్" వంటి మంజులమనోజ్ఞ మహాకావ్యమును చదువు భాగ్యము మన కబ్బెడిది కాదనియు" నుడివియున్నారు.

సాహిత్యము సామాజిక వ్యవస్థకు ప్రతిబింబము. సమాజంలోని గుణదోషములను పరిశీలించి, దోషాలను తొలగించుట సాహిత్యంలోని ముఖ్యలక్షణము. హంసలకు క్షీరనీరపృథక్కరణ సామర్థ్యము వలె, సహృదయులకు గుణదోష వివేచనము సహజమైన విద్య. అట్టి సాహిత్యమునకు కావ్యములు కుల భవనములు. నిజమృదుమధుర లలిత కవితా విలాసములతో తమ కావ్యముల నలరించిన కవులు ధన్యులు. ఒక మహాకవి ముకుంద పాదారవింద సందర్శనానందమును అందముగా వర్ణింపని తనకవిత వంధ్యయని తలచినాడు. హృద్యమగు నీ పద్యము నొకదానిని వినుడు.

"కవితా భవితాఽవదేవ వంధ్యా
భవితా యావదయం నవర్ణ్యతేహి.
తరసా సురసాలవద్వావదాన్యః
సరసాలాప విచక్షణో ముకుందః॥

విలాసకథలు వినాలనివుంటే హరినామస్మరణ చేయాలంటే సుధామధురిమ నధఃకరించు తన కావ్యమధురిమను ఆస్వాదింపుడని ఒక భక్తకవి నుడివియున్నాడు.

"యది హరిస్మరణే సరసం మనో
యది విలాసకథాసుకుతూహలమ్.
కమలకోమల కాంత పదావళీం
శృణు తదా జయదేవ సరస్వతీమ్॥

కొందరు కవన మల్లుటయన్న, ఛందోయతి నియమముల ననుసరించి పద్యములు వ్రాయుట అని భావింతురు. కానీ, పూర్వజన్మకృత సుకృతవిశేష పరిపాకము వలన లభించు ప్రతిభా విశేమువలనగానీ అది అబ్బదను విశేషమును కొందరు గ్రహింపనేరరు. ప్రతిభా విశేషమునకు వ్యుత్పత్త్యభ్యాసముల తోడ్పాటు ముఖ్యమని పండితరాజు పలికినాడు. వ్యుత్పత్తి యన అన్నిశాస్త్రములలోను అన్ని కళలలోను — లౌకికవిజ్ఞానములోను తగినంత కృషిని చేయవలెను. అభ్యాసమునగా మృద్వీకా మధు మాధుర్య ధుర్యములగు కావ్యములను రచించిన పెద్దలను సేవించి బాగోగులను తెలిసికొని పదముల — స్వారస్యమును గ్రహించుట. ఈమూడును కావ్య నిర్మాణములో సముదితములై కారణ మగుచున్నవి. హితప్రాప్తి అహిత నివృత్తి జీవాత్మ కోరు ముఖ్య కార్యములు. ఇవి వేదశాస్త్రములచే ప్రభు సమ్మితముగా ఉపదేశింపబడును. త్యాగ నిరతి స్వార్థ రాహిత్యము పరహితాచరణము కల రామచంద్రుడు మానవుడే అయిననూ; స్వార్థపరుడు, పరోపతాపి, చారిత్ర హీనుడు నైన దశవదనుని కూడ నిర్జించి విజయలక్ష్మితో కూడ తన గృహలక్ష్మి అగు సీతను గ్రహించినాడను విషయము రామాయణములో సుహృత్సమ్మితముగా చెప్పబడుచున్నది. ఇతిహాస — పురాణములలోని అర్థములను గూడ గ్రహింపనేరని సుకుమారమతులగు రాజకుమారులకు కాంతా సమ్మితముగా హితోపదేశము కొరకై కావ్యములు రచింపబడినవి. ఈ కావ్యములు గద్యరూపములోను, పద్యరూపములోను,గద్య పద్యాత్మకముగను, కన్పట్టుచున్నవి. హృద్యమగు పద్యమును ద్రాక్షపండుతో పోల్చినవాడు, అనవద్యమగు గద్యమును పుట్టతేనెతో పోల్పదగును. కనుక గద్య పద్యాత్మకములగు చంపూ గ్రంథములు తేనెలో మాగవేసిన ద్రాక్షపళ్ళని ఒక కవివతంసుడు హృదయంగమముగా పలికినాడు. విద్వత్కవి కల్పభూజుడగు భోజుడు గద్య పద్యములు వాద్య విశేషముతో నాలపింపబడిన — గీతితో పోల్చినాడు.

ఈ కావ్యములు దృశ్యకావ్యము లనియు శ్రవ్యకావ్యము లనియు రెండు విధములు. ఇందు శ్రవ్యకావ్యము లనగా విజ్ఞాన సంపన్నులైనవారు చదివి అర్థము చేసికొనునవి. దృశ్య కావ్యములనగా సంభాషణ రూపములై కుశలురగు నటులచే నటింపబడి కనులకు కట్టినట్లు నృత్యగీత వాద్యముల సాహాయ్యముతో ఆబాలగోపాలమునకును ఆనందమును కలిగించునవి. ఇవి పదిరకములుగా చెప్పబడుచున్నవి. ఇంకను కొన్ని రకములు కూడ నున్నవి.

సంస్కృతభాషలో ఈ కావ్య రచనలో పేరెన్నిక గాంచినవాడు వాల్మీకి. ఈయన "శ్రీ రామాయణము" అను మహాకావ్యమును రచించి ఆదికావ్యమును రచించిన ఘనతరమగు కీర్తిని సంపాదించినాడు.

"కూజన్తం రామరామేతి
మధురం మధురాక్షరమ్
ఆరుహ్య కవితాశాఖాం
వందే వాల్మీకి కోకిలమ్."

అని సహృదయులు ఆయనను గురించి చేసిన ప్రశంస. విద్వత్కవి కల్పభూజుడగు భోజుడు "మధుమయ భణితీనాం మార్గదర్శీ మహర్షిః" అని ఆయనను పొగడినాడు. తరువాతవాడు వ్యాసుడు. ఈయన చేసినంత రచన ఎవ్వరును చేయలేదని చెప్పవచ్చును.

"అచతుర్వదనో బ్రహ్మా
ద్విబాహురపరో హరిః
అఫాలలోచన శ్శంభుర్భగవాన్
బాదరాయణః."

అని పెద్దలచే స్తుతింపబడినాడు. ఈ యిద్దరున్నూ మహాకవులే అయిననూ, పురాణ యుగమునకు చెందినవారు. పైన చెప్పబడిన మహామనుషుల అడుగుజాడలలో నడచిన వాడైననూ, కావ్య సౌధమునకు భూమికను రచించినవాడు కాళిదాసు. ఈయన సర్వశాస్త్ర పండితుడు. సకల కళా కుశలుడు. అసమాన ప్రతిభాశాలి, ఔచిత్యమునకు ఉచితమైనమూర్తి. పూజ్య చరణులగు మా గురుచరణులు కాళిదాసుని గురించి యిట్లు నుడివియున్నారు.

"లలితామేవ వితన్వన్
సృష్టిం స్రష్టారమప్యతిశయానః
ఔచిత్యా మూర్తిరత్ర
భజనీయః కాళిదాసోత్ర."

కాళిదాసు రఘువంశము. కుమార సంభవము, మేఘసందేశము అను మూడు శ్రవ్య కావ్యములను; మాళవికాగ్ని మిత్రము, విక్రమోర్వశీయము, అభిజ్ఞాన శాకుంతలము అను మూడు దృశ్యకావ్యములను రచించినాడు.

కావ్యములు ఉత్తమములు మధ్యమములు అధమములు అని మూడు విధములు. వ్యంగ్యార్థం ప్రధానములు ఉత్తమములు. గుణీభూత వ్యంగ్యములు మధ్యమములు. అస్ఫుట వ్యంగ్యములు శబ్దార్థస్ఫూర్తి యుతములు అగు కావ్యములు అధమములు. ఈ విభాగములో ఈతని కావ్యములు మొదటి తరగతికి చెందినవి. ఈ క్రింది శ్లోకముయొక్క వాచ్యార్థ వ్యంగ్యార్థముల సొక్కపరి పరికింపుడు.

"స్థితాః క్షణం పక్ష్మసు తాడితాధరాః
పయోధరోత్సేధ నిపాత చూర్ణితాః.
వళీషు తస్యాః స్ఖలితాః ప్రపేదిరే
చిరేణనాభిం ప్రథమోదబిందవః."

పార్వతి గౌరీశిఖరంమీద పరమేశ్వరుని వివాహమాడుటకై తపస్సు చేస్తున్నది. వేసవికాలంలో చేయవలసిన తపస్సు పూర్తి అయింది. వర్షాకాలం ప్రారంభమయింది. తొలకరిచినుకులు పడ నారంభించినాయి. అని రెప్పలమీద కొంతసేపు ఆగి, పెదవులను తాడించి స్తనమండలం మీద పడి చిందరవందరై వళులలో తొట్రుపాటును చెంది, చివరకు నాభిని చేరుకున్నాయి, అని దీని వాచ్యార్థము. తొలకరిచినుకులు పడిన క్రమాన్ని ఆలోచిస్తే ధ్యాననిమగ్నయై పార్వతీదేవి కూర్చున్న విధానం స్పష్టంగా తెలుస్తుంది. ధ్యానముచేయువారు ముక్కుమీద చూపు ఉంచి నోరు మూసుకొని ఉరఃస్థలమును ముందుకు పెట్టి ధ్యానము చేయుదురు. ఈ విధానమంతా ఈ విశేషణ క్రమంలో మనకు కనబడుతుంది. పార్వతీదేవియొక్క సౌందర్యాన్ని కూడా మనము ఈ శ్లోకము వలన తెలిసికొన వచ్చును. రెప్పలమీద చినుకులు కొంత తడవు ఆగినవి కనుక రెప్పలు దట్టమైనవని తెలియుచున్నవి. చినుకులు పెదవిమీద పడి గాయపరచినవి అన్నందున క్రింది పెదవి చాల మృదులముగా నున్నదని తెలియుచున్నది. చినుకులు స్తన మండలముమీద పడి చిందర వందరైనవన్నందున కుచ కాఠిన్యము తెలియుచున్నది. త్రివళులలో తొట్రుపాటును చెందినవన్నందున నాభియొక్క గాంభీర్యము తెలియుచున్నది. దట్టమైన రెప్పలు; మృదులమైన అధరము, కఠినమైన కుచములు, విస్పష్టమైన వళిత్రయము గంభీరమైన నాభి ఏ వనితకు ఉండునో ఆమె పద్మినీజాతికి చెందిన వనిత యనియు సౌందర్యవతి యనియు సాముద్రిక శాస్త్రమున చెప్పబడినది. ఇట్లు ఆమె సౌందర్యము గూడ ఈ శ్లోకములో తెలియజేయబడినది.

సామాన్యుల రచనలు రెండవ తరగతికి గానీ మూడవ తరగతికిగానీ చెందియుండును. తరువాతి తరగతులు తక్కువ తరగతులు కావు. వ్యంగ్యార్థము కొరవడినను, అర్థాలంకారములతో నిండిన రచన అర్థచిత్రము. శబ్దాలంకారములతో నిండిన రచన శబ్దచిత్రము శబ్దార్థ చిత్రములు రెండును మూడవ తరగతికి చెందినవని. అర్థచిత్రాన్నిగురించి అందరు అన్ని వేళలా వింటూనే ఉంటారు గనుక అందరకు ఆనందాన్ని కలిగించే- శబ్దచిత్రాన్నిగురించి ముచ్చటిస్తాను. ఈ రకంలో శబ్దవైచిత్ర్యం అధికంగా వుంటుంది. భారవి మహాకవి కేవలం ఒకే ఒక అక్షరంతో తన శ్లోకాన్ని అంతను పూర్తిచేసినాడు. వినుడు.

ననోననున్నో నున్నోనో
నానా నానాన నా నను
నున్నో నున్నో ననున్నేనో
నానేనా నున్న నున్ననుత్.

దీనికి తాత్పర్యము: నలువైపులకు పారిపోవుచున్న ఓ సైనికులారా! తనకంటె హీనునిచే బాధింపబడినవాడు పౌరుషవంతుడుకాడు. హీనుని బాధించువాడు పౌరుషవంతుడు కాడు. తాను బాధింపబడినను బాధింపబడని ప్రభువు గలవాడు బాధింప బడనివాడే అగును. మిక్కిలి బాధితుడైన వానిని బాధించువాడు నిర్దోషి ఎన్నటికిని కాజాలడు. అర్థం ఎలా

ఉన్నా పద్యం వినటానికి చాలా సొంపుగా నున్నది. దీనిని చూచి మాఘుడు దకారంతో ఒక శ్లోకం వ్రాసినాడు.

"దాదదో దుద్దదుద్దాది
దాదాదో దూదదీదదోః
దుద్దాదం దదదే దుద్దే
దదాద దదదో దదః"

దానము ఇచ్చువాడు, ఖలులను బాధించువాడు, పరిశుద్ధిని — కలిగించువాడు, దుష్టులను బాధించు బాహువులు కలవాడు, దాతలైనవారికి దాతలు కాని వారికి దానముల నిచ్చువాడు, రాక్షసులను చంపువాడునగు శ్రీకృష్ణుడు శత్రువు మీదకు ఖడ్గము విసరెను అని దీని తాత్పర్యము. రెండే రెండక్షరాలతో వీరొక్క రొక్కరు అయిదారు శ్లోకాలు వ్రాసినారు. మచ్చునకొక శ్లోకము.

భారిభి ర్భారిభి ర్భిరై
ర్భాభారై రభిరేభిరే.
భేరీరేభిభి రభ్రాభై
రభీరుభిరిభై రిభాః — "మాఘుడు" మూడక్షరముల శ్లోకాలు కొన్ని వ్రాసినారు. ఏకాక్షరపాదశ్లోకాలు కొన్ని వ్రాసినారు. ఇవి సహృదయుల వీనులకు విందొనరింపగలవు.

"జజౌజో జాజి జిజ్జాజీ
తంతతోతితతాతితుత్
భాభోభీ భాభి భూభాభూ
రరారిరరిరీరరః."

మాఘ మహాకవి ఈ శ్లోకంలోని నాలుగు పాదములను జ, క, భ, ర, అను నాలుగు అక్షరములతో పూరించినాడు.

శబ్ద వైచిత్ర్యాన్ని పెంపొందించుటలో యమకానికి ముఖ్యస్థాన మమరియున్నది. యమకమనగా వచ్చిన పదమే రెండుసార్లు స్థాన నియముతో వచ్చుట. ఈ యమకం, ఆది యమకం — మధ్య యమకం, అంత యమకం, పాద యమకం, సర్వపాద యమకం, శృంఖలా యమకం అని స్థూలంగా ఆరురకాలు. మాఘుడు భారవి యమక ప్రభేదాల నన్నింటిని తమ కావ్యములలో చాల — చక్కగా సుదాహరించారు. మచ్చునకు కొన్ని ఉదాహరణములు.

హంతహంత రరాతీనాం
ధీర ధీరర్పితాతవ
కామం కామందకీనీతి
రస్యా రస్యాదివానిశమ్.

— ఇది పాదాది యమకము.

నవ పలాశ పలాశ వనం పురః
స్ఫుట పరాగ పరాగ తపంకజమ్.
మృదు లతాంత లతాంత మలోకయ
త్ససురభిం సురభిం సుమనోభరైః.

— ఇది పాదమధ్య యమకము.

సులభై స్సదా నయవతా యవతా
నిధిగుహ్యకాధిపరమైః పరమైః.
అమునాధనైః క్షితిభృతా తిభృతా
సమతీత్య భాతిజగతీ జగతీ.

— ఇది పాదాంత యమకము.

వికచవారిరుహం దధతం సర
స్సకలహంసగణం శుచి మానసమ్.
శివమగాత్మ జయాచ కృతేర్ష్యయా
సకలహం సగణం శుచి మానసమ్.

— ఇది పాద యమకము.

"వికాశమీయు ర్జగతీశ మార్గణాః
వికాశమీయు ర్జగతీశ మార్గణాః
వికాశమీయు ర్జగతీశ మార్గణాః
వికాశమీయు ర్జగతీశ మార్గణాః."

— సర్వపాద యమకము.

"సనాక వనితం నితంబరుచిరం
చిరం సుని నదైర్నదై ర్వృతమముమ్
మతా ఫణవతో వతో రస పరా
పరా స్తవ సుధా సుధాధి వసతి."
"సమీరశిశిరశ్శిరస్సు వసతాం
సతాం జవనికానికామ సుఖినామ్.
బిభ ర్తి జనయన్న యమ్మద మపా
మపాయ ధవలా వలాహకతతీః."

— ఇవి శృంఖలాయమకమునకు ఉదాహరణములు.

సర్వపాద యమకంలో అన్ని పాదాలు ఒకటిగానే ఉంటాయి చూడండి.

"వికాశమీయు ర్జగతీశ మార్గణాః" అర్జునుడు హిమాద్రి మీద తపస్సు చేస్తున్నాడు. ఈశ్వరుడు అస్త్రాలను ప్రసాదించటానికీ ఆయనను పరీక్షిస్తున్నాడు. వీరిద్దరకు మధ్యలో ఒక వన సూకరం విషయంలో వివాదం వచ్చింది. అదిఒక ఘోరమైన యుద్ధంగా మారింది. దీనిని చూడటానికి దేవతలు, మునులు, ప్రమథులు వచ్చినారు. ఇప్పుడు పరిస్థితి ఎలా మారిందో చూడండి. జగతీశుడగు అర్జునుని బాణములు వికాసమును పొందినవి. రాక్షసుల చంపు ప్రమథగణములు అర్జునుని విక్రమమును చూచి సంతసించిరి. గుణమెక్కడనున్ననూ గ్రహింపవలసినదే కదా! ఈశ్వరుని బాణములు ఆకాశములో పక్షులవలె ఎగిరిపోయినవి. అర్జునుని ఏమియును చేయలేకపోయినవి. ఈ గందరగోళమును చూచుటకు ఈశ్వరభక్తులగు మునులందరు వచ్చినారు. ఇది దీని తాత్పర్యము. భారవి "సనాకవనితం" అను పద్యమును వ్రాస్తే, మాఘుడు "సమీద శిశిరశ్శిరస్సు" అని దీనికి బదులుగా వ్రాసినాడు. ఇంకా ఎన్నెన్నో విశేషాలు శబ్దవైచిత్ర్యమును గురించి వీరిద్దరు చూపించినారు. వీరిని — "జంటకవులు" అను పేరుతో ఒక వ్యాసం వ్రాయాలని సంకల్పించాను. మఱియొక సారి మనవి చేసుకొనగలను.

కవిపుంగవులచే రసికులగు సహృదయులకు శ్రవణోపహారము నొనరింపబడిన సాహిత్యామృత రసము సంగీతముతో మిశ్రమై సరసోపదేశమును పరమానందమును విజ్ఞానమును వినోదమును వివేకమును వినయమును విశ్వశ్రేయస్సును కూడ కలిగింపగలదు. కనుక "అట్టి సంగీత సాహిత్యములు సరస్వతీదేవికి సహజ భూషణము"లను — ఆర్యోక్తి యథార్థోక్తి అని నాకు తోచుచున్నది.

పెద్దనార్యుడు దిద్దితీర్చిన

ఉత్తమ భారతపౌరుడు - ప్రవరుడు

వారణాసి వేంకటేశ్వరులు

కవిత్వ మన నేమో పూర్వ లాక్షణికులు పెక్కురీతుల నిర్వచించినారు. ఎన్ని నియమాలు చెప్పినను, వినినను– చదివినను హృదయానికి వికాసం కల్గించు – ఒక రమణీయ శోభాసంవిధాన రచనమే కవిత్వం. అట్టి రచన చేసేవాడే కవి. అతడు తన పాండిత్య ప్రతిభాదులచేత, రచనకు తగిన రసాన్ని హృదయంలో ఉద్దీపింపజేసి, భావ మాధుర్యంతో రంగరించి, కావ్యమరందాన్ని సహృదయ పాఠకలోకానికి అందిస్తాడు.

మధుకరము పుష్పంలోని మధుర మకరందాన్ని గ్రహించినట్లు – కవి రచనావస్తువునందలి సౌందర్యాన్ని దర్శించి ప్రదర్శిస్తాడు. అంతియకాదు; రసజ్ఞహృదయరంజనం చేస్తాడు. తన మనోహర భావపరంపరకు– మధురమైనభాష, రీత్యాలంకారాది కవితా సామగ్రి సమకూర్చుతాడు. అట్టి సలక్షణ రచనమే కావ్యము, మహాకావ్యము అగుచున్నది. వెన్నెలరేయియందలి విహారము లాగా మనోజ్ఞ కుసుమ పరిమళాలు ఆఘ్రాణించినరీతి – కమ్మని సంగీత శ్రవణం కరణి – సహృదయుడా కావ్యం చదివి ఆనందము పొందుతాడు. అట్టి కావ్యాన్ని అందించినవాడే మహాకవి.

ఆ శ్రేణిలోనివాడే అల్లసాని పెద్దనార్యుడు. ఆ మహాకవి ఆంధ్ర కవితా పితామహుడు. 'శిరీష కుసుమపేశల సుధామయోక్తుల' కవనము చెప్పగల ఘనుడు. 'చతురవచోనిధి, అతుల పురాణాగమేతిహాస కథార్థస్మృతియుతుడు.' మార్కండేయ పురాణాంతర్గతమైన ఒక చిన్నకథను గైకొని తన ప్రతిభా కల్పనతో లోకోత్తర ప్రబంధ సృష్టిచేసినాడు. భవ్య భావనాబలంచేత వన్నెచిన్నెలు వెలయించి – మరందమాధురీసమ కవితాధార సాగించినాడు. ఆ కవీంద్రుడు 'నవరసార్ద్ర గుంభగంభీర తర వచోజృంభణముల' ప్రబంధము గావించుటేకాక ఉత్తమ భారతీయ పౌరుని ప్రదర్శించవలె నను కొన్నాడు. అందులకై స్వారోచిషమను సంభవ కథావతారమునకు మూలమైన ప్రవరుని పాత్ర ప్రవేశపెట్టినాడు. తద్వారా ఉత్తమ భారతపౌరుని ఆదర్శగుణాలను చిత్రించినాడు.

'మహికంఠహారతరళస్ఫూర్తిన్ విడంబించు' పురము అరుణాస్పదము ఆతని నిలయము. ఆ పురమును

"......మకరాంక
శశాంక మనోజ్ఞ మూర్తి, భా
షాపరశేషభోగి – వివి
ధాధ్వర నిర్మల ధర్మకర్మ దీ
క్షాపరతంత్రు – డంబురుహ
గర్భ కులాభరణం – బనారతా
ధ్యాపన తత్పరుండు ప్రవ
రాఖ్యు డలేఖ్య తనూ విలాసుడై."

పాయకుండును. ప్రవరుడు 'మకరాంక శశాంక మనోజ్ఞమూర్తి' అనడంలో ఉత్తర కథా విస్తృతికి బీజప్రాయమైన సౌందర్య గుణాన్ని ప్రతిష్ఠించినాడు. 'మరున్నారీసిరో రత్నమైన' వరూథిని, 'యక్షతనయేందు జయంత వసంత కంతులన్ జక్కదనంబునన్ గెలువజాలినవా' డని మెచ్చుకొన్నది ఆ విప్రుణ్ణి. ఎంత సౌందర్యవంతుడైనా భారతీయుని ఏకపత్నీవ్రతాన్ని సుప్రతిష్ఠ చేయడంకోసము 'వాని చక్కదనము వైరాగ్యమున జేసి కాంక్షసేయు జారకామినులకు...భోగబాహ్య మయ్యె' అని పెద్దనామాత్యు డుద్ఘాటించినాడు. వరూథినీ యత్న వైఫల్యానికి హేతుభూతమైన ప్రవరుని వైరాగ్యాన్ని సూచించినాడు. 'కూరిమి సోమిదమ్మ సౌఖ్యావహయై భజింప' అనుటతో పరస్త్రీయందు వైరాగ్యమేకాని పత్నీ విషయంలో కాదనీ – ఏకపత్నీవ్రత నిష్ఠాతిశయమే ననీ – నిరూపణ జేసినాడు. 'తలిదండ్రులు దేవియుం దేవరవోలె' అనుటలో పార్వతీపరమేశ్వరు లందువలె కేవలం మాతాపితరులయందలి భక్తి తత్పరత సూచితము. ఎంతోకాలంనుంచి వస్తున్న భారతీయుని ఉత్తమ సంప్రదాయం మాతాపితృభక్తి – ఏకపత్నీవ్రతత్వం, ప్రవరాఖ్యునిలో ప్రతిబింబితము చేసినాడు పెద్దన కవీంద్రుడు.

ప్రవరుని రెండోవిశేషం 'భాషా పరశేష భోగి', 'అనారతాధ్యాపన తత్పరుండు' అను గుణములు. అతడు గొప్పపండితుడు. పాండిత్యానికి ఒకరి కింత విద్యాదానం చేసినప్పుడే అలంకారం. అలాంటి దివ్యోద్దేశం ప్రవరుని కున్నది. ఎందరో శిష్యులు చేరినారు. విద్యా

భ్యాసం చేస్తున్నారు. ప్రవరుడు శిష్యసమేతుడై వరణా తరంగిణి కేగి ప్రాతఃకాల స్నానాది కృత్యముల నెరవేరుస్తాడు. సూర్యోపాసన చేస్తాడు. పూజకోసం ఫలపుష్పాదుల గొనివస్తాడు. అట్టి ప్రవరుని ప్రజలు మెచ్చి చూస్తారు. ఆ విషయమునే అల్లసాని కవీంద్రుడు—

"సచ్ఛాత్రుఁడగుచు నిచ్చలు నేగి యయ్యేట
 నఘమర్షణ స్నాన మాచరించి
సాంధ్యకృత్యముదీర్చి సావిత్రిజపియించి;
 సైకతస్థలి కర్మసాక్షి కెఱగి
......వచ్చు నింటికి
 ప్రజ తన్ను మెచ్చి చూడ"

అని రచించినాడు. పాండిత్య సంపాదన, శిష్య వాత్సల్యం, విద్యా విధానం, సూర్య నమస్కారం, ఇత్యాదు లన్నీ ఋషి సాంప్రదాయం; గురుకులవాస విధానం. అట్టి ఉత్తమ భారతీయాచారములు ప్రవరునిలో ప్రస్ఫుట మగుచున్నవి.

ప్రవరాఖ్యుని మూడవ విశేషం 'వివిధాధ్వర నిర్మల ధర్మ కర్మ దీక్షాపరతంత్రుడు' అనునది. 'యౌవ్వనమందు యజ్వ' యైనాడు ప్రవరుడు. 'దాన జపాగ్నిహోత్ర పరతంత్రుడు' వివిధాధ్వర నిర్వహణలో దీక్ష వహించినాడు. దాన మొసంగుటేకాని ప్రతిగ్రహించువాడు కాడు. 'శీలంబున్ గులమున్ శమంబు దమమున్ జెల్వంబు లేబ్రాయమున్, బోలం జూచి యితండు పాత్రుడని యే భూపాలుడే వచ్చినన్ సాలగ్రామము మున్నుగా గొనడు.' తనకు భాగ్యానికే లోటులేదు. 'మాన్యక్షేత్రముల్ బెక్కు చందాలం బండు, నొకప్పుడుం దరుగ దింటం బాడియుఁ బంటయుఁ.' పాడీ పంటయు నున్నవి. ఒకటేమిటి 'వలయు భోజ్యంబు లింట నవ్వారి గాగ' నున్నవి అందుచేత అతిథి-అభ్యాగతి మొదలైన వారి నాదరించడం అతని కాచారమైనది. భార్యగూడ సహధర్మచారిణి. 'వండ నలయదు వేవురు వచ్చిరేని, అన్నపూర్ణకు నుద్దియౌ నతని గృహిణి'. కావుననే అతని యింట అన్నదానం అనవరతం జరుగుతుంటుంది. గృహస్థున కది నిర్మల ధర్మం. కావుననే ప్రవరుడు 'నిర్మల ధర్మకర్మ దీక్షాపరతంత్రు' డైనాడు. భారతీయ సత్సంప్రదాయ సిద్ధమైన అన్నదాన విధానం ప్రవరునికి తీర్చి దిద్దినాడు పెద్దనార్యుడు.

ఇట్లు ప్రవరుని పాత్ర స్వరూప స్వభావాలను నిరూపించి, అన్నదాన గుణాన్ని ప్రశంసించి, అతిథిసంతర్పణ కనుగుణమైన పాడిపంటల పెంపునుసూచించి, పెద్దన సిద్ధుని ఆగమనమున కుపపత్తిని గల్పించినాడు. సహజంగా భారతీయునికుండే తీర్థ సంసేవనాభిలాష. తైర్థకావళి యందలి భక్తి ప్రపత్తులు ప్రవరుని యందు పెద్దన ఈ విధంగా చిత్రించినాడు.

'తీర్థసంవాసు లేతెంచినారని విన్న
 నెదురుగా నేగు, దవ్వేంతయైన
నేగి తత్పదములకెఱగి యింటికి దెచ్చు,
 తెచ్చి సద్భక్తి నాతిథ్యమిచ్చు.
నిచ్చి యిష్టాన్న సంతృప్తులుగా జేయు.
 చేసి కూర్చున్నచో జేరవచ్చు.
వచ్చి యిద్ధరగల్గు వనధి పర్వత సరి
 త్తీర్థ మాహాత్మ్యముల్ దెలియ నడుగు,
 నడిగి యోజన పరిమాణ మరయు, నరసి
 పోవలయుజూడననుచునూర్పులనిగుడ్చు
 ననుదినము తీర్థ సందర్శనాభిలాష
 మాత్మనుప్పొంగ నత్తరుణాగ్నిహోత్రి."

దీనివలన ప్రతి భారతగృహస్థుయొక్క తీర్థ సేవాభిలాష ప్రవరునిలో ప్రస్ఫుట మగుచున్నది.

'అభ్యాగత సేవాపరతంత్ర సకల జీవనుడయి' యున్నాడు ప్రవరుడు. ఔషధ సిద్ధుడొకడు అతని గృహాన్ని చేరినాడు. ప్రవరుడు 'భక్తి సంయుక్తి నెదురేగి ప్రణతుడగుచు నర్ఘ్యపాద్యాది పూజనం" బాచరించినాడు. 'ఇష్టమృష్టాన్నకలన సంతుష్టు' జేసినాడు. సిద్ధుని రాకవలన తన మందిరము మాన్యమైన దని భావించినాడు. గృహమేధి మండల ముద్ధరించునది సిద్ధుని యంఘ్రి రజోవేశమే యని నిశ్చయించినాడు. సిద్ధుడు సకలక్షేత్రమహిమ లెఱిగిన ప్రసిద్ధుడు. అందుచేత 'పోయి సేవింపలేకున్న తీర్థపుణ్య మహిమ వినుటయు నఖిల కల్మషహరం' బని తీర్థమహిమ తెలుపుడని యర్థించినాడు ప్రవరుడు. సిద్ధుడు క్షేత్ర ప్రభావము లెఱిగించినాడు; తా నంత లేతవయస్సులోనే సకలక్షేత్రాల సేవించుట పాదలేపన దివ్యౌషధ కారణాననే యనినాడు. ఆమాట విని ప్రవరుడు 'కౌతుకభర వ్యగ్రాంతరంగు' డైనాడు. 'భక్తి నిబద్ధాంజలి బంధురు' డైనాడు. నన్ను శిష్యునిగా స్వీకరించి తీర్థ యాత్రలవలన ధన్యాత్మునిగా జేయుమని ప్రార్థించినాడు. ప్రవరుని ఆతిథ్యానికి, విధేయతాగుణానికి, ప్రార్థనకు సంతోషించినాడు సిద్ధుడు. దంతపుబరిణెలోని పస రిదియది యని తెలుపక ప్రవరుని పాదాలకు పూసి చనినాడు. ఇంకేమి ఆ మందు మహిమవలన తానెచ్చటికైనా ఏగగలడు విప్రుడు. హిమాలయోత్తుంగ శృంగమెత్తున పొంగిపోయినాడు. 'తుహిన భూధర శృంగ శ్యామల కోమల కానన హేమాఢ్య దరీ ఝరీ నిరీక్షాపేక్షన్' ప్రయాణం కట్టినాడు.

ఈ సిద్ధప్రవర సంభాషణము భక్తి కరుణారసోల్లసితముగను, సరస స్వభావోక్తిస్ఫోరకముగను ఒప్పుచున్నది. ప్రవరుని వినయోచిత భాషావైదుష్యం, భక్తి భావ బంధుర మగు వచన రచనా చాతుర్యం — అతని 'భాషాపరశేష భోగి'

త్వాన్ని ప్రకటిస్తున్నవి. ఇందలి సిద్ధాగమనం ప్రవరుని వినయ వినమిత శీలం – అతిథి సత్కారం – ఆవలి సంభాషణాక్రమం – మొదలైన వన్నీగూడ భారతీయ గృహస్థాశ్రమధర్మస్వరూపాన్ని ప్రత్యక్షం చేస్తున్నవి. ఈ సంభాషణ తీరు భారతీయుదేకాక పాశ్చాత్యుడు పఠించినా భారత గృహమేధీ ఆతిథ్య విధానాన్ని ఆకళింపు చేసికొంటాడు. అట్టి ఉత్తమోత్తమ అతిథి సత్కారపద్ధతిని ప్రవర పాత్రలోచిత్రించినాడు పెదనార్యుడు. ప్రవరుడు పాదలేప ప్రభావంచేత శీతశైలాని కేగినాడు. మనోహర సుందర ప్రకృతి దృశ్యాలు పరిశీలించినాడు. 'బ్రహ్మకైన ఈ నగమహత్త్వంబెన్నతరమే'యనుకొన్నాడు. రేపు వచ్చి మరికొన్ని మంజులదృశ్యాలు కందుననుకొన్నాడు. మరలిపోబోవు సరికి నీహారవారి బెరసి తత్పాద లేపంబు కరిగిపోయినది. వియద్గమనం పోయింది. అందులకు చాల విచారించినాడు. అతిథి సత్కారం – అగ్నిహోత్రాది నిత్యకృత్యాలు ఏమగునో యని దిగులొందినాడు. తుదకు 'గంధర్వ యక్షగాన ఘూర్ణితమగు నొక్కకోన' గనినాడు. ఒక భవనములో 'మరున్నారీ శిరోరత్నము'ను గాంచినాడు. ఆసుందరియగు వరూధిని అబ్బురపాటుతో 'నలకూబరసన్నిభు నద్ధరామరు'ని దర్శనం చేసికొన్నది. ఏమోమో కోర్కెలు పుట్టినవి. రూపురేఖలవలన మహీసురు డనుకొన్నది. కాని 'ఈ తనూవిభవ మెంత గొప్ప' యని తలచినది.

ప్రవరుడు వరూధినికడకేగి 'పురంబుజేర తెరవేది తెల్పుము: శుభంబు నీ కగున్' అనినాడు. శృంగార రసోద్రేక యగు వరూధిని 'వన్నెచిన్నెలు నెరపి సెలవివార' నవ్వినది. వాచికముగా 'ఇంతలుకన్నులుండ తెరు వెవ్వరి వేడెదు భూసురేంద్ర! ఏకాంతమునందున్న జవరాంద్ర నెపం బిడి పల్కరించు లా గింతియకాక' అనినది. ఏకాంతమనుటచే భయసందేహంబులకు తావు లేదనీ, 'జవరాండ్ర' ననుటచే తనకాముకత్వమును సూచించి నర్మోక్తి చాతుర్యాన్ని ప్రకటించినది. 'భూసుర కైతవకుసుమ శరాసన' ఆతిథ్యము కొమ్మనినది. 'కుసుమశరాసన' అనుటలో వట్టి యాతిథ్యము కాదని తళుకు బెళుకులు, పలుకు కులుకులు వెలయించినది. కూరిమి సోమిదమ్మనే కోరు ఏకపత్నీవ్రతుడు 'నీ వొసగునట్టి సపర్యలు మాకు వచ్చె...భక్తియ చాలు' అని నిష్కళంక సమాధానము చెప్పినాడు. 'నను నిలు సేర్పుము తల్లి' యనినాడు. ఇంతకంటె భారతీయుని గౌరవము నుడువవలెనా? పరస్త్రీని మాతృభావాన భావించు ఉత్తమాదర్శము ప్రవరునిలో ప్రతిబింబిస్తున్నది.

వరూధిని నర్మగర్భ సూచనలు వమ్మైనవి. అక్కడి 'రత్నకందరములు, నందన చందనోత్కరములు, గాంగ సైకతము లవలీ నికుంజములు' తెల్పి నిల్ప జూచినది. అవి వానికి నచ్చలేదు. తుదకు 'నిక్కము దాప నేల' యని తన వలపు తలపు వెల్లడించినది. అందులకు ప్రవరుడు 'వ్రతులై దినములు గడపెడు విప్రుల జనునే కామింప' యని వారించినాడు. ఆతని శాంతరస ప్రవాహములో వరూధిని శృంగారరసము బిందుప్రాయ మైనది. చిట్టచివరకు 'మీ యజ్ఞాల ఫలము మా కౌగిళ్ళ సుఖించుటకే కదా' యని యుక్తి వాదానికి దిగినది. తనకు అపవర్గ సుఖమే కాని స్వర్గసుఖము వలదని తృణీకరించినాడు విప్రుడు. యుక్తివాదము వీసమును ఫలింపక వీసర పోయినది. వరూధినికి కాముకత్వము హద్దు మీరినది. తెంపు చేసినది. పైబడి కౌగిలించినది. 'శ్రీహరీ' యని ప్రవరు డామెను త్రోసివైచినాడు. ఇంతకు మించిన ఇంద్రియ నిగ్రహత్వ మెందుండునూ ?

'ఆ జవ్వని మేని జవ్వాది పస కదంబించు నౌడలు' కడిగికొన్నాడు. ప్రవరుని వైరాగ్య నిష్ఠ నిరుపమానం. శాంతరసం పరాకాష్ఠ నందినది. మహోన్నత హిమ శిఖరాగ్రము నుండి అతడు ప్రపంచాని కంతటికి 'కలంచునే సతులమాయల్ ధీర చిత్తంబులన్' అని ఢంకా కొట్టి చాటినాడు. స్వాహా వల్లభుని నుతించి స్వగృహాని కేగినాడు.

ఈ విధముగ భారతీయ గృహస్థు ఉత్తమ ధర్మా లన్నీ ప్రవరునిలో చిత్రించి పెద్దనామాత్యుడు కృతకృత్యు డైనాడు. ★

(38 వ పేజీ తరువాయి)

అన్నాడు చిదంబరదాసు, జవాబు చురుకుగాను కఠినంగానూ కనిపించింది.

తర్వాత రామస్వరూపువైపు తిరిగి "నీ పే రేమి ?" అన్నాడు. "నాపేరు రామస్వరూప్ అండీ ! స్వతంత్రంగా జీవించటానికీ మా తల్లిదండ్రులను పోషించుకోడానికీ ఉద్యోగం కావలెనండీ ! యోగ్యతాపత్రా లేవీ నా దగ్గర లేవండీ !" అన్నాడు.

సత్యనారాయణ రెండడుగులు ఊతకఱ్ఱ సాయంతో ముందు కుంచి రామస్వరూప్ మంచితనాన్ని, అతడు తనకు చేసిన సహాయాన్నీ వివరించాడు,

చిదంబరదాసు సురేశ్‌ను నిశితముగా జూచి అన్నాడు – ఆ రాత్రి రైలులో నేనూ నీతోపాటే పయనించివచ్చాను. నీవు యే విధముగా యీ శతవృద్ధుని మోసగించి దింపినది నీ స్నేహితునితో జెప్పి త్రుళ్ళి పడుతూ ఉంటివి."

"ఇదిగో సత్యనారాయణగారూ ! నిన్ను వంచించిన ఆ కుఱ్ఱాడు;" అన్నాడు. సత్యనారాయణ సురేశ్‌బాబును సమీపించి జాగ్రత్తగా పరిశీలించి "ఔను: ఇతడే ?" అన్నాడు. సురేశ్, మన్నింపువేడుటకొరకు ప్రయత్నించాడు, మాటలు గొంతులోనుండి విడివడి బయటికి రాలేకపోయినై ! సిగ్గుతో, అవమానంతో అడుగులో అడుగు పెట్టుకొంటూ బయటికి వెళ్ళిపోయాడు సురేశ్‌బాబు___

రామస్వరూప్‌కు ఉద్యోగం యిచ్చి సత్యనారాయణను బాగా ఆదరించి అతని బాకీ తీర్చి సముచిత సత్కారాలతో సతనారాయణను అతని స్వగ్రామానికి సాగనంపాడు చిదంబరదాస్ !

సుభాషితరత్నాలు

దారిద్ర్యము

శ్లో॥ "దారిద్ర్యాత్ పురుషస్య బాంధవజనో వాక్యే న సంతిష్ఠతే;
సుస్నిగ్ధా విముఖీభవంతి; సుహృదః స్ఫారీభవంత్యాపదః;
సత్త్వం హ్రాసముపైతి; శీలశశినః కాంతిః పరిమ్లాయతే;
పాపం కర్మ చ యత్ పరైరపి కృతం తత్ తస్య సంభావ్యతే॥"

—శూద్రక

"పేదరికము గల పురుషుని మాటను అతని బంధువులు పాటించరు; మిత్రులు విముఖులౌదురు; ఆపదలు మూడును; బలము తగ్గిపోవును; సత్ప్రవర్తన అనుచంద్రుని కాంతి మాసిపోవును; చివరకు ఇతరుల దోషములుగూడ అతనిపైననే మోపబడుటగూడ తటస్థించును."

సాధుపురుష లక్షణము

శ్లో॥ "స్వామ్యే పేశలతా, గణే ప్రణయితా, హర్షే నిరుత్సేకతా,
మంత్రే సంవృతతా, శ్రుతే సుమతితా, విత్తోదయే త్యాగితా,
సాధౌ సాదరతా, ఖలే విముఖతా, పాపే పరం భీరుతా,
దుఃఖే క్లేశసహిష్ణుతా చ మహతాం కల్యాణమాకాంక్షతి."

—క్షేమేంద్ర

సాధుపురుషులు అధికారము వచ్చినప్పుడు మృదుత్వము, పరివారమునెడల ప్రేమ, సంతోషము గలిగినప్పుడు ఉప్పొంగకుండుట, మంత్రము (ఆలోచన)లందుగోప్యభావము. పాండిత్యము గలిగినప్పుడు మంచిబుద్ధి గలిగి యుండుట, సంపదలయందు త్యాగము, సాధుజనమునందు ఆదరభావము, దుష్టునియెడల వైముఖ్యము, పాప కార్యములయందు భయశీలత్వము, దుఃఖము గలిగినప్పుడు క్లేశములను సహించు స్వభావము, ఈ గుణములు మహాత్ములగువారికి సమస్త కల్యాణములను గలిగించును."

చంద్రదూషణము

మ॥ "విషరాశిన్ జనియింపవో, విషసహోవిర్భూతి పాటింపవో,
విషభృన్మార్గము నంటవో, విషధరుల్ వేష్టింపఁ గా లూఁదవో
విషభుక్ఫాలికఁ, బిన్ననాఁడె కనవో విఖ్యాత కౌటిల్యమున్,
విషమం బెట్లగు నీకు జీవకృతవిద్వేషంబు దోషాకరా!"

—రామరాజభూషణుడు

భీష్మకృత కృష్ణస్తుతి

మ॥ "త్రిజగన్మోహననీలకాంతి తను వుద్దీపింపఁ బ్రాభాతనీ
రజబంధుప్రభ మైనచేలము పయిన్ రంజిల్ల నీలాలక
వ్రజసంయుక్తముఖారవింద మతిసేవ్యం బై విజృంభింప మా
విజయుం జేరెడు వన్నెలాఁడు మది నావేశించు నెల్లప్పుడున్"

—పోతనామాత్యుడు.

యమునా వర్ణనము

ఉ॥ "ముందటఁ గాంచె నంత బుధముఖ్యుఁడు హల్లకఫుల్లపద్మని
ష్యందమరందపానవిలసన్మదభృంగఁ, జలత్తరంగ, మా
కందలనంగలుంగలతికాచయసంగ, సురాంగనాశ్రితానం
దితపుణ్యాసంగ, యమునన్, భవభంగ, శుభాంగ, నర్మిలిన్"

—పోతనామాత్యుడు.

సుగతి - దుర్గతులకుఁ జనువారు

చ॥ "జనులకుఁ గీడు రోయక యజస్రము ధర్మరతిం జరించి స
జ్జనగురుపూజనంబులును, సత్యహితోక్తులు, దీనపోషణం
బును, నతిథిప్రియత్వమును, భూరిదయార్ద్రితయుం గలట్టివా
రనిమిషలోకగాము లని యాత్మ నెఱుంగుము మేనకాత్మజా!"

చ॥ "పరుసనిపల్కు, బొంకు లగుపల్కులు, నన్యధనాభిలాషముం,
బరవనితావిలోలతయు, బాంధవసజ్జనవిప్రియంబు దు
శ్చరితులతోడి మైత్రియును, సంతతధర్మరతాభ్యసూయయుం
గరినిభయాన! ఘోరనరకంబున కేగెడివారి చిహ్నముల్."

—తిక్కనసోమయాజి.

పతిభక్తి


'తే. గీ॥ అనపహార్యంబు, తేజోమయంబు, సర్వ
గుణములకు నలంకారంబు, గురుతరంబు,
భామలకుఁ బతిభక్తియె పరమ మైన
భూషణం; బిట్టివే పెఱభూషణములు."

—నన్నయ.

భారతీ స్తుతి

ఉ॥ "అంబ! నవాంబుజోజ్జ్వలకరాంబుజ! శారదచంద్రచంద్రికా
డంబరచారుమూర్తి! ప్రకటస్ఫుటభూషణరత్నదీప్తికా
చుంబితదిగ్విభాగ! శ్రుతిసూక్తవివిక్తనిజప్రభావ! భా
వాంబరవీథివిశ్రుతవిహారి! ననుం గృపఁ జూడు భారతీ!


—ఎఱ్ఱాప్రెగ్గడ.




రిపబ్లిక్ దినోత్సవ పెరేడులో గవర్నరు సైనికవందనం స్వీకరిస్తున్నారు.


అసాధారణ ప్రతిభాపూర్వకమైన కృషి చూపించినవారికి రాష్ట్రపతి పోలీసు ఫైర్‌సర్వీసు పతకాన్ని. ప్రశంసాపూర్వకమైన కృషి వ్యక్తంచేసినవారికి పోలీసుపతకాన్ని ఈ దిగువ విధంగా గవర్నరు బహూకరించారు.

1. శ్రీ ఎన్. రామచంద్రన్. (అఫీషియేటింగ్) అనంతపూరంజిల్లా డిప్యూటీ పోలీసు సూపరెంటెండెంట్. 2. శ్రీ కె. ఎల్లయ్య (అఫీషియేటింగ్) డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్, క్రైంబ్రాంచి, సి. ఐ. డి., హైదరాబాదు. 3. శ్రీ ఎస్. వేణుగోపాలరావు, ఐ. పి. ఎస్., డిప్యూటీ డైరెక్టర్, సెంట్రల్‌బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, కొత్తఢిల్లీ. 4. శ్రీ పి. సూర్యారావు. డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్ (రిటైర్డ్). 5. శ్రీ టి. సుదర్శన్ రెడ్డి (అఫీషి.) డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్ మెదక్‌జిల్లా. 6. శ్రీ పి. వెంకటాచల రెడ్డి (అఫిషి.) పోలీసు ఇనస్పెక్టరు, క్రైంబ్రాంచి. సి. ఐ. డి., హైదరాబాదు. 7. శ్రీ జి. సూర్యనారాయణ (అఫిషి.) పోలీసు ఇనస్పెక్టర్, స్పెషల్ బ్రాంచి సి. ఐ. డి., హైదరాబాదు.






ఆదిలాబాదుజిల్లా, నిర్మల్‌లో నటరాజా నూలు, నేత మిల్లులకు 1965 ఫిబ్రవరి 4వ తేదీన ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు.




ముఖ్యమంత్రి. ఆర్థికమంత్రులు. నటరాజ స్పిన్నింగ్ మిల్సు డైరెక్టర్లబోర్డు సభ్యులతో ఉన్న దృశ్యం.




శ్రీ మురార్జీదేశాయి, జనవరి 28 వ తేదీన తిరుపతిలో ఐదవ అఖిల భారత సర్వోదయ సమ్మేళనానికి ప్రారంభోత్సవం చేశారు.




రాష్ట్ర రవాణా సమాచారశాఖల మంత్రి శ్రీ బి. వి. గురుమూర్తి ఫిబ్రవరి 10 వ తేదీన రష్యా వైస్ కాన్సిలేట్ జనరల్‌తో సంభాషించినప్పటి దృశ్యం.



భారత – సోవియట్ దేశాల ఆర్థిక సహకారం దశమ వార్షికోత్సవం సందర్భంగా, రష్యన్ భాషల సంఘం (ఉస్మానియా విశ్వవిద్యాలయం) అధ్వర్యంలో జరిగిన ప్రదర్శనాన్ని సమాచార, కార్మిక రవాణాశాఖల మంత్రి శ్రీ బి. వి. గురుమూర్తి సందర్శిస్తున్నారు. (ఫిబ్రవరి 10)





ముఖ్యమంత్రి ఫిబ్రవరి మొదటి తేదీన హైదరాబాదులో స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా స్థానిక హెడ్డాఫీసుకు ప్రారంభోత్సవం చేశారు.



ముఖ్యమంత్రి ఫిబ్రవరి 4 వ తేదీన నిర్మల్‌లో పంచాయతీ సమితి భవనానికి శంకుస్థాపన చేశారు.


రాష్ట్ర గవర్నరు, ఫిబ్రవరి 1 వ తేదీన రామగుండం థర్మల్ పవర్ స్టేషన్ను సందర్శించారు.






రాష్ట్ర గవర్నరు, ఫిబ్రవరి 1వ తేదీన కరీంనగర్ జిల్లా లోని గోదావరి ఖని (బొగ్గుగని)ని సందర్శించారు.


ముఖ్యమంత్రి, ఫిబ్రవరి 4వ తేదీన పోచంపాడు గ్రామ ప్రజలతో సంభాషిస్తున్న దృశ్యం.





నిర్మాణంలో నున్న పోచంపాడు ప్రాజెక్టు దృశ్యం.

ముఖ్యమంత్రి. ఫిబ్రవరి 4వ తేదీన పోచంపాడు ప్రాజెక్టు పనులను తనిఖీ చేశారు.







నేపాలు విదేశాంగమంత్రి శ్రీ కీర్తినిధి బిస్త్ జనవరి 31ః తేదీన హైద్రాబాదుకు వచ్చారు.




కేంద్ర విద్యామంత్రి శ్రీ ఎం. సి. చాగ్లా, 1965 జనవరి 16వ తేదీన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో స్నాతకోపన్యాసం చేస్తున్న దృశ్యం.




మారిషస్ ప్రధాని డాక్టర్ ఎస్. రామ్‌గులామ్, జనవరి 17వ తేదీన హైదరాబాదు విచ్చేసినప్పుడు ముఖ్యమంత్రి బేగంపేట విమానాశ్రయంలో అయనకు స్వాగతం చెప్పుతున్న దృశ్యం.




మారిషస్ ప్రధానితో రాష్ట్రగవర్నరు (17-1-65).



డాక్టర్ ఎస్. రామ్‌గులామ్ ప్రభృతులు జనవరి 19వ తేదీ గోల్కొండను సందర్శించారు.




ఆరోగ్యశాఖల మంత్రి శ్రీ ఎస్. ఆర్. వై. శివరామ ప్రసాద్ 1965 జనవరి 24వ తేదీన మహబూబ్‌నగర్‌లో నేత్రచికిత్సా శిబిరానికి ప్రారంభోత్సవం చేశారు.



నెల్లూరులో పంచాయతీ సమితి అధ్యక్షుల సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్నారు. (జనవరి 27)

రిపబ్లిక్ దినోత్సవాల సందర్భంగా రాష్ట్ర సమాచార కేంద్రం నిర్వహించిన లేఖా రచన పోటీలో పాల్గొన్న విద్యార్థీ విద్యార్థినులు.






రాష్ట్ర సమాచార కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన చిత్ర లేఖన పోటీలో పాల్గొన్న బాల బాలికలు.


జకోస్లొవేకియా ప్రతినిధివర్గానికి ఆర్థికమంత్రి డాక్టర్ ఎం. చెన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీ కె. ఎన్. అనంత రామన్ విమానాశ్రయంలో స్వాగతం చెప్పారు (ఫిబ్రవరి ౯)





జెకోస్లొవెకియా బృందం, ఫిబ్రవరి 10న భారీ విద్యుత్పరి
కరాల ఫ్యాక్టరీని సందర్శించారు.

ప్రతినిధివర్గం సనత్ నగర్ పారిశ్రామిక వాటికను
సందర్శించారు.






జెకోస్లొవెకియా బృందం గౌరవార్థం, ఫిబ్రవరి 9వ తేదీన
రవీంద్రభారతిలో మాధురి నర్తకుల నృత్య
ప్రదర్శనం జరిగింది.

జనవరి 24 వ తేదీన రాష్ట్ర సమాచారకేంద్రం నిర్వహించిన పెయింటింగ్స్ పోటీలో బాల బాలికలు పాల్గొన్న దృశ్యం.






బాల బాలికలు పాల్గొన్న మరో దృశ్యం.

ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాదును సందర్శించిన హంగరీ రాయబారి హెచ్. ఇ. జోన్స్ నాగి హైదరాబాదు దృశ్యాల ఫోటోలను తీస్తున్న చిత్రం.






హంగేరీరాయబారి హెచ్. ఇ. జోన్స్‌నాగి, ఆయనబృందం ఫిబ్రవరి 6 వ తేదీన హైదరాబాదు సందర్శించారు.




కేంద్ర ఉక్కు–గనులశాఖ మంత్రి, శ్రీ యన్. సంజీవరెడ్డి ఫిబ్రవరి 6 వ తేదీన హైదరాబాదులో భారత డిటోనేటరీ ఫ్యాక్టరీకి ప్రారంభోత్సవం చేశారు. హంగరీ రాయబారి హెచ్. ఇ. జోన్స్ నాగిని, ముఖ్య మంత్రిని, మునిసిపల్ వ్యవహారాలశాఖ మంత్రిని కూడా చిత్రంలో చూడవచ్చు.



హెచ్. ఇ. జోన్స్ నాగి, ఫిబ్రవరి 7 వ తేదీన సాలార్ జంగ్ మ్యూజియంను సందర్శించారు.


హైదరాబాద్‌లో లాలా లజపతిరాయ్ శతవార్షిక జయంత్యుత్సవములు




శాసనమండలి అధ్యక్షులు, రాష్ట్ర లాలా లజపతిరాయ్ శతజయంతి ఉత్సవాల సంఘం అధ్యక్షులు శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య రవీంద్రభారతిలో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న చిత్రం.




శాసనసభ అధ్యక్షులు శ్రీ బి. వి. సుబ్బారెడ్డి, సమావేశానికి అధ్యక్షత వహించారు.



కన్వీనర్ శ్రీ టి. రామచంద్రరావు, రాష్ట్ర కమిటీ నిర్వహించిన కృషిని వివరించారు.



లాలా లజపతిరాయ్, తిలక్‌లకు జాతి ఎంతో రుణపడి ఉన్నదని శ్రీ తెన్నేటి విశ్వనాథం అన్నారు, వారు ఎనలేని కృషి చేశారని కూడా ఆయన అన్నారు.





లాలా లజపతిరాయ్, భారత పునర్నిర్మాణానికి పునాది వేశారని శ్రీ వి. బి. రాజు అన్నారు.



లాలా లజపతిరాయ్, చరిత్రను సృష్టించారనీ, జీవితానికి సంబంధించి ఆయనకు విశాల దృక్పథం కలదనీ జస్టిస్ గోపాల్‌రావు ఎక్బోటే అన్నారు. నగరంలో లాలా లజపతిరాయ్ శతజయంతి ఉత్సవాలు జరిగినప్పటి దృశ్యాలు.


లాలాలజపతిరాయ్ శతజయంతి ఉత్సవంలో కావ్యగానం చేస్తున్న శ్రీమతి శైలబాల.






ఈ సందర్భంలో ఉపన్యసిస్తున్న శ్రీ రణవీర్.

పద్య పఠనం చేస్తున్న డా. దివాకర్ల వేంకటావధాని.






సర్వాంగసుందరంగా అలంకరించబడిన వేదికపై లాలాలజపతిరాయ్ చిత్రపటాన్ని ప్రముఖంగా ప్రదర్శించారు.

శతజయంత్యుత్సవాల సందర్భంగా రవీంద్రభారతికి విచ్చేసిన ప్రేక్షకుల దృశ్యం.







అంతరాష్ట్రీయ సాంస్కృతిక బృందం వినిమయం క్రింద డిశంబరు–జనవరి నెలల్లో రాజస్థాన్‌లో పర్యటించిన ఆంధ్రప్రదేశ్ సచివాలయ సాంస్కృతిక సంఘం వారు అక్కడ "అలగ్జాండర్" నాటకాన్ని 8 పర్యాయాలు ప్రదర్శించారు.



ముఖ్యమంత్రి హైద్రాబాదులో అఖిలభారత సాంస్కృతిక మహాసభను ప్రారంభించారు.



రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా జనవరి 26వ తేదీ సాయంత్రం సమాచారశాఖ అధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో కుమారి జయశ్రీ నాట్య ప్రదర్శన లిచ్చారు.



సాంస్కృతిక వ్యవహారాల శాఖామంత్రి శ్రీ ఎం. ఆర్. అప్పారావు కుమారి జయశ్రీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్నాడు.

(7వ పేజి తరువాయి)

మైదానాలు మొదలైన వాటికి సంబంధించి నిబంధనావళిలో నిర్దేశించబడిన కనీస అవసరాలను కూడా తీర్చుకపోవడం జరుగుతున్నది. ఇప్పటివరకు నెలకొల్పిన విద్యాసంస్థల్లో ఈ కనీసావసరాలను తీర్చ డానికి, ముఖ్యంగా తెలంగాణా ప్రాంతం విషయంలో, రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక మొత్తాలు వెచ్చించవలసి వుంటుంది. నీటి వివరాలు ఈ క్రింద పేర్కొనబడినవి:—

	అంశం		అంచనా వ్యయం
అనావృత్త వ్యయం :			రూ.
(1)	రెండవ ప్రణాళిక చివరలో వున్న పాఠశాలలో సగం, మూడవప్రణాళికలో ప్రారంభించబడిన కొత్త పాఠశాల లన్నీ		
(అ)	భవనాలు —		9,64,80,000
(ఆ)	సాధన సామగ్రి —		3,21,60,000
(ఇ)	ఆట మైదానాలు —		1,60,80,000
		మొత్తం	14,47,20,000
ఆవృత్త వ్యయం :			
(2)	విద్యా నిబంధనావళి ననుసరించి టీచర్లనూ, ఇతర సిబ్బందినీ నియమించడానికి (సంవత్సరానికి ఒకకోటి రూపాయిల చొప్పున ఆవృత్త వ్యయం)		1,00,00,000.

సిబ్బందికొరత వున్న పాఠశాలల్లో టీచర్లనూ, ఇతరసిబ్బందినీ నియమించే నిమిత్తం మూడవప్రణాళికలో. ఏటా సుమారు రూ. 30 లక్షల మేరకు కేటాయింపుచేశారు.

బృహత్తర హైద్రాబాదు నగరంలోని ప్రభుత్వ సెకండరీ పాఠశాలల విషయంలో పాఠశాలా భవనాల నిమిత్తం, 1964–65 వ సంవత్సరం నుంచి ఏటా రూ. 10 లక్షల చొప్పున ఆవృత్తవ్యయాన్ని కేటాయించడం జరిగింది. జిల్లా పట్టణ ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలా భవనాలను అభివృద్ధి పరిచేందుకై ఏటా రూ. 5 లక్షల చొప్పున అవృత్త వ్యయాన్ని 1965 66వ సంవత్సరం నుంచి కేటాంచడానికై ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేయబడినవి. ప్రభుత్వ నిర్వహణ క్రింద లేని పాఠశాలా భవనాలను అభివృద్ధి పరిచే నిమిత్తం కూడా — సహాయక గ్రాంటు కోడ్‌తో నిమిత్తం లేకుండా — ఇదే విధంగా ఆవృత్తవ్యయాన్ని కేటాయించడానికి సూచన చేయబడింది.

బాలికలకై సెకండరీ విద్యా సౌకర్యాలను విస్తృతీకరించడానికి అత్యవసరంగా ఆచరించవలసిన కార్యక్రమాలలో విద్యార్థినుల కొరకు హాస్టళ్ళను, ఉపాధ్యాయినుల కొరకు వసతి గృహాలను సమకూర్చడం ప్రధానమైనది. ఈ కార్యక్రమాన్ని ముమ్మందు చేపట్టవలసివుంది.

రాష్ట్రంలో, మూడవపంచవర్ష ప్రణాళికా కాలంలో సెకండరీ విద్యా సౌకర్యాల విస్తృతీకరణ సందర్భంగా రాష్ట్రంలోని శిక్షణ కళాశాలల్లో ఉపాధ్యాయులకు శిక్షణ సదుపాయాలను పెంపొందించవలసివుంది. విశ్వవిద్యాలయాల ఆమోదంతో, రాష్ట్రంలోని 9 శిక్షణ కళాశాలల్లో ప్రవేశ సంఖ్యను ఒక్కొక్క దానిలో 150 ల చొప్పున హెచ్చించడం జరిగింది. 1965–66 వ సంనత్సరం నుంచి ప్రతి కళాశాలలోని అభ్యర్థుల సంఖ్యను 200 వరకు పెంచడానికి అనుమతి యివ్వాలని విశ్వవిద్యాలయాలను కోరడం జరిగింది. పట్టభద్రులై ఉండి సెకండరీగ్రేడ్ శిక్షణపొందిన ఉపాధ్యాయుల ప్రయోజనార్థమై 1962–63 వ సంవత్సరం నుంచి 5 నెలల బి. యిడి. కోర్సును ప్రారంభించారు. హైదరాబాదు, రాజమండ్రీలలో ఉన్న ప్రభుత్వ శిక్షణ కళాశాలలో రెండు కేంద్రాలను నెలకొల్పి వాటిలో సంవత్సరానికి రెండుసార్లు యీ కోర్సును నిర్వహిస్తున్నారు. ప్రతి కళాశాలనుండి సంవత్సతానికి 200 మంది డొప్పున పట్టభద్రులు యీ కోర్సులో శిక్షణ పొందుతున్నారు.

తెలంగాణా ప్రాంతంలోని సెకండరీ పాఠశాలల్లో విజ్ఞానశాస్త్రం బోధించగల శిక్షణపొందిన పటభద్రులైన ఉపాధ్యాయుల కొరత చాలాఉంది. ఈ సబ్జెక్టులలో బోధనావృత్తి స్వీకరించడానికి తగినంతమంది పట్టభద్రులు ముంధుకు రావడానికి వీలుగా బి. యిడి శిక్షణకాలంలో నెలకు రు 90. ల చొప్పున స్టయిఫండు ఇవ్వడానికీ, అటువంటి ఉపాధ్యాయులకు ఎక్కువస్కేలుతో జీతంగానీ లేక ఎక్కువ ప్రారంభ జీతంగాని ఇవ్వడానికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి.

నాలుగవ పంచవర్ష ప్రణాళికా కాలంలో అన్నిస్థాయిలలో మరింత అభివృద్ధిని సాధించడానికి సెకండరీ విద్యకు చెందిన వర్కింగ్ గ్రూపు దిగువతెల్పిన సూచనలను చేసింది.

వరుసనెంబరు	అభివృద్ధి అంశం		ఖర్చు అంచనా
1.	క్రొత్తగా ఉన్నత పాఠశాలలను ప్రారంభించడం, ప్రస్తుతం ఉన్న సెకండరీ పాఠశాలలో అదనపు సెక్షన్లను ప్రారంభించడం.	రూ.	10,00,00,000
2.	భాషాబోధన ఉపాధ్యాయుల, వ్యాయామ విద్య ఉపాధ్యాయుల శిక్షణ నిర్వహణ,	రూ.	35,00,000
3.	ఉన్నతపాఠశాలల భవనాలకు	రూ.	1,7500,000
4.	ఉన్నత పాఠశాలల పరికరాలు	రూ.	7,59,9,000
5.	బాలికల హాస్టల్ భవనాలకు	రూ.	20,00,000
6.	బీదబాలికలకు స్టయిఫండు	రూ.	10,00,000
7.	రెసిడెన్షియల్ పాఠశాలలు	రూ.	50,00,000
8.	సెమినార్లు, వర్కు-షాపులు మొదలైనవి	రూ.	10,00,000
9.	బి. యిడి. ఉపాధ్యాయ శిక్షణసౌకర్యాల విస్తరణ	రూ.	25,00,000
	మొత్తం	రూ.	14,00,00,000

కళాశాల విద్య

రెండవ ప్రణాళిక ఆఖరు వరకు రాష్ట్రంలో ప్రభుత్వ యాజమాన్యంలో 14 (12 పురుషులవి, 2 స్త్రీలవి), ప్రైవేటు యాజమాన్యంలో 36 (31 పురుషులవి. 5 స్త్రీలవి) అనుబంధ ఆర్ట్సు, సైన్సు కళాశాలలు ఉన్నాయి. యీ కళాశాలల నిర్వహణ ఖర్చు మొత్తం రు. 1,58,00,000/-లు మూడవ ప్రణాళిక కాలంలో యింతవరకు ప్రభుత్వ అధ్వర్యంలో 2 (చిత్తూరులో ఒకటి పురుషులకు, నెల్లూరులో ఒకటి స్త్రీలకు) ప్రైవేటు అధ్వర్యంలో 16 (11 పురుషులకు, 5 స్త్రీలకు) మొత్తం 18 ఆర్ట్సు, సైన్సు కళాశాలలను నెలకొల్పారు. ఇందులో విద్యా బోధన హిందీ భాషద్వారా జరుగు కళాశాల ఒకటి, ఉర్దూ భాషద్వారా జరుగు కళాశాల ఒకటి కూడా చేరియున్నవి. 1965-66 వ సంవత్సరంలో 3 లేక 4 కళాశాలలను ప్రారంభించే ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి. ఇందు ఒకటి స్త్రీల కళాశాల. అవసరాలకు ఆదుకోవడానికి వీలుగా ప్రస్తుతం ఉన్న అనేక కళాశాలలో ప్రత్యేకంగా సైన్సు సబ్జెక్టులలో అదనపు కోర్సులను ప్రారంభించారు.

మూడవ ప్రణాళికా కాలంలో రాష్ట్రం లోని కళాశాలలన్నిటిలో 1961 మార్చి 1వ తేదీ నుంచి ఉపాధ్యాయ సిబ్బందికి యు. జి. సి. జీతాల స్కేళ్ళను రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసింది. మూడవ ప్రణాళిక ఆఖరువరకు దీనికి అయ్యే అదనపు ఖర్చులో పురుషుల కళాశాలలకు 50 శాతం. స్త్రీల కళాశాలలకు 75 శాతం చొప్పున కేంద్రసహాయం లభిస్తుంది.

పి. యు. సి; మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సులను ప్రవేశపెట్టిన కారణంగాను, యు. జి. సి. జీతాల స్కేళ్ళను అమలుజరిపిన కారణంగాను జరిగే ఖర్చులను భరించి కళాశాలలను నిర్వహించడం క్లిష్టంగా ఉన్నదని ప్రైవేటు మేనేజిమెంటు వారు ప్రభుత్వానికి పదేపదే నివేదించుతున్న కారణంగా యీ సమస్యలను పరిశీలించి తగు సిఫార్సులు చేయడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ డి. యస్. రెడ్డి అధ్యక్షతన ఒక ఉన్నత స్థాయి కమిటీని ప్రభుత్వం నియమించింది. నికరంగా కలిగే లోటుకు సమానంగా బోధనా గ్రాంటుగా ఇవ్వడానికి వీలుగా సహాయకగ్రాంట్లు విధానాలను సుళువుచేయాలని యీ కమిటీ సిఫారసు చేసింది. కళాశాలవిద్యలో క్రొత్త సంస్కరణలను ప్రవేశపెట్టిన తర్వాత నెలకొల్పబడిన కళాశాలలలో 1963-64 వ సంవత్సరంలో సైన్సు విద్యార్థికి రూ. 15/- ల చొప్పున 1964-65 వ సంవత్సరంనుంచి అన్ని కళాశాలలలో (క్రొత్తవి. పాతవి) సైన్సువిద్యార్థికి వార్షికంగా రూ. 5/- ల చొప్పున ప్రత్యేక లెబొరెటరీ గ్రాంట్లు ఇవ్వాలనికూడా యీ కమిటీ సిఫారసు చేసింది. ప్రభుత్వం యీ సిఫార్సులను ఆమోదించి పై ప్రాతిపదికపై గ్రాంట్లను ఇస్తున్నది. అనుబంధ కళాశాల లన్నిటిలో యు. జి. సి. జీతాల స్కేళ్ళ ప్రాతిపదికపై మదింపుచేసి కళాశాలలకు బోధనా గ్రాంట్లను ఇస్తున్నారు.

ప్రభుత్వ కళాశాలలలో బోధనేతర సిబ్బందికి ఇచ్చే జీతాలస్కేళ్ళనే 1961 నవంబరు 1 వ తేదీనుంచి ఎయిడెడ్ కళాశాల బోధనేతర సిబ్బందికి కూడా ప్రభుత్వం వర్తింపజేసింది.

నాలుగవ ప్రణాళికా కాలంలో అభివృద్ధికై కళాశాల విద్యా వర్కింగ్ గ్రూపు దిగువ దెల్పిన సూచనలను చేసింది.

వరుస నెంబరు	అభివృద్ధి అంశాలు	ఖర్చు అంచనా లక్షలలో		
		అనావృత	ఆవృత	మొత్తం.
1.	రాష్ట్రంలో రెండు పోస్టు గ్రాడ్యుయేటు కేంద్రాలు	60	40	100
2.	రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల ఆవరణల కళాశాలల అభివృద్ధి (ప్రతి విశ్వవిద్యాలయం ఆవరణకు రు. 35 లక్షల చొప్పున)	90	15	105
3.	రాష్ట్రంలో క్రొత్తగా పది కళాశాలలను స్థాపించుటకు (అవసరాన్ని అనుసరించి కొన్నిటిని స్త్రీలకై ప్రత్యేకించడం)	70	42	112
4.	భవనాల నిర్మాణం :			
	(అ) కళాశాలకు రు. 6 లక్షల చొప్పున 6 ప్రభుత్వ కళాశాలలకు	36	—	36
	(ఆ) కళాశాలకు రు. 3 లక్షల చొప్పున 10 ఏడెడ్ కళాశాలలకు (మిగతా రు. 3 లక్షలు ప్రైవేటు యాజమాన్యం భరించాలి.)	30	—	30
5.	1000 మందికి తక్కువగా సంఖ్యగల ప్రస్తుతం ఉన్న డిగ్రీ కళాశాలల అభివృద్ధికి	175	25	200
6.	2 డిగ్రీ విద్యాకళాశాలల స్థాపనకు	25	15	40
7.	ప్రస్తుతపు వ్యాయామ విద్యా కళాశాలల అభివృద్ధికి	13	2	15
	మొత్తం ...	499	139	638

మొదటి ప్రణాళికా కాలంనుంచి యింతవరకు నెలకొల్పబడిన విద్యాసంస్థల సంఖ్య చాలినంత అభివృద్ధి అయినది కానీ, తగిన భవనాలు, పరికరాలు, ఆట స్థలాలు, ఉపాధ్యాయులు, ప్రత్యేకంగా గణిత శాస్త్రం, విజ్ఞాన శాస్త్రాలు, భాషలకు చెందినవారు మొదలైన యితర అవసరాలు తగినంతగా లభించలేదు. ఇంతవరకు జరిగిన విస్తరణను సమీకరించి, వచ్చే సంవత్సరాలలో విద్యాస్థాయి ప్రమాణాలను పెంపొందించే సమస్యను విద్యాశాఖ ఎదుర్కొంటున్నది.

రాష్ట్రంలో ప్రస్తుతం స్టేట్ ఎడ్యుకేషనల్, వొకేషనల్ గైడెన్సు బ్యూరో, స్టేట్ ఎవాల్యుయేషన్ యూనిట్, రాష్ట్ర విద్యా శిక్షణ సంస్థ, సైన్సు ఎడ్యుకేషన్ యూనిటు పనిచేస్తున్నాయి. మన విద్యా ప్రమాణాలను పెంపొందింపజేయడమే యీ సంస్థ లన్నిటి ఉద్దేశం. రాష్ట్రంలోని సంస్థల స్థాయిని అభివృద్ధిచేయడానికి అవసరమైన పథకాలను రూపొందించడంలో యీ సంస్థల పరిశీలనా కృషి అనుభవం తోడ్పడుతుంది.

ప్రభుత్వేతర విద్యాసంస్థలకు సంబంధించినంత వరకు సహాయక గ్రాంటు నిబంధనలలో పేర్కొన్న పరిమితులకు లోబడి నిధులు లభించే అవకాశాన్ని అనుసరించి విద్యాసంస్థలకు భవనాలను, పరికరాలను ప్రభుత్వం లభింపజేస్తుంది,

ప్రభుత్వ విద్యా సంస్థలకు సంబంధించినంతవరకు మూడవ ప్రణాళికా కాలంలో దిగువ తెల్పిన పెద్ద భవనాల పథకాలను మంజూరు చేయడం జరిగింది. ✻

✻ భవనాల నిర్మాణం :-

1 1. శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్సు కళాశాల, కరీంనగర్ రు. 14.80 లక్షలు.
2. ప్రభుత్వ ఆర్ట్సు కళాశాల, సిద్దిపేట ... రు. 14.80 లక్షలు.
3. ప్రభుత్వ ఆర్ట్సు కళాశాల, చిత్తూరు ... రు 14.80 లక్షలు.
4. దొడ్ల కౌసల్యమ్మ ప్రభుత్వ స్త్రీల ఆర్ట్సుకళాశాల, నెల్లూరు. రు. 14.80 లక్షలు.
5. హైదరాబాదులోని ప్రభుత్వ సిటీ సైన్సు కళాశాలలో అదనపు బ్లాకు రు. 2.75 లక్షలు.
6. హైదరాబాదులోని ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల, హాస్టల్‌లకు అదనపు బ్లాకు. రు. 0.75 లక్షలు.

2 శ్రీకాకుళంలోని ప్రభుత్వ ఆర్ట్సు కళాశాల హాస్టల్ బ్లాకు రు 5.36 లక్షలు.
3 కర్నూలులోని ప్రభుత్వ శిక్షణ కళాశాల హాస్టల్ బ్లాకు రు. 5.14 లక్షలు.

సెకండరీ పాఠశాలలు :—

హైదరాబాదు, సికింద్రాబాదు నగరాలలోని పాఠశాలల భవనాల అభివృద్ధి (వచ్చే కొన్ని సంవత్సరాలవరకు ఏటా యీ కేటాయింపు జరుగుతుంది.) రు. 10.00 లక్షలు.

భవనాల పథకాలు :—

ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, శ్రీకాకుళం రు. 5.09 లక్షలు.
ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, అదోని రు. 2.65 లక్షలు.

భారతీయ భాషలలో మీ టెలిగ్రాములు

టెలిగ్రాములను
ఏ భారతీయ భాషలోనైనా
మీరు
పంపించవచ్చును
అయితే
మీరు పంపే సందేశాన్ని
దేవనాగరిలిపిలో
వ్రాయవలసి వుంటుంది

ఇంగ్లీషు లిపిలో పంపే టెలిగ్రాములకు లభించే సౌకర్యాలు మీకు దేవనాగరిలిపిలో కూడా లభిస్తాయి-ఇవి ఏవంటే శుభాకాంక్షల టెలిగ్రాములు (శుభాకాంక్షల పదసముచ్చయం హిందీలో), డీలక్స్ టెలిగ్రాములు.

ప్రెస్ టెలిగ్రాములు, మానవజీవితానికి సంబంధించిన ప్రయారిటీ టెలిగ్రాములు, ఫోనోగ్రాములు, మరియు సంక్షిప్తమైన టెలిగ్రాఫిక్ చిరునామాలు.

ఈ సౌకర్యం 2000 టెలిగ్రాఫ్
ఆఫీసులలో లభిస్తుంది

తంతి - తపాలా శాఖ

ప్రభుత్వ నిర్ణయాలు

- గనులవద్ద సరుకు ఎక్కువగా నిలువ ఉన్న కారణంగా కంపెనీ ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితి దృష్ట్యా దాని తక్షణ అవసరాలను ఆదుకోవడానికి వీలుగా సింగరేణికాలరీస్‌కు స్వల్పకాలిక ఋణంగా రు 25 లక్షలు యివ్వడానికి ప్రభుత్వం నిశ్చయించింది.

- రాష్ట్రకేంద్ర సహకారబ్యాంకు, జిల్లాకేంద్రబ్యాంకులకు రు 28 లక్షలమేరకు వాటా పెట్టుబడిధనం రూపంగా యివ్వడానికి ప్రభుత్వం నిశ్చయించింది. రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా వారు వ్యవసాయ పరపతి నిధినుండి అంతే మొత్తాన్ని యిస్తారని ఆశించబడుతున్నది. యీ మొత్తాలను దిగువవిధంగా పంపిణీ చేస్తారు:

- రాష్ట్రకేంద్ర సహకారబ్యాంకు: రు 20.00 లక్షలు. కాకినాడ, రాజమండ్రి, మచిలీపట్నం భోనగిరిలలోని కేంద్రబ్యాంకులకు రు 2.00 లక్షల చొప్పున.


- భూమి తనఖాబ్యాంకుఋణాలు మంజూరు చేసే దస్తావేజులపై రిజిస్ట్రేషన్ స్టాంపు రుసుముపై యిచ్చే రాయితీని సన్నకారు రైతులకు వర్తింపజేయాలని ప్రభుత్వం నిశ్చయించింది. దీనివల్ల ఆంధ్రప్రాంతంలో రు 1.71 లక్షలు, తెలంగాణా ప్రాంతంలో రు 2.25 లక్షలమేరకు నష్టం కలుగుతుంది. తెలంగాణా ప్రాంతంలో యీ రాయతీ నిరవధికంగా అమలులో ఉంటుంది.

- రాష్ట్రంలోని దేవాలయం మేనేజిమెంట్లను, వాటి ఆస్తులను సక్రమంగా పటిష్ఠవంతంగా పర్యవేక్షించడానికి వీలుగా దేవదాయశాఖ అసిస్టెంటు డైరెక్టర్లకు, డిప్యూటీ అసిస్టెంటు కమీషనర్లకు వినియోగానికి 15 జీపుకార్లను కేటాయించాలని నిశ్చయించారు.

క్రిషి

భారత వ్యవసాయరంగంలో అమోఘమైన సేవ చేస్తున్న క్రిషి పంపుసెట్లు - తక్కావీ పథకాల
క్రింద అనేక రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతించాయి.

ఇప్పుడు మీరు అధికంగా పండించండి



W 5 క్రిషి
5. H. P.
కిరోసిన్ ఇంజన్లతో

తయారు చేశేవారు:- **క్రిషి ఇంజన్స్ (ప్రై) లి.** సనత్‌నగర్, హైద్రాబాద్. ఏ. పి.

అన్ని జిల్లాలలోనూ మా డీలర్లు విక్రయానికీ, సర్వీసులకూ లభ్య మౌతారు

ఇతర వివరాలకు సంప్రదించండి :

క్రిషి ఇంజన్స్ ప్రైవేటు లిమిటెడ్

నెం. 2. దుర్గాభవన్, రాష్ట్రపతిరోడ్, సికింద్రాబాద్ (ఆం. ప్ర.)

దక్షిణ ప్రాంతపు ఉత్సవములు
రథోత్సవం

పరంపరాగతముగా వస్తూన్న ఈ రథోత్సవం
అత్యంత వైభవముగా జరుగుతుంది.
పవిత్రమైన దేవాలయము, రమణీయ పరిసరములు,
ఏడాదిపొడుగునా ఉత్సవములు - ఇవన్నీ
అక్కడి ప్రజల జీవితములో ఒక భాగమైపోయినాయి.

వివిధ ప్రాంతాలను సందర్శించండి - ప్రజలను కలుసుకోండి

✲ ఈ విషయములో మీకు ఏ సమాచారము కావలసినా, మీకు సమీపములో వుండే ఈ క్రింది భారత ప్రభుత్వ టూరిస్ట్ కార్యాలయాలనుండి తెలుసుకోండి:
ఢిల్లీ * బొంబాయ్ * కలకత్తా * మద్రాస్ * ఆగ్రా * జయపూర్ * వారణాశి * ఔరంగాబాద్ * కొచ్చిన్.

DA 63/466

Edited & Published by the Director of Information and Public Relations, Andhra Pradesh, Hyderabad-1.

STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS ABOUT NEWS PAPER (ANDHRA PRADESH) TO BE PUBLISHED IN THE FIRST ISSUE EVERY YEAR AFTER LAST DAY OF FEBRUARY

Form IV

(See rule 8)


Place of Publication		...	*Hyderabad*
Periodicity of Publication		...	*Monthly*
* Printer's Name		...	*A. Sudhakara Rao* *"Yuva Press"*
Nationality		...	*Indian*
Address		...	*5-9-88 Public Garden Road, Hyderabad*
Publisher's Name		...	*T. Ramachandra Rao*
Nationality		...	*Indian*
Address			*Deputy Secretary to Govt., G.A.D. and ex. officio Director of Information & Public Relations*
Editor's Name	Editor-in-Chief Editor	...	*T. Ramachandra Rao* *K. Lakshmana Shastri*
Nationality		...	*Indian*
Address			*Deputy Secretary to Govt., G. A. D. and ex officio Director of Information & Public Relations, Hyderabad*
Name and address of individuals who own the newspaper and partners or shareholders holding more than one percent of the total capital			——

I, T. Ramachandra Rao, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

T. RAMACHANDRA RAO,

Signature of the Publisher :

* The Director of Govt. Printing, Hyderabad-24, is the official printer but he may name any press when he is not able to print.



Reged. No. H. 133

